ఓటుతోనే సక్రమ పథకాలు

- రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్

లోపలి పేజీలో..

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 171 | విజయవాడ, శుక్రవారం 26 జనవరి 2024 | 8 + 8 పేజీలు వెల : 5. 50

Vol No | Vijayawada, Friday 26 January 2024 | Rs

భారత ప్రజాస్వామ్యం ప్రాచీనమైనది!

- మహిళా సాధికారతతో మరింత మెరుగైన పాలన
- గణతంత్ర దినోత్సవ సందేశంలో రాష్ట్రపతి ముర్ము



లోపలి పేజీలో..

చిరంజీవికి పద్మవిభూషణ్

- ప్రజావ్యవహారాల్లో వెంకయ్యనాయుడుకు
- హరికథా కళాకారిణి ఉమామహేశ్వరికి పద్మశ్రీ



చిరంజీవి



వెంకయ్యనాయుడు



ఉమామహేశ్వరి

న్యూఢిల్లీ : ప్రముఖ సినీ నటుడు చిరంజీవికి ప్రతిష్టాత్మక పద్మవిభూషణ్ అవార్డు దక్కింది. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం రాత్రి కేంద్ర ప్రభుత్వం 2024వ సంవత్సరానికి పద్మ పురస్కారాలను ప్రకటించింది. ఐదుగురికి పద్మ విభూషణ్, 17మందికి పద్మభూషణ్; 110 మందికి పద్మశ్రీ అవార్డులను కేంద్రం ప్రకటించింది. ఈ జాబితాలో ఆంధ్రప్రదేశ్ నుండి కళారంగంలో విస్తృత సేవలు అందించినందుకు ప్రముఖ సినీ నటుడు కొణిదెల చిరంజీవిని ఎంపికచేసినట్లు పేర్కొన్నారు. దీంతో తెలుగు సినీ రంగంలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. చిరంజీవికి పలువురు అభినందనలు తెలిపారు. రాష్ట్రానికే చెందిన మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడుకు కూడా పద్మవిభూషణ్ దక్కింది. ప్రజా వ్యవహారాల్లో విశేష కృషి చేసినందుకు ఈ అవార్డును ప్రకటించారు. మొత్తం ఐదుగురికి పద్మవిభూషణ్ ప్రకటించగా, వారిలో ఇద్దరు ఆంధ్రప్రదేశ్‌కు చెందినవారే. వీరుకాకుండా, తమిళనాడుకు చెందిన ప్రముఖ నటీమణి బి.వైజయంతి మాల, పద్మ సుబ్రమణ్యం (కళారంగం), సోషల్‌వర్క్ విభాగంలో బీహార్‌కు చెందిన సులబ్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకుడు బిందేశ్వర్‌పాఠక్ (మరణానంతరం)కు పద్మవిభూషణ్ ప్రకటించారు.

కృష్ణాజిల్లా మచిలీపట్నంకు చెందిన హరికథా కళాకారిణి డి.ఉమామహేశ్వరికి పద్మశ్రీ అవార్డు దక్కింది. దేశంలోనే ఏకైక సంస్కృత కథా కళాకారిణిగా ఆమె ప్రసిద్ధి చెందారు. భారతదేశంతో పాటు వివిధ దేశాల్లోనూ ఆమె హరికథా ప్రదర్శనలిచ్చారు. గత ఏడాది కేంద్ర ప్రభుత్వం సంగీత నాటక అకావడమీ అవార్డును బహుకరించింది. ఆమె తండ్రి దాలిపర్తి లాలాజీరావు వేములవాడ మిగతా 6లో



తుళ్లూరులో 1500వ రోజును సూచిస్తూ ప్లకార్డులతో నినాదాలు చేస్తున్న రాజధాని రైతులు, చిన్నారులు

రాజధాని విషయంలో.. వైసిపి, బిజెపి ముద్దాయిలే

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను గద్దెదించాలి
- మహిళల పోరాటం స్ఫూర్తిదాయకం
- అమరావతి రైతుల సమర శంఖారావం సభలో వక్తలు
- రాజధానిలో 1500వ రోజు వినూత్న కార్యక్రమాలు

ప్రజాశక్తి - తుళ్లూరు (గుంటూరు జిల్లా)

రాజధాని విషయంలో వైసిపి, బిజెపి రెండూ ముద్దాయిలేనని, ప్రజా కంటక పాలన సాగిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను గద్దె దించాలని వెలగపూడిలో జరిగిన సభలో వక్తలు పిలుపునిచ్చారు. రాజధాని అమరావతి మహోద్యమం గురువారం 1500వ రోజుకు చేరిన సందర్భంగా గురువారం 'అమరావతి రైతుల సమర శంఖారావం' పేరుతో సభ నిర్వహించారు. రాజధాని గ్రామాల్లో పలు కార్యక్రమాలు చేపట్టారు. తుళ్లూరులో రైతులు, చిన్నారులు 1500 రోజులను సూచించే ప్లకార్డులు పట్టుకొని జై అమరావతి అంటూ నినదించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ... ఒక మోసగాడు, నయవంచకుడు రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయితే ఏ రకంగా ఉంటుందో రాష్ట్రంలో జరుగుతున్న అరాచకాలే అందుకు ఉదాహరణ అని అన్నారు. మూడు రాజధానుల డ్రామాను తుగ్లక్ చర్యని ఏ ఎమ్మెల్యే కూడా మాట్లాడే పరిస్థితిలో లేరన్నారు. మూడు నెలల తరువాత వైసిపి ప్రభుత్వం ఉండదని, కొత్త ప్రభుత్వం వస్తుందని, వైసిపి పతనం అమరావతితోనే ప్రారంభమైందని చెప్పారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు మాట్లాడుతూ.. రాజధాని ఏదో తమకు తెలియదని హైకోర్టులో బిజెపి అఫిడవిట్ వేసిందని గుర్తు చేశారు. అమరావతిలో కేంద్ర ప్రభుత్వ సంస్థల నిర్మాణం కూడా జరగలేదని మండిపడ్డారు. చంద్రబాబు అరెస్ట్, కేసుల విషయం కోర్టులు చూస్తాయని, చంద్రబాబు అరెస్ట్ వెనుక ఎవరు ఉన్నారో చిన్న పిల్లాడిని అడిగినా చెబుతారని అన్నారు. వైసిపి, బిజెపిని గద్దెదించాలని, మోడీతో కలిస్తే వాళ్లు కూడా నిలువునా మునిగిపోతారని చెప్పారు. రైతులు మోడీని కాకుండా పోరాటాన్ని, ఐక్యతను నమ్ముకోవాలని కోరారు. పోరాటం వల్లనే అమరావతి ఉద్యమం నిలిచిందని మిగతా 2లో

సుప్రీం మార్గదర్శకాల ప్రకారం పోలీసు మాన్యువల్ మార్చాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్
- రాష్ట్రంలో మానవ హక్కుల ఉల్లంఘన
- పోరాటాల అణచివేత అప్రజాస్వామికం

5

రాష్ట్రానికి 12 ప్రెసిడెంట్ మెడల్స్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో/అమరావతి బ్యూరో



డైరెక్టర్ ఆఫ్ ఫైర్ సర్వీసెస్ పి.వెంకటరమణ

గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం కేంద్ర హోంశాఖ ప్రకటించిన ప్రెసిడెంటు మెడల్స్‌లో ఆంధ్రప్రదేశ్‌కు 12 పతకాలు వరించాయి. దేశ వ్యాప్తంగా పోలీస్, ఫైర్ సర్వీస్, హోంగార్డు, సివిల్ డిఫెన్స్, కరెక్షనల్ సర్వీస్‌లకు చెందిన 1,132 మంది సిబ్బందికి కేంద్రం శౌర్య/సేవా పతకాలను ప్రకటించింది. ఇద్దరికి మరణానంతరం ప్రెసిడెంట్స్ మెడల్ ఫర్ గ్యాలంట్రీ (పిఎంజి), 275 మందికి మెడల్స్ ఫర్ గ్యాలంట్రీ (జిఎం), 102 మందికి విశిష్ట సేవ కోసం రాష్ట్రపతి పతకాలు (పిఎస్ఎం), 753 మందికి మెరిటోరియస్ సర్వీస్ మెడల్స్ (ఎంఎస్ఎం) పతకాలు ప్రకటించింది. ఇందులో ఎపికి మెడల్స్ ఫర్ మెరిటోరియస్ సర్వీస్ (ఎంఎస్ఎం)లో తొమ్మిది మెడల్స్ దక్కాయి. వెంకట ప్రేమ్ జిత్ కోటనాని (కమాండెంట్), ఆవుల చెన్నయ్య (ఆర్ఎస్ఐ), రమణ రెడ్డి (ఎఎస్ఐ), వెంకటేశ్వర్లు అద్దంకి (సిఐ), ప్రకాశ్ రావు (ఎఎస్ఐ), మస్తాన్‌రావు (ఎఎస్ఐ), వెంకట సత్య అనంత దుర్గ ప్రసాద్ రావు (అసిస్టెంట్ కమాండెంట్), హరిరావు అక్కిశెట్టి (సిఐ), ఇ కోటిరెడ్డి (డిఎస్‌పి)లు ఎంఎస్ఎం పతకాలు సాధించారు.

ఫైర్ సర్వీస్ విభాగంలో..

ఫైర్ సర్వీస్ విభాగంలో డైరెక్టర్ ఆఫ్ ఫైర్ సర్వీస్ పి వెంకటరమణ, అసిస్టెంట్ డైరెక్టర్ జాస్తి రమణయ్య, లీడింగ్ ఫైర్‌మెన్ షేక్‌ఘనికి అవార్డులు దక్కాయి.



గిరిజన ప్రాంతాల్లో విస్తృతంగా టెలికం సేవలు

- 300 టవర్లు ప్రారంభించిన సిఎం

మెగా డిఎస్‌సి ప్రకటించాలి

- లేదంటే రేపటి నుంచి 36 గంటల దీక్ష : డివైఎఫ్ఐ

వైఎస్ఆర్ కుటుంబం చీలడానికి జగనే కారణం : షర్మిల

ఏం అన్యాయం జరిగిందో షర్మిల చెప్పాలి : సజ్జల

లోపలి పేజీలో..

భారత ప్రజాస్వామ్యం ప్రాచీనమైనది!

- యువతకు అపార అవకాశాలు
- మహిళా సాధికారతతో మరింత మెరుగైన పాలన
- 75వ గణతంత్ర దినోత్సవ సందేశంలో రాష్ట్రపతి



న్యూఢిల్లీ : భారతదేశంలోని ప్రజాస్వామ్య వ్యవస్థ పాశ్చాత్య దేశాల్లోని ప్రజాస్వామ్య భావన కన్నా చాలా ప్రాచీనమైనదని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. అందువల్లే భారత్‌ను 'ప్రజాస్వామ్యానికి మాతృమూర్తి'గా పిలుస్తారని అన్నారు. భారత రాజ్యాంగ పీఠికలో 'మనం, భారత ప్రజలం' అని ప్రారంభమవుతుందని, దాంతోనే మన రాజ్యాంగ స్వభావం తేటతెల్లమవుతోందని అన్నారు. 75వ గణతంత్ర దినోత్సవాల సందర్భంగా గురువారం జాతినుద్దేశించి చేసిన ధర్మోపన్యాసంలో బిజెపి రాజకీయ ఎజెండాను ప్రస్తుతించారు. జి-20 సదస్సు, అయోధ్య రామ మందిర ప్రారంభోత్సవం, మహిళా సాధికారత వంటి పలు అంశాలను ఆమె తన ప్రసంగంలో ప్రస్తావించారు. భారత రత్నపురస్కారానికి మరణానంతరం ఎంపికైన బీహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూర్ ఠాకూర్‌కు ఆమె నివాళులర్పించారు.

ఇటీవల అయోధ్యలో జరిగిన రామ మందిర ప్రారంభోత్సవంతో ప్రజల విశ్వాసానికి తగిన వ్యక్తీకరణను ఇవ్వడమే గాకుండా, న్యాయ క్రమం పట్ల ప్రజలకు గల అచంచలమైన విశ్వాసానికి ప్రతీకగా ఆమె పేర్కొన్నారు.. మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్ ఆమోదించడంతో ఆదర్శప్రాయమైన లింగ సమానత్వం దిశగా దేశం పురోగతి సాధిస్తోందన్నారు. నారీ శక్తి వందన్ అధినియం మహిళా సాధికారతకు విప్లవాత్మకమైన సాధనంగా నిరూపించబడుతుందని తాను నమ్ముతున్నానన్నారు. ఇటీవలి సంవత్సరాల్లో ప్రధాన ఆర్థిక వ్యవస్థలను పరిశీలించినట్లైతే మన జిడిపి వృద్ధిరేటు అన్నిటికంటే అధికంగా వుందన్నారు. మానవాభివృద్ధి సూచిలో భారత్ చాలా వెనకబడి ఉన్న విషయాన్ని కానీ, దేశంలో ఇదివరకెన్నడూ లేని రీతిలో నిరుద్యోగం తీవ్ర రూపం దాల్చిన విషయాన్ని గురించి ఆమె ఒక్క ముక్క కూడా మాట్లాడలేదు. దేశం అంతా వెలిగిపోతోందన్నట్టుగా ఆమె ప్రసంగం సాగింది. 'అమృత్ కాల్'లో అనూహ్యమైన సాంకేతిక మార్పులు జరుగుతాయని. కృత్రిమ మేధ, మెషిన్ లెర్నింగ్ వంటి సాంకేతిక చొరవలు మన రోజువారీ జీవితాల్లో భాగం కానున్నాయని చెప్పారు.

చంద్రయాన్, జి-20 సదస్సుతో భారత దేశ ప్రతిష్ట మరింత పెరిగిందన్నారు. నూతనోత్తేజంతో, మరింత ఇనుమడించిన విశ్వాసంతో మన క్రీడాకారులు పారిస్ ఒలింపిక్స్‌లో అద్భుతమైన ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు.

డిజిటల్ అంతరాన్ని తొలగించడంపై నూతన విద్యా విధానం (ఎన్ఇపి) తగిన దృష్టి పెట్టాలని కోరారు. ప్రభుత్వం, సంక్షేమ పథకాలను విస్తరించడం, మెరుగుపరచడమే కాకుండా సంక్షేమ భావనను పునర్నిర్వచించిందన్నారు. కొత్త రంగాల్లో భవితను యువత అన్వేషిస్తోందని, వారనుసరించే బాటలోని అడ్డంకులను మనందరం తొలగించాల్సిన అవసరం వుందన్నారు. వారి పూర్తి శక్తి సామర్థ్యాలను ఉపయోగించుకునేందుకు అవకాశం ఇవ్వాలన్నారు.

సర్వాంగ సుందరంగా కర్తవ్యపథ్

- గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు పూర్తి
- ముఖ్య అతిథిగా ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

75వ గణతంత్ర వేడుకలకు ఢిల్లీలోని కర్తవ్యపథ్ సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఈ వేడుకల్లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్, ప్రధాని మోడీ, కేంద్ర మంత్రులు పాల్గొననున్నారు. ఈసారి ముఖ్య అతిథిగా ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యూవల్ మాక్రాన్ హాజరుకానున్నారు. మరో 13 వేల మందికి కేంద్రం ఆహ్వానాలు పంపింది. నారీశక్తిని చాటేలా పరేడ్ సాగనుంది. ఉదయం 10:30 నిమిషాలకు జాతీయ గీతం ఆలపిస్తూ... మేజర్ సౌమ్య శుక్లా త్రివర్ణ పతాకం ఎగురవేయడంతో రిపబ్లిక్ డే వేడుకలు ప్రారంభం కానున్నాయి.

పరేడ్ ప్రారంభించనున్న మహిళా బృందం

తొలిసారి 112 మంది మహిళా కళాకారులు సంగీత వాయిద్యాలను వాయిస్తూ.. పరేడ్‌ను ప్రారంభించనున్నారు. త్రివిధ దళాల కవాతులో నారీశక్తిని చాటేలా మహిళలు పాల్గొంటున్నారు. ట్రైసర్వీస్‌కు చెందిన డాక్టర్లు, నర్సులు, సెంట్రల్ ఆర్మ్‌డ్ ప్రొటెక్షన్ ఫోర్స్, ఢిల్లీ పోలీస్ విభాగాల నుంచి ప్రత్యేకంగా మహిళ కంటెంజెంట్లు తమ పాటవాలను ప్రదర్శించబోతున్నాయి. తరువాత త్రివిధ దళాలు, పారా మిలటరీ బలగాలు, ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్, ఢిల్లీ పోలీసుల పరేడ్ ప్రారంభం అవుతుంది. దేశ సత్తాను చాటేలా త్రివిధ దళాలు దేశ యుద్ధ ట్యాంకులు, అణ్వాయుధాలను ప్రదర్శిస్తాయి.



జైపూర్‌లో ఫ్రాన్స్ అధ్యక్షులు మాక్రాన్‌తో కలిసి ప్రధాని మోడీ రోడ్ షో

25 శకటాలు... 54 యుద్ధ విమానాలు

పరేడ్‌లో 16 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల శకటాలు, 9 కేంద్ర మంత్రిత్వ శాఖ శకటాలు పాల్గొంటాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, లడఖ్, అరుణాచల్ ప్రదేశ్, హర్యానా, మణిపూర్, మధ్యప్రదేశ్, ఒరిస్సా, చత్తీస్‌గఢ్, రాజస్థాన్, మహారాష్ట్ర, గుజరాత్, మేఘాలయ, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్ ఉన్నాయి. చివర్లో 54 యుద్ధ విమానాలు / హెలికాప్టర్లు ఆకాశంలో విన్యాసాలు చేయనున్నాయి. రాష్ట్రపతి బాడీ గార్డ్స్ (అంగరక్షక్ - అశ్వదళం రెజిమెంట్) 250 ఏళ్లు పూర్తి చేసుకోనున్న సందర్భంగా... 40 ఏళ్ల తరువాత గుర్రపు బగ్గీలో రాష్ట్రపతి ముర్ము పరేడ్‌కు హాజరు కానున్నారు. ఆ వాహనంలోనే ఫ్రాన్స్ అధ్యక్షులు కూడా ఉంటారు. విజయ్ చౌక్ నుంచి ఇండియా గేట్ వరకు కర్తవ్యపథ్ పై సాగే ఈ వేడుకల కోసం 77 వేల సీటింగ్ కెపాటిసిటీని ఏర్పాటు చేసింది.

పులి సంచారం కలకలం

- భయాందోళనలో ప్రజలు

ప్రజాశక్తి-నల్లజర్ల (తూర్పుగోదావరి జిల్లా)

తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం పుల్లలపాడు పరిసర ప్రాంతాల్లో పులి సంచరిస్తున్నట్లు సమాచారం రావడంతో కలకలం రేగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం రాత్రి ఒక వ్యక్తి 16 నెంబరు జాతీయ రహదారిపై వ్యాన్‌లో వెళుతుండగా పుల్లలపాడు సచివాలయం వద్ద హైవేపై రోడ్డు దాటుతున్న పులిని చూసి కంగారు పడ్డాడు. కొంత దూరం వెళ్లిన తరువాత పోలీసులకు సమాచారం అందజేశారు. ఈ సమాచారంతో సమీపంలోని అటవీ ప్రాంతంలో పులి అడుగులను అటవీశాఖ అధికారులు గుర్తించారు. పులి తిరుగుతుండడంతో సమీప గ్రామాల ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఒంటరిగా బయటకు వెళ్లొద్దని ప్రజలకు సూచించారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు. అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

రాజధాని విషయంలో వైసిపి, బిజెపి ముద్దాయిలే

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. అమరావతి ఉద్యమం రాజకీయ పోరాటంగా మారాలన్నారు. ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి మాట్లాడుతూ.. అమరావతి ఉద్యమంలో మహిళల పాత్ర మరువలేనిదన్నారు. రాష్ట్రానికి రాజధాని లేకుండా చేస్తున్నారని, అమరావతిని కుట్రలతో, దుర్మార్గంతో నిర్వీర్యం చేస్తున్నారని గ్రహించిన మహిళలు 1500 రోజుల పాటు వీరోచితంగా పోరాడారని చెప్పారు. మహిళలలో ఓర్పుతో పాటు పట్టుదల ఉంటుందని అంగన్‌వాడీలు కూడా పోరాడి ప్రభుత్వం మెడలు వంచారని అన్నారు. అమరావతి జెఎసి నాయకులు పువ్వాడ సుధాకరరావు మాట్లాడుతూ..అమరావతి ఉద్యమానికి కమ్యూనిస్టుల పోరాటాలే స్ఫూర్తి అని అన్నారు. సభకు ముందు అమరావతి ఉద్యమంలో మృతి చెందిన వారికి నివాళులర్పించారు. మాజీ మంత్రి దేవినేని ఉమమహేశ్వరరావు, మాజీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, కృష్ణా జిల్లా పరిషత్ మాజీ చైర్ పర్సన్ గద్దె అనూరాధ, అమరావతి జెఎసి నాయకులు స్వరాజ్యరావు, ముస్లిం మైనారిటీ నాయకులు సిబ్లి , జనసేన నాయకులు గాదె వెంకటేశ్వరరావు తదితరులు ప్రసంగించారు.

తెలంగాణ అభివృద్ధికి మెగా మాస్టర్ ప్లాన్

- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రాన్ని నాటికి పారిశ్రామికంగా 2050 నాటికి అభివృద్ధి పథకంలో పరుగులు పెట్టించేందుకు మెగా మాస్టర్ ప్లాన్‌ను అమలు చేయనున్నట్టు ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. గురువారం సిఐఐ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన మౌలిక సదుపాయాలు, రియల్ ఎస్టేట్ సమ్మిట్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మాస్టర్ ప్లాన్‌లో భాగంగా 55 కిలోమీటర్ల మేర మూసీ నది రివర్ ఫ్రంట్ అభివృద్ధి బాధ్యతలను హెచ్ఎండిఎకు అప్పగించామని తెలిపారు. మూసీ పొడుగునా అమ్యూజ్ మెంట్ పార్కులు, జలపాతాలు, వాటర్ స్పోర్ట్స్, వ్యాపార, వాణిజ్య కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ప్రభుత్వ ప్రయివేటు భాగస్వామ్య పద్ధతిలో షాపింగ్ మాల్స్‌ను నిర్మిస్తామని వివరించారు. ఫలితంగా నదీ పరివాహక ప్రాంతం వ్యాపార కేంద్రంగా అభివృద్ధి చెందిడంతో పాటు ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు.

మత రాజకీయాలు దేశానికి నష్టం

సిపిఎం నాయకులు బాలకృష్ణ సంస్మరణ సభలో శ్రీనివాసరావు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

మతాన్ని రాజకీయాలకు ఉపయోగించుకొనే దుష్ట శక్తులకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. మతాన్ని రాజకీయంగా ఉపయోగించడం దేశానికి అరిష్టమన్నారు. సిపిఎం అనకాపల్లి మండల కార్యదర్శి గంటా శ్రీరామ్ అధ్యక్షతన గురువారం సాయంత్రం వివి రమణ రైతు భారతి ఫంక్షన్ హాల్‌లో సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యాన పార్టీ సీనియర్ నాయకులు అంగులూరి బాలకృష్ణ సంస్మరణ సభ జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఓట్ల కోసం రాముడిని వ్యాపార సరుకుగా మార్చడం దేశానికి మంచిది కాదన్నారు.

మత విభజన రాజకీయాల స్థానంలో ప్రజల సమస్యలపై కలిసి పనిచేసే సమైక్య రాజకీయాలు రావాలన్నారు. ఆ తరహా ప్రత్యామ్నా య రాజకీయాలకు ప్రతినిధిగా బాలకృష్ణ పనిచేశారని గుర్తు చేశారు. అంకితభావంతో జీవితాంతం ఆశయ సాధన కోసం పనిచేయడమే బాలకృష్ణకు ఇచ్చిన నిజమైన నివాళి అన్నారు. ప్రజలతో మమేకమై, ప్రజా ఉద్యమాలను నిర్వహించిన ఆయన జీవితం ఆదర్శప్రాయమన్నారు. కుటుంబానికి ఆస్తులను కాకుండా ఆశయాన్ని వారసత్వంగా అందించిన ఉత్తమ కమ్యూనిస్టు అని కొనియాడారు. సభలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, టిడిపి సీనియర్ నాయకులు దాడి వీరభద్రరావు, లీడర్ పత్రిక సంపాదకులు రమణమూర్తి, సిపిఎం అనకాపల్లి, విశాఖపట్నం జిల్లా కార్యదర్శులు కె.లోకనాథం, ఎం.జగ్గునాయుడు, సిఐటియు అనకాపల్లి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.శంకరరావు, జి.కోటేశ్వరరావు, ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి పాల్గొన్నారు.



సంస్మరణ సభలో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు, వేదికపై సిహెచ్.నర్సింగరావు తదితరులు

వైఎస్ఆర్ కుటుంబం చీలడానికి జగనే కారణం : షర్మిల



సమావేశంలో మాట్లాడుతున్న షర్మిల

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

'రాష్ట్రాన్ని, నా కుటుంబాన్ని కాంగ్రెస్ చీల్చిందంటూ జగనన్న ఆరోపణ చేస్తున్నారు. నిన్న జరిగిన ఇండియా టుడే కార్యక్రమంలో అదే పనిగా అనేక ఆరోపణలు చేశారు. వాస్తవానికి మా కుటుంబం చీలడానికి కారణం జగనన్నే. దీనికి సాక్ష్యం నా కుటుంబం, రాజశేఖర్‌రెడ్డి భార్య నా తల్లి విజయమ్మ' అని పిసిసి చీఫ్ వైఎస్ షర్మిల అన్నారు. కాకినాడ సూర్య కళామందిరంలో గురువారం నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ సమావేశంలో ఆమె మాట్లాడారు. వైసిపి కష్టాల్లో ఉందంటే పిల్లల్నీ, కుటుంబాన్ని వదులుకొని పాదయాత్ర చేశానని, జగనన్న ఏం కావాలంటే అది వెంటనే చేశానని చెప్పారు. ముఖ్యమంత్రి అయిన తర్వాత జగన్‌మోహన్‌రెడ్డి పూర్తిగా మారిపోయారని చెప్పారు. రాష్ట్రంలో సంక్షేమ పాలనపై ప్రజలు ఆశ పడితే సిఎం జగన్ నేతృత్వంలో అరాచకం రాజ్యమేలుతోందన్నారు. తన తండ్రి, మాజీ సిఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆశించిన విధంగా వైసిపితో సంక్షేమం అందుతుందని తాను ఆశించానని, దానికి విరుద్ధంగా రాక్షస పాలనను జగన్ చేస్తున్నారని విమర్శించారు. బిజెపికి తొత్తులుగా టిడిపి, వైసిపి, జనసేన మారాయని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పరిస్థితి ఇంత దారుణంగా మారడానికి చంద్రబాబు, జగనే కారణమని విమర్శించారు. రాజశేఖర్‌రెడ్డి కలల ప్రాజెక్టు పోలవరం ప్రాజెక్టు పూర్తయి ఉంటే 20 లక్షల ఎకరాలు సస్యశ్యామలం అయ్యేవన్నారు. రివర్స్ టెండరింగ్ పేరుతో నిర్మాణ వ్యయాన్ని రూ.50 వేల కోట్లకు పెంచిన ఘనత జగన్‌దే అన్నారు. పోలవరం ప్రాజెక్టు ఎందుకు పూర్తి కాలేదో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రానికి ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, విభజన హామీలు వంటి సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎంఎం పల్లంరాజు, జెడి శీలం, సుంకర పద్మశ్రీ, గిడుగు రుద్రరాజు, జంగా గౌతమ్, పి.రఘువీరారెడ్డి పాల్గొన్నారు.

ఏం అన్యాయం జరిగిందో షర్మిల చెప్పాలి

- సజ్జల రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



షర్మిలకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏం అన్యాయం చేశారో స్పష్టంగా చెప్పాలని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి ప్రశ్నించారు. రాజకీయ పార్టీలు ఎప్పుడూ కుటుంబ వ్యవహారంగా వుండవని, ప్రజాస్వా మ్యంలో అలా వుండదనే అంశాన్ని ఆమె తెలుసుకోవాలని సూచించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన తనను కలిసిన మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. షర్మిల ఏం ఆశించి వైసిపిలో పనిచేశారో చెప్పాలన్నారు. మొన్నటి వరకు తెలంగాణలో సొంత పార్టీ పెట్టుకున్న షర్మిల.. ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లోకి వచ్చి అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని అన్నారు. గంగవరం పోర్టు వాటా అమ్మడం ద్వారా వచ్చిన డబ్బుతో రాష్ట్రంలో నాలుగు పోర్టులు కడుతున్నామని తెలిపారు. విశాఖ స్టీల్‌ప్లాంటు కోసం పార్టీ తరపున కేంద్రంతో పోరాడుతున్నామని చెప్పారు. మణిపూర్ విషయంపై షర్మిల తెలంగాణలో సొంత పార్టీ ఉన్నప్పుడు ఎందుకు మాట్లాడలేదో చెప్పాలన్నారు. చంద్రబాబు ప్రణాళిక ప్రకారం షర్మిలను కాంగ్రెస్‌లో చేర్చారని అన్నారు.

వేతన పెంపు జిఓలు త్వరలో ఇస్తాం : శ్రీలక్ష్మి

- ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులకు హామీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వేతన పెంపు ఆదేశాలు త్వరలో ఇస్తామని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ప్రతినిధులకు పట్టణాభివృద్ధిశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై శ్రీలక్ష్మి హామీ ఇచ్చారు. గురువారం క్యాంపు కార్యాలయంలో ఫెడరేషన్ తరపున కె ఉమామహేశ్వరరావు, కె ధనలక్ష్మి, బి ముత్యాలరావు, బి లక్ష్మణరావు కలిశారు. రూ.1000 బోనస్, మినిట్స్ కాపీ ఇవ్వడం తదితర అంశాలపై శ్రీలక్ష్మికి అభినందనలు తెలిపారు. అనంతరం శ్రీలక్ష్మి మాట్లాడుతూ.. సమ్మెకాలపు వేతనం, వేతనం రూ.21 వేలు నుంచి రూ.24 వేలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.75 వేలు, దహన సంస్కారాలకు రూ.20 వేలు ఎక్స్‌గ్రేషియా పెంపు అంశాలు ఫైనాన్స్ డిపార్టుమెంటు వద్ద పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. క్లాప్ డ్రైవర్లకూ న్యాయం చేస్తామని పేర్కొన్నారు. ప్రిన్సిపల్ సెక్రటరీని ఫెడరేషన్ ప్రతినిధులు కలిసి వినతిపత్రం సమర్పించారు. వెంటనే ఆదేశాలివ్వాలని కోరారు.



సభలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం

'రాచపాలెం'కు వేంకటకవి జీవిత సాఫల్య పురస్కారం

ప్రజాశక్తి-తిరుపతి సిటీ

కొండవీటి వేంకటకవి సాహిత్య పీఠం, వేమన విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ప్రముఖ కవి, సుప్రసిద్ధ సాహిత్య విమర్శకులు ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డికి కొండవీటి వేంకటకవి సాహిత్య పురస్కారాన్ని ప్రదానం చేశారు. తిరుపతి యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో గురువారం సాయంత్రం జరిగిన సభకు ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎస్వియు ప్రొఫెసర్ డాక్టరు పిసి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. రైతు బిడ్డ అయిన వేంకటకవి కర్షకా అనే పద్య కావ్యంతో రచనా ప్రపంచంలోకి ప్రవేశించారని తెలిపారు. రెండు పదుల వయస్సు నుంచి త్రిపురనేని రామస్వామి సామాజిక విప్లవ కర్తవ్యాన్ని అందిపుచ్చుకొని రచనలు చేశారన్నారు. కెఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ వేంకటకవి స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో అనేక పుస్తకాలు, గ్రంథాలు రచించి ప్రజలను చైతన్యం చేశారని తెలిపారు. సమాజభివృద్ధికి కృషి చేసిన ఆయన పేరుతో అవార్డులు ప్రదానం చేయడం సంతోషకరమన్నారు. ఇప్పటికే కత్తి పద్మారావు వంటి ప్రముఖులకు ఈ పురస్కారం అందజేశామని, రని, నేడు చంద్రశేఖర్‌రెడ్డికి ఈ అవార్డు ప్రదానం చేయడం అభినందనీయమన్నారు. మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. నేటి సమాజానికి స్ఫూర్తిదాత వేంకటకవి అని కొనియాడారు. చరిత్రకారుడైన చంద్రశేఖర్‌రెడ్డికి ఈ పురస్కారం ఇవ్వడం అభినందనీయమన్నారు. ప్రొఫెసరు రావులూరి కృష్ణకుమారి మాట్లాడుతూ మంచితనానికి మరోపేరు వేంకటకవి అని కొనియాడారు. కార్యక్రమంలో వేమన విజ్ఞాన కేంద్రం కార్యదర్శి మల్లారపు నాగార్జున, చాయా మోహన్, తదితరులు పాల్గొన్నారు.

ఓటుతోనే సక్రమ పథకాలు

- రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వాలు సక్రమ పథకాలను రూపొందించాలంటే ఓటుహక్కును వినియోగించుకోవడం అత్యంత కీలకమని రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ అన్నారు. గురువారం 14వ ఓటర్ జాతీయ దినోత్సవం సందర్భంగా విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్రంలో ఓటర్ల నమోదు ప్రక్రియలో విశేష కృషి చేసిన పలువురు అధికారులను ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశ అభివృద్ధి గమనాన్ని నిర్దేశించడంలో ఓటు హక్కు ప్రధానపాత్ర పోషిస్తుందని చెప్పారు.

సామాజిక, ఆర్థిక ప్రగతిని నిర్దేశించే విధానాలు సక్రమంగా ఉండాలంటే పౌరులు తమ ఓటు హక్కును ఖచ్చితంగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థ పరిఢవిల్లేందుకు ఎన్నికల ప్రక్రియ ముఖ్యమని, ఓటు వేయడం పౌరుడి ప్రధాన బాధ్యతని చెప్పారు. ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు, కర్నూలు జిల్లా కోడుమూరు తహశీల్దార్ జయన్న తదితరులను రాష్ట్ర గవర్నర్ సత్కరించారు. ఈ సందర్భంగా గవర్నర్ సభకు హాజరైన వారితో ఓటుహక్కును వినియోగించుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముకేశ్‌కుమార్ మీనా మాట్లాడుతూ జాతి నిర్మాణంలో ఓటు కీలకమైన అంశమని తెలిపారు. రాష్ట్రంలో 4.08 కోట్ల మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. 2024 తుది జాబితా నాటికి 18-19 ఏళ్ల వయసున్న కొత్త ఓటర్లు 5.07 లక్షలని అన్నారు. ఓటర్ల నమోదు ప్రక్రియ నిరంతరం సాగేదని, యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు చాలా కీలకమని ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్ రెడ్డి అన్నారు. ప్రజలకు ఓటు హక్కు కల్పించేలా మన ప్రజాస్వామ్యం రూపుదిద్దుకుందని చెప్పారు. దేశంలో బ్రిటీష్ హయాంలో కేవలం కొంతమందికి మాత్రమే ఓటు హక్కు వుండేదని తెలిపారు. మహిళలకు ఓటు హక్కు వుండేది కాదన్నారు. నాడు మహిళలకు కూడా ఓటు హక్కు వుండాలని మోతీలాల్ నెహ్రూ మొదటిసారి ప్రతిపాదించారని తెలిపారు.



పోస్టల్ స్టాంప్ విడుదల చేస్తున్న గవర్నర్ జస్టిస్ ఎస్ అబ్దుల్ నజీర్ తదితరులు

ఉక్కుపై కేంద్రం కుట్రలు

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న రామస్వామి

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

ప్రయివేటుపరం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం పన్నుతోన్న కుట్రలకు వైజాగ్ స్టీల్‌ప్లాంట్ బలవుతోందని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు యు.రామస్వామి అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారానికి 1078వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్టీల్ టిపిపి, ఆర్ఇడి స్టోర్స్, పిఇఎం విభాగాల ఉద్యోగులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌లో ఒక్కో విభాగాన్నీ నిర్వీర్యం చేస్తూ ముందుకు వెళ్తున్నారన్నారు. ఉత్పత్తికి అవరోధాలు సృష్టిస్తున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ కుటిలయత్నాలను కార్మికులు తిప్పికొడుతున్నారని అన్నారు. వైసిపి, టిడిపి, జనసేనల నుంచి వారికి సహకారం అందడంలేదని తెలిపారు. మోడీ సర్కారును ఎదిరించి విశాఖ ఉక్కు కర్మాగారాన్ని పరిరక్షించుకునేందుకు ఆయా పార్టీలు ముందుకు రావడం లేదని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను కాపాడేందుకు సమగ్ర చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

రూ.1.37 కోట్లు స్వాధీనం

- నాలుగు చెక్‌పోస్టుల వద్ద వాహనాల తనిఖీల్లో గుర్తింపు

ప్రజాశక్తి - హనుమాన్ జంక్షన్, తోట్లవల్లూరు, ఉంగుటూరు, గుడివాడ రూరల్ :



కృష్ణాజిల్లా బాపులపాడు మండలం బొమ్ములూరు టోల్‌గేట్ వద్ద స్వాధీనం చేసుకున్న నగదు

సరైన పత్రాల్లేకుండా వేర్వేరుగా తరలిస్తున్న కోటీ 36 లక్షల 54 వేల రూపాయలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కృష్ణా జిల్లాలోని నాలుగు చెక్‌పోస్టు ప్రాంతాల్లో పోలీసులు చేపట్టిన వాహనాల తనిఖీల్లో అక్రమంగా తరలిస్తున్న నగదును గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. బాపులపాడు మండలం బొమ్ములూరు టోల్‌గేట్ వద్ద బుధవారం రాత్రి, గురువారం ఉదయం సిఐ నరసింహమూర్తి తన సిబ్బందితో వాహనాలను తనిఖీ చేస్తుండగా, రెండు కారుల్లో వేర్వేరుగా తరలిస్తున్న రూ.62.44 లక్షల నగదును గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులమని చెప్పి బుధవారం రాత్రి కారులో కాకినాడ నుండి చెన్నైకి రూ.9.94 లక్షల నగదును తరలిస్తున్న మాసిన వెంకట్ అంకుష్, విక్రమ్ రాహుల్ అనే ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. అలాగే గురువారం ఉదయం రూ.52.50 లక్షల నగదుతో కాకినాడ నుండి చెన్నై వెళుతున్న షేక్ గౌస్ అనే వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నగదును స్వాధీనం చేసుకున్నారు. భూమి అమ్మగా వచ్చిన సొమ్మని ఆ వ్యక్తి చెబుతున్నాడు. స్వాధీనం చేసుకున్న నగదుపై తహశీల్దారుకు, ఆదాయ పన్ను శాఖ అధికారులకు సమాచారం ఇచ్చినట్లు సీఐ నరసింహమూర్తి తెలిపారు. ఈ తనిఖీల్లో హనుమాన్ జంక్షన్ ఎస్ఐ జనార్ధన్, తిరుమలరావు పాల్గొన్నారు. అలాగే గుడివాడ రూరల్ మండలం ముదినేపల్లి రోడ్డులో చౌటుపల్లి వద్ద రూ.61 లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వేములపల్లి సత్యనారాయణ అనే వ్యక్తి కారులో ఈ నగదును తరలిస్తుండగా గుర్తించామని గుడివాడ డిఎస్‌పి శ్రీకాంత్ మీడియాకు తెలిపారు. ఈ నగదును సీజ్ చేశామని తెలిపారు. తోట్లవల్లూరు మండలం యాకమూరు పోలీస్ చెక్‌పోస్టు వద్ద కారులో రూ. తొమ్మిది లక్షల నగదును తరలిస్తుండగా, స్వాధీనం చేసుకున్నామని పమిడిముక్కల సిఐ కిషోర్‌బాబు తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నగదును సీజ్ చేసినట్లు తెలిపారు. ఉంగుటూరు మండలం పొట్టిపాడు టోల్‌గేట్ వద్ద కారులో తరలిస్తున్న రూ.4.10 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నామని ఆత్కూరు ఎస్ఐ టి.సూర్య శ్రీనివాస్ తెలిపారు.

నిధులు మళ్లించడం విద్రోహ చర్య

- ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

బడ్జెట్లో వ్యవసాయ రంగానికి కేటాయించిన రూ.లక్ష కోట్లకు కేంద్ర ప్రభుత్వం కోత విధించి వెనక్కు మళ్లించడం విద్రోహ చర్య అని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వి కృష్ణయ్య, కె ప్రభాకరరెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే వ్యవసాయ ఉపకరణాల ధరలు పెరిగిపోయి గిట్టుబాటుకాక, రైతులు అప్పులపాలై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని చెప్పారు. ఇటువంటి సమయంలో రూ.లక్ష కోట్లు ఖర్చు చేయకుండా వెనక్కు మళ్లించడం సరైంది కాదని పేర్కొన్నారు. వ్యవసాయ రంగానికి ఇవ్వాల్సిన సబ్సిడీలు తగ్గించేస్తున్నారని, యూరియాకు బదులు నానో యూరియాను వాడాలని నిర్బంధం విధించడం సరికాదని పేర్కొన్నారు. శాస్త్రీయత లేని నానో యూరియా వాడాలని చెప్పడం అన్యాయమని అన్నారు. వెంటనే కేటాయించిన నిధులను ఖర్చు చేయాలని వారు కోరారు.

గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా

- కోదండరామ్, మీర్ అమీర్ అలీఖాన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ జనసమితి అధ్యక్షులు, ప్రొఫెసర్ కోదండరామ్, సియాసిత్ రెసిడెంట్ ఎడిటర్ జావెద్ అలీఖాన్ కుమారుడు, సియాసిత్ న్యూస్ ఎడిటర్ మీర్ అమీర్ అలీఖాన్ గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా నియమితులయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం కొద్ది రోజుల క్రితం వారిని గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా నియమించాలని కోరుతూ జాబితాను గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌కు పంపిన విషయం విదితమే. దాసోజు శ్రవణ్, కుర్రా సత్యనారాయణలతో కూడిన పేర్లను గత ప్రభుత్వం పంపగా.. ఏ అర్హతలను బట్టి వారిని ఎమ్మెల్సీలుగా నియమించాలంటూ ప్రతిపాదనను గవర్నర్ తిప్పిపంపారు. దీంతో వారిద్దరూ హైకోర్టు తలుపును తట్టిన విషయం విదితమే. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం రెండు పేర్లను పంపగా.. హైకోర్టు తీర్పు వచ్చే వరకూ గవర్నర్ కోటా ఎమ్మెల్సీల ఖాళీలను భర్తీ చేయడం సాధ్యం కాదంటూ తమిళిసై సౌందరరాజన్ బాంబు పేల్చిన సంగతి తెలిసిందే. చివరకు కాంగ్రెస్ ప్రభుత్వం సూచించిన కోదండరామ్, మీర్ అమీర్ అలీఖాన్ పేర్లకు గవర్నర్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. తెలంగాణ ఉద్యమంలో జెఎసి చైర్మన్‌గా కోదండరామ్ కీలక పాత్ర పోషించిన నేపథ్యంలో ఆయనకు సిఎం రేవంత్‌రెడ్డి ప్రాధాన్యత ఇచ్చారు.

అసైన్డ్ భూములకూ చట్ట ప్రకారం పరిహారమివ్వాలి

వ్యవసాయ కార్మిక సంఘం రౌండ్‌టేబుల్ సమావేశాల్లో వక్తలు



గుంటూరు రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-గుంటూరు/కాకినాడ

భూసేకరణ ప్రక్రియలో పట్టా భూములతో సమానంగా అసైన్డ్ భూములకు పరిహారం ఇవ్వలేమంటూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌ను తక్షణమే ఉపసంహరించుకోవాలని వక్తలు డిమాండ్ చేశారు. కాకినాడలోని సుందరయ్య భవన్‌లో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు మాట్లాడుతూ అసైన్డ్ భూముల లబ్ధిదారులకు వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో సుమారు 40 లక్షల మంది అసైన్డ్ భూముల లబ్ధిదారులకు రక్షణగా 9/77 చట్టం ఉందని, ఆ చట్టంలో కీలకమైన భూముల అమ్మకాలు, కొనుగోలు చెల్లవు అనే నిబంధనలను జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మార్చి, భూములు అమ్ముకోవచ్చుని ఆరు నెలల క్రితం సవరణ చేసిందన్నారు. సుప్రీంకోర్టు తీర్పునకు భిన్నంగా రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకు రావడం అన్యాయమన్నారు. ఇది పేదలకు ముఖ్యంగా దళితులు, బిసిలకు వ్యతిరేకమైన చర్య అన్నారు. వెంటనే ఈ ఆర్డినెన్స్‌ను వెనక్కి తీసుకోవాలని, 9/77 చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. గుంటూరులోని పిఎల్ రావు భవన్‌లో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షులు జెట్టి బాలరాజు అధ్యక్షతన జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వ అవసరాలు, పరిశ్రమలు, ప్రాజెక్టుల తదితర అవసరాల కోసం సేకరించే అసైన్డ్ భూములకు పట్టా భూములతో సమానంగా యాజమాన్య హక్కులు కల్పిస్తూ ఇటీవల అసైన్డ్ చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం సవరించిందని తెలిపారు. పేదల భూములను కార్పొరేట్లకు కారుచౌకగా ధారాదత్తం చేయడానికి కేంద్రం అనుసరిస్తోన్న విధానాన్నే రాష్ట్ర ప్రభుత్వమూ అనుసరిస్తోందని విమర్శించారు.

కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు, ఎంసిపిఐ(యు) నాయకులు కాల్వ శ్రీధర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఇ అప్పారావు, సిఐటియు జిల్లా కార్యదర్శి నేతాజి, రైతు, కౌలు రైతు సంఘాల జిల్లా కార్యదర్శులు అజయ్‌కుమార్, బైరగాని శ్రీనివాస్ పాల్గొన్నారు.

చివరి దశకు జగన్ పాలన

- చంద్రబాబు, జగన్ ఇద్దరూ బిజెపికి వంతపాడేవాళ్లే
- సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్రంలో సిఎం జగన్ పాలన చివరి దశకు చేరుకుందని సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ పేర్కొన్నారు. జగన్‌కు అందరూ శత్రువులేనని అన్నారు. గురువారం నాడిక్కడ ఆయన మీడియాతో మాట్లాడుతూ.. చంద్రబాబు, జగన్ ఇద్దరూ బిజెపికి వంత పాడేవాళ్లేనని విమర్శించారు. వామపక్షాలు ఉండొద్దు, ఇచ్చిన స్థానాల్లోనే పోటీ చేయాలని మమతా బెనర్జీ కాంగ్రెస్‌కు షరతు పెట్టారని అన్నారు. సీట్ల కేటాయింపులపై ఇండియా వేదికలోని పార్టీలు సంకుచితంగా వ్యవహరించొద్దని హితవు పలికారు. వేదిక ఉంటుందని, ఒకట్రెండు పార్టీలు దూరం కావచ్చని అన్నారు. ప్రజలు వేదికతో ఉన్నారని, అందుకే బిజెపి దేవుడిని ఎత్తుకుందని విమర్శించారు. కేంద్ర కేబినెట్‌లో మతాన్ని రాజకీయం చేశారని విమర్శించారు. అయోధ్య రామాలయం నిర్మాణానికి తాము వ్యతిరేకం కాదని, అన్ని ఊర్లలో రామాలయాలు ఉన్నాయని అన్నారు.

బాబ్రీ మసీదు ఘటనలో అద్వానీ ఉన్నారని, అందువల్ల రామాలయం ప్రారంభోత్సవానికి వెళ్లలేదని అన్నారు. మోడీ బ్లాక్ మెయిల్ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. ప్రపంచం మొత్తం బాబ్రీ మసీదు కూలగొట్టిన అంశాన్ని చూశారని, అయోధ్య తీర్పు ఇచ్చిన వారిలో ఒకరు రాజ్యసభలో, మరొకరు ఎపి గవర్నరుగా ఉన్నారని అన్నారు. అయోధ్య రామాలయం ప్రారంభానికి రాష్ట్రపతిని ఎందుకు పిలవలేదని ఆయన ప్రశ్నించారు. మోడీ బ్లాక్ మెయిల్‌తో కొందరు వెనక్కి వెళ్తున్నారన్నారు. కాంగ్రెస్ ఇంకా అందరినీ కలుపుకుని పోవాలని, సెక్యులర్ అని చెప్పుకునే వారు బిజెపికి ఊడిగం చేస్తున్నారని నారాయణ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు.

'ఇండియా' అధికారంలోకి రాబోతోంది


ఎఐసిసి అధ్యక్షులు ఖర్గే

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

బిజెపి, బిఆర్ఎస్, ఎంఐఎం కలిసినా కాంగ్రెస్ పార్టీని ఏమీ చేయలేవని ఎఐసిసి అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే అన్నారు. దేశం కోసం, రాజ్యాంగ రక్షణ కోసం కష్టపడి పని చేయాలని కాంగ్రెస్ కార్యకర్తలకు ఆయన పిలుపునిచ్చారు. 28 పార్టీల 'ఇండియా' ఫోరం దేశంలో అధికారంలోకి రాబోతున్నదని ధీమా వ్యక్తం చేశారు. ప్రధాని మోడీ దేశ ప్రజల సొమ్ముతో వ్యక్తిగత ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. గత ఎన్నికల్లో ఇచ్చిన రెండు కోట్ల ఉద్యోగాలకు, ప్రతి ఖాతాల్లో రూ.15 లక్షలు జమ చేస్తామన్న హామీలకు గ్యారంటీ ఏది? అంటూ మోడీని ప్రశ్నించారు. బిజెపి అధికారంలోకి వచ్చాక అనేక రాష్ట్ర ప్రభుత్వాలను విచ్ఛిన్నం చేసిందన్నారు. బిజెపితో జాగ్రత్త అంటూ తెలంగాణ సిఎం రేవంత్‌కు సూచించారు. మోడీ బెదిరింపులకు కాంగ్రెస్ భయపడబోదని హెచ్చరించారు. హైదరాబాద్‌లోని ఎల్‌బి స్టేడియంలో టిపిసిసి ఆధ్వర్యంలో నిర్వహించిన కాంగ్రెస్ బూత్ స్థాయి కన్వీనర్ల సమావేశంలో ఆయన గురువారం మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో మోడీ ఇచ్చిన అన్ని హామీలపై ప్రశ్నిస్తామన్నారు. దేశంలో ఏ ఒక్కరికీ పనులు లేకుండా చేశారని విమర్శించారు. పని లేకపోతే ప్రజలకు ఉపాధి ఎలా..? వారి కడుపు ఎలా నిండుతుందని ప్రశ్నించారు.

ప్రజాస్వామ్యానికి ఓటే పునాది

- టిడిపి అధినేత చంద్రబాబు



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రజాస్వామ్యానికి ఓటే పునాది అని, ఓటు హక్కును నిర్లక్ష్యం చేయొద్దని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా గురువారం ట్విట్టర్ (ఎక్స్)లో ఓటర్లందరికీ శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తును మార్చుకునేందుకు రాజ్యాంగం కల్పించిన అవకాశం ఓటు హక్కు అని పేర్కొన్నారు. పాలకులను ప్రశ్నించే అధికారం ఇచ్చేది ఓటు అని తెలిపారు. రాష్ట్రంలో ఇప్పుడు కొత్తగా ఓట్ల దొంగలు వచ్చారని, మీ ఓటు తీసేస్తారని, లేదా మార్చేస్తారని విమర్శించారు. ఎప్పటికప్పుడు ఓటు ఉన్నదీ, లేనిదీ చెక్ చేసుకోవాలని సూచించారు. ఓటు లేనివారు వెంటనే ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. రాష్ట్రంలో ప్రజాపాలన తీసుకురావడానికి ప్రజలందరికీ ఉన్న ఏకైక ఆయుధం ఓటేనని టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

గిరిజనుల సంపదను దోచేస్తున్న జగన్ : జనార్ధన్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత గిరిజన భూములను, సంపదను యథేచ్ఛగా దోచుకుంటున్నారని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు టిడి జనార్ధన్ విమర్శించారు. టిడిపి ఎస్‌టి సెల్ విస్తృతస్థాయి సమావేశం పార్టీ కార్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జనార్ధన్ హాజరై మాట్లాడారు. గిరిజనులకు టిడిపి అమలు చేసిన 16 సంక్షేమ పథకాలను జగన్ రద్దు చేశారని పేర్కొన్నారు. ఎస్‌టి సెల్ అధ్యక్షులు ఎం ధారునాయక్ మాట్లాడుతూ.. రూ.5 వేలకోట్ల ఎస్‌టి సబ్‌ప్లాన్ నిధులను నవరత్నాలకు మళ్లించారని విమర్శించారు. రాష్ట్రంలో దళితులు, గిరిజనులు, ముస్లిములపై వైసిపి రౌడీ మూకలు పేట్రేగిపోయి దాడులకు పాల్పడుతున్నారని పార్టీ ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్ అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సయ్యద్ రఫీ, ఏడుకొండలు, మొగిలి కల్లయ్య, కత్తి పద్మ తదితరులు పాల్గొన్నారు.

జగన్‌లో మొదలైన భయం : షరీఫ్

జగన్‌కు ఓటమి భయం పట్టుకుందని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు మహ్మద్ షరీఫ్ అన్నారు. టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో అహంకారంతో విర్రవీగిన వ్యక్తి ఇప్పుడు.. ఓడిపోయినా ఫరవాలేదు, సంతోషంగా దిగిపోతానని వైరాగ్యంగా మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. జగన్ హయాంలో వైద్యారోగ్యశాఖ వ్యవస్థ దెబ్బతిందని ఎమ్మెల్సీ పి అశోక్‌బాబు విమర్శించారు. ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులు వైద్యసేవలు అందించేది లేదని బోర్డు ఎందుకు పెట్టాయో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. పేదల వైద్య సేవల కోసం రూ.1200 కోట్లు ఎందుకు చెల్లించడం లేదని ప్రశ్నించారు. ప్రజల రెవెన్యూ రికార్డులు మొత్తం వైసిపి నేతలకు అప్పగించేందుకే ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్, భూ సమగ్ర సర్వేలను ప్రభుత్వం తీసుకొచ్చిందని టిడిపి నాయకులు దాడి వీరభద్రరావు ఒక ప్రకటనలో విమర్శించారు.

ట్రాక్టరు ర్యాలీకి దళిత, గిరిజన సంఘాల మద్దతు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్రంలోని బిజెపి అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా చేపట్టిన గ్రామీణ బంద్‌కు మద్దతుగా జనవరి 26న నిర్వహించనున్న ట్రాక్టరు, బైకు ర్యాలీలకు దళిత, గిరిజన, సామాజిక సంఘాలు మద్దతు ప్రకటించాయి. ఈ మేరకు గురువారం అన్ని సంఘాల నాయకులు ఉమ్మడిగా ప్రకటన విడుదల చేశారు. బిజెపి మతోన్మాద విధానాల వల్ల దేశం అధోగతి పాలవుతోందని తెలిపారు. ప్రభుత్వరంగ సంస్థలను అమ్మేస్తున్నారని విమర్శించారు. ప్రకటన విడుదల చేసిన వారిలో కెవిపిఎస్ కార్యదర్శి మాల్యాద్రి, గిరిజన సంఘం కార్యదర్శి కె సురేంద్ర, డప్పు కళాకారుల సంఘం ప్రధాన కార్యదర్శి క్రాంతికుమార్, డిహెచ్‌పిఎస్ నాయకుల కరవది సుబ్బారావు, డిబిఎఫ్ నాయకులు మేళం భాగ్యారావు, ఎపిఎంఆర్‌పిఎస్ నాయకులు పేరుపోగు వెంకటేశ్వరరావు, మాల మహాసభ అధ్యక్షులు మల్లెల వెంకట్రావు, డిబిఎస్‌యు అధ్యక్షులు చిట్టిబాబు, విసికె నాయకులు విద్యాసాగర్, ఎస్ఎస్‌డి నాయకులు పిల్లి సురేంద్ర, దళిత జాగృతి సేన నాయకులు గణేష్‌బాబు, పవర్‌గ్రిడ్ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు జికెడి వరప్రసాదు, రెల్లి సంక్షేమ సంఘం నాయకులు నాగేంద్ర, బీమ్ సేన సేవాదళ్ నాయకులు నీలాంభరం, డిబిఆర్‌సి నాయకులు దేవకుమార్, దళిత మహిళా సంఘం నాయకులు రమణకుమారి, గిరిజన సంఘం నాయకులు జి ప్రభాకర్, జర్నలిస్టు నగేష్, కారుమంచి రామారావు, జొన్నలగడ్డ యోహాను, తుమ్మల ప్రాన్సిస్ తదితరులు ఉన్నారు.



ఉప్పలగుప్తంలో విశ్వనాథం కుటుంబానికి చెక్కు అందిస్తున్న భువనేశ్వరి

కార్యకర్తలకు అండగా ఉంటా

నిజం గెలవాలి కార్యక్రమంలో భువనేశ్వరి

ప్రజాశక్తి-అమలాపురం

కార్యకర్తలకు టిడిపి అండగా ఉంటుందని నారా భువనేశ్వరి అన్నారు. నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా టిడిపి అధినేత చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో అంబేద్కర్ కోనసీమ జిల్లాలో గుండెపోటుతో మరణించిన పలువురి కుటుంబాలను ఆయన సతీమణి భువనేశ్వరి గురువారం పరామర్శించారు. టిడిపి అధినేత చంద్రబాబు అంబేద్కర్ కోనసీమ జిల్లాలో గుండెపోటుతో మరణించిన పలువురి కుటుంబాలను ఆయన సతీమణి భువనేశ్వరి గురువారం పరామర్శించారు. బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ.3 లక్షల చొప్పున చెక్కులు అందజేశారు. అయినవిల్లి మండలం ఎస్.మూలపాలెంలో మోరంపూడి మీరాసాహెబ్, అల్లవరం మండలం రెల్లుగడ్డలో నడిపల్లి పల్లంరాజు, ఉప్పలగుప్తం మండలం చల్లపల్లిలో సలాది విశ్వనాథం, రాజోలు మండలం సోంపల్లిలో సరెళ్ల పెద్దిరాజు, మలికిపురం మండలం విశ్వేశ్వరాయపురంలో చెల్లుబోయిన నరసింహారావు కుటుంబాలను భువనేశ్వరి పరామర్శించారు. ఆయా కార్యక్రమాల్లో మరణించిన వారి చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె వెంట పలువురు టిడిపి నాయకులు ఉన్నారు.

జంగారెడ్డిగూడెంలో విషాదం

- ఇద్దరు చిన్నారుల అనుమానాస్పద మృతి
- ఫుడ్ పాయిజన్‌గా అనుమానం



చిన్నారుల మృత దేహాలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం (టి.నర్సాపురం)

అనుమానాస్పద స్థితిలో ఇద్దరు చిన్నారులు మృతి చెందిన సంఘటన ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో గురువారం చోటుచేసుకుంది. డిఎస్‌పి ధనుంజయుడు తెలిపిన వివరాల ప్రకారం.. కర్నూలు జిల్లా నంద్యాల ప్రాంతానికి చెందిన బేలపాటి రవి, చిన్నజమక్క భార్యాభర్తలు. వీరికి రామకృష్ణ (11), విజయ్ (6) ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరంతా ప్లాస్టిక్ వస్తువులు ఏరుకుని జీవనం సాగిస్తున్నారు.

రెండు నెలల క్రితం జంగారెడ్డిగూడెం వచ్చిన వీరు ఏలూరు రోడ్డులోని రామచంద్రపురంలో ఖాళీ స్థలంలో గుడారాలు వేసుకుని నివాసముంటున్నారు. బుధవారం రాత్రి దంపతులిద్దరూ తమ కుమారులతో కలిసి పానీపూరీ తిన్నారు. గురువారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో చిన్న కుమారుడు విజయ్‌కు తీవ్రమైన కడుపునొప్పి రావడంతో రాజమండ్రికి తరలించగా అక్కడ మృతి చెందాడు. అదే క్రమంలో ఉదయం 6:30 గంటల సమయంలో పెద్ద కుమారుడు రామకృష్ణ కడుపునొప్పి వస్తుందనడంతో ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స చేయించారు. పరిస్థితి విషమించడంతో ఏలూరు తరలిస్తుండగా మార్గమధ్యంలో చనిపోయారు. డిఎస్‌పి ధనుంజయుడు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. చిన్నారులు తిన్న ఆహారాన్ని సీజ్ చేసి ల్యాబ్‌కు పంపారు. అనుమానాస్పద మతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ కుటుంబాన్ని ఆదుకోవాలని, ఫుడ్‌పాయిజన్‌కు కారకులను గుర్తించి చర్యలు తీసుకోవాలని సిపిఎం ఆధ్వర్యాన ఆందోళన నిర్వహించారు.

కాలపరిమితి సర్క్యులర్ రద్దు చేయాలి

- మెప్మా ఆర్‌పిల సమస్యపై ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మెప్మా ఆర్‌పిల వారి కుటుంబాలు వీధులపాలయ్యే కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని ఎపి మెప్మా ఆర్‌పి (పట్టణ రిసోర్స్‌పర్సన్) ఉద్యోగుల సంఘం (సిఐటియు) డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం నాయకులు కె ధనలక్ష్మి, ఝాన్సీ గురువారం పట్టణాభివృద్ధిశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై శ్రీలక్ష్మిని కలిసి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.10 వేల వేతనం చెల్లిస్తామని జిఓ విడుదల చేసిందని, వేతనాలకు, పనికి ముడిపెట్టి చెల్లింపుల్లో కోత విధించడం సరికాదని పేర్కొన్నారు. గ్రేడింగ్ విధానం రద్దుచేసి రూ.10 వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నియామకాల సమయంలో చదువు, వయసుతో సంబంధం ఉంటుందని, 16 ఏళ్ల పనిచేసిన తరువాత ఈ నిబంధన పెట్టి తొలగించడం సరికాదని వివరించారు. సమాఖ్యలను మెర్జ్ చేయడం ద్వారా ఆర్‌పిల ఉపాధికి నష్టం కలుగుతుందని తెలిపారు. దీనిపై ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని వారు కోరారు.



మీడియాతో మాట్లాడుతున్న భారతీ ప్రవీణ్ పవార్

జనసేనతో కలసి ఎన్నికలకు వెళ్తాం

- టిడిపితో పొత్తుపై కేంద్ర మంత్రి దాటవేత

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జనసేన, బిజెపి కలిసి ఎన్నికలకు వెళతామని కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ సహాయ మంత్రి భారతీ ప్రవీణ్ పవార్ తెలిపారు. మంగళగిరి, గుంటూరులో ఆమె గురువారం మీడియాతో మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో కార్పొరేట్ ఆస్పత్రులకు ధీటుగా మంగళగిరి ఎయిమ్స్‌ను అభివృద్ధి చేస్తామన్నారు. గత సంవత్సరం ఔట్ పేషంట్స్ నాలుగు లక్షలు కాగా ఈ సంవత్సరం ఆ సంఖ్య పెరిగిందన్నారు.

ప్రధానమంత్రి జన్‌ఆరోగ్య యోజన ద్వారా మందులు కూడా అందిస్తున్నామని, ఈ కార్డుల పంపిణీపై అధికారులు మరింత శ్రద్ధపెట్టేలా చూడాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. మహిళలలో ఆర్థిక శక్తి పెంపొందించి స్వయం స్వాలంబన పొందేందుకు స్వయం సహాయక సంఘాల గ్రూపులకు వ్యాపార నిర్వహణ కోసం రూ. 50 లక్షల వరకు రుణాలు మంజూరు చేస్తామని తెలిపారు. టిడిపితో పొత్తు అంశంపై విలేకరులు అడగ్గా సమాధానాన్ని దాటవేశారు.

గిరిజన ప్రాంతాల్లో

కనీస వైద్య సౌకర్యాలు కోరుతూ పిల్

ప్రజాశక్తి-అమరావతి

గిరిజన ప్రాంతాల్లో వైద్య సౌకర్యాలు కల్పించాలని కోరుతూ హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలైంది. న్యాయవాది ఎలిశెట్టి సోమరాజు దాఖలు చేసిన పిల్‌లో ఆరోగ్యశాఖ, కుటుంబ సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి, కమిషనరు, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, విజయనగరం డిఎమ్‌హెచ్‌ఒలు, విశాఖ కెజిహెచ్ సూపరింటెండెంటు, గిరిజన సంక్షేమశాఖ డైరెక్టరును వ్యాజ్యంలో ప్రతివాదులుగా చేర్చారు. చిన్నారి మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లేందుకు అంబులెన్స్‌ను విశాఖ కెజిహెచ్ ఆస్పత్రి సూపరింటెండెంట్ ఇవ్వలేదని, ఆయనపై విచారణకు ఆదేశించాలని పిటిషనరు కోరారు. గిరిజన ప్రాంతాల్లో తగిన వైద్య సౌకర్యాలు లేకపోవడంతో అనేక మంది అనారోగ్య బారిన పడుతున్నారని అన్నారు. గిరిజన ప్రాంతాల్లో అంబులెన్సులు నడిచేలా ప్రభుత్వానికి ఆదేశాలివ్వాలని కోరారు. అంబులెన్స్ లేకపోవడంతో పలువురు రోగులను డోలీలో తీసుకెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. 'విజయనగరం జిల్లా, శృంగవరపుకోట మండలం, చిట్టెంపాడు కొండ ప్రాంతంలో జ్వరంతో బాధపడుతున్న చిన్నారి విశాఖలోని కెజిహెచ్‌లో మరణించింది. సకాలంలో తీసుకుని వెళ్లుంటే ఆమె బతికి ఉండేది. కనీసం ఆమె మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లేందుకు కెజిహెచ్ సూపరింటెండెంట్ అంబులెన్స్ సౌకర్యం కల్పించలేదు. సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో గర్భిణులు, రోగులను రహదారి వద్దకు తేవడానికి డోలీలను వాడాల్సి వస్తోంది. గిరిజన ప్రాంతాల్లో వైద్య సౌకర్యాలు కల్పనకు తగిన ఆదేశాలివ్వాలి' అని దాఖలైన పిల్‌లో పత్రికల వార్తలను జత చేశారు.



డిజిటల్ సోషల్ మీడియా పోస్టర్‌ను విడుదల చేస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

మెగా డిఎస్‌సి ప్రకటించాలి

లేదంటే రేపటినుంచి 36 గంటల దీక్ష :డివైఎఫ్ఐ వెల్లడి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే మెగా డిఎస్‌సి నోటిఫికేషన్‌ను ఈ నెల 26లోపు విడుదల చేయాలని డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జి రామన్న, వై రాము డిమాండ్ చేశారు. లేదంటే 27 నుంచి 36 గంటల నిరసన దీక్షలు చేపడతామని హెచ్చరించారు. నాలుగేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం డిఎస్‌సి అంటూ నిరుద్యోగులను నయవంచన చేసిందని విమర్శించారు. విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో 10 లక్షల మంది నిరుద్యోగులు డిఎస్‌సి నోటిఫికేషన్ కోసం నాలుగేళ్లుగా ఎదురుచూస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో 1.88 లక్షల ఉపాధ్యాయులు ఉండాల్సిన చోట కేవలం 1.69 లక్షలు మాత్రమే ఉన్నారని అన్నారు. దాదాపు 18,520 ఖాళీ పోస్టులు ఉన్నాయని, ఇవి కాకుండా ఈ నెలాఖరుకు మరో 5 వేల మంది ఉపాధ్యాయులు ఉద్యోగ విరమణ చేయనున్నారని పేర్కొన్నారు. కేంద్రం చెబుతున్న లెక్కల ప్రకారం 40 వేల ఉపాధ్యాయ ఖాళీలు ఉన్నాయని అన్నారు. జిఓ 117తో 10 వేలు, ఉపాధ్యాయ పోస్టులను, తెలుగు మీడియం తొలగించి 15 వేల పోస్టులను రద్దు చేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానిదే అని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2 వేల పాఠశాలలను ప్రభుత్వం మూసివేసిందని, ఇప్పటికే రాష్ట్రంలో 9 వేల ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్నాయని పేర్కొన్నారు. ఇన్ని పోస్టులు ఖాళీగా ఉన్నా ప్రభుత్వం మాత్రం ఖాళీలు లేవని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేక విద్యార్థులు డ్రాపౌట్ అవుతున్నారని, కొంత మంది ప్రైవేట్ పాఠశాలల్లో చేరుతున్నారని తెలిపారు. రెండేళ్లలో దాదాపు 6 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల నుంచి వెళ్లారని పేర్కొన్నారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం తెచ్చిన నూతన విద్యా విధానం-2020ను రాష్ట్రంలో అమలు చేయడం సిగ్గుచేటని అన్నారు. డిఎస్‌సి నోటిఫికేషన్ కోసం జరిగే దీక్షలో నిరుద్యోగులు పెద్దయెత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. తాము ఆందోళనలకు పిలుపునిచ్చిన ప్రతిసారీ రాష్ట్ర ప్రభుత్వం మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంక్రాంతి తరువాత నోటిఫికేషన్ విడుదల చేస్తామని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ప్రకటించారని గుర్తు చేశారు. నోటిఫికేషన్ విడుదల చేయకపోతే తమ ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్షులు పి కృష్ణ, నాయకులు గణేష్, శివ, గణపతి, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

అన్నదాతకు అన్యాయం

భారతీయ రైతు సాగుభారంతో కుంగిపోతుంటే, తరచూ కష్టాలూ కన్నీళ్లే దిగుబడిగా తల్లడిల్లిపోతుంటే- బాధ్యత గల పాలకులు ఎవరైనా సరే, ఏం చేయాలి? కాసింత సాయం అందించాలి. భుజం కాచి, బరువును పంచుకోవాలి. సాగు వ్యయాన్ని తగ్గించి, పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి. అందుకోసం తగినన్ని నిధులూ, అంతకుమించి ఆచరణకు అవసరమైన చిత్తశుద్ధినీ వెచ్చించాలి. దేశానికి రైతే వెన్నెముక అని చెప్పుకుంటున్న దేశంలో ఆ రైతును, వ్యవసాయరంగాన్నీ కంటికి రెప్పలా కాపాడుకోవటానికి కంకణబద్ధులై పనిచేయాలి. కానీ, ఘనత వహించిన మోడీ జమానా అందుకు పూర్తి విరుద్ధంగా వ్యవహరిస్తోంది. ఒకపక్క కర్షక జనోద్ధరణ గురించి ఆడంబరంగా కబుర్లు వల్లిస్తూనే, మరోపక్క రైతాంగం పట్ల కర్కశ వైఖరితో, నిర్లక్ష్య ధోరణితో ప్రవర్తిస్తోంది. వ్యవసాయ రంగానికి తోడ్పాటునివ్వటానికి కేటాయించిన నిధులను సైతం వెనక్కి తీసుకోవడం బిజెపి ప్రభుత్వపు రైతు వ్యతిరేక ధోరణికి అద్దం పడుతోంది.

2018 - 23 మధ్య ఐదేళ్ల కాలంలో కేంద్ర ప్రభుత్వం సాగు రంగానికి కేటాయించిన నిధుల్లో అక్షరాలా లక్ష కోట్లను కేంద్ర వ్యవసాయ శాఖ ఎందుకూ కేటాయించకుండానే వెనక్కు పంపేసింది. ఒక ఏడాది కాదు; ఐదేళ్లూ ఇదే వరస! ఏటా బడ్జెట్‌లో కేటాయించిన దానిలో దాదాపు సగాన్ని కేంద్ర ధనాగారానికి తిరిగి జమ చేయటమే ఘనమైన పనిగా ఆ శాఖ నిర్వాకం అఘోరించింది. అదే కాలంలో దేశవ్యాప్తంగా లక్ష మంది రైతులు సాగు నష్టాలను, అప్పుల కష్టాలనూ తట్టుకోలేక ప్రాణాలు తీసుకున్నారని ప్రభుత్వ లెక్కలే చెబుతున్నాయి. ఈ ఐదేళ్ల కాలంలోనే మోడీ ప్రభుత్వం ఎరువుల ధరలు తగ్గిస్తామని డప్పాలు కొట్టి, రాయితీలను దారుణంగా తగ్గించి వేసింది. 2021- 22లో రూ.2.54 లక్షల కోట్ల రాయితీని కేటాయించగా, 2022 - 23 సంవత్సరానికి దానిని రూ.1.08 లక్షల కోట్లకే పరిమితం చేసింది. అంతర్జాతీయంగా ఎరువుల ముడిసరుకుల ధరలు తగ్గినా దేశంలో 30 శాతం దాకా ఎరువుల ధరలు పెరిగాయి. అంతర్జాతీయ విపణిలో వచ్చిన ధరల మార్పును యథాతథంగా ఇక్కడ అమలు చేసినా, ఎరువుల బరువు దాదాపు సగం తగ్గి ఉండేది. కానీ, కేంద్ర ప్రభుత్వం ఆ తగ్గింపుతో మిగిలే మొత్తాన్ని తన ఖాతాలో వేసుకొని, రాయితీలో కోత విధించి, రైతుల నెత్తిన భారం మోపింది. అదే కాలంలో కార్పొరేట్లకు లాభాల పంట పండించేలా నల్లచట్టాలను తీసుకొచ్చింది. దాన్నుంచి మోడీ సర్కారు వెనకడుగు వేయటానికి రైతులు అపూర్వమైన, సుదీర్ఘమైన ఐక్య పోరాటం చేయాల్సి వచ్చింది.

పంటలు పండించటం అనేది ఒక పరిశ్రమలో సరుకుల ఉత్పత్తి చేయడం వలె సజావుగా సాగదు. విత్తనాల కొరత, ఎరువుల అలభ్యత వంటి పాలక పెద్దల అచేతనత్వాన్ని; పెట్టుబడి దొరకని దైన్యాన్ని; అతివృష్టి, అనావృష్టి వంటి ప్రకృతి వైపరీత్యాలను; చీడలూ పీడలు వంటి తెగుళ్ల దాడిని; తూకాల మోసం, ధరల పతనం వంటి దళారీల పన్నాగాలనూ ఎదుర్కొని రైతు సాగు చక్రాన్ని నడిపించాలి. ఇంతా చేస్తే అన్నదాతకు చివరాఖరికి దక్కేది దు:ఖం తప్ప మరొకటి కాదు. అందుకనే సాగుకు అవసరమైన సమస్త సదుపాయాలను సమకూర్చాల్సిన బాధ్యత ప్రభుత్వాలది. స్వాతంత్ర్యానంతరం ఏలుబడిలోకి వచ్చిన ప్రభుత్వాలు ఎంతోకొంత ఆ దిశగా ప్రయత్నం చేశాయి. చేయాల్సింది ఇంకా ఎంతో ఉండగానే ప్రపంచీకరణ విధానాలు వెల్లువెత్తి, వ్యవసాయరంగాన్ని, ఆ దాపున చిన్న సన్నకారు రైతులనూ దారుణాతి దారుణంగా దెబ్బ తీయడం మొదలైంది! ఇంత దారుణమైన వాస్తవం కళ్లముందు కదలాడుతున్నా కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. రైతుకు ఉపశమనం కలిగించే స్వామినాథన్ కమిటీ సిఫార్సులూ, అనేకమంది వ్యవసాయ రంగ నిపుణుల సూచనలూ అమలు చేయాల్సి ఉన్నా, ఏమాత్రం పట్టింపు లేకుండా ప్రవర్తిస్తోంది. వ్యవసాయరంగాన్ని అన్ని విధాలుగా కుదేలు చేసి, రైతులను సాగు నుంచి, భూమి నుంచి దూరం చేయాలన్నదే మోడీ ప్రభుత్వ కుట్ర. వేలాది ఎకరాలను కార్పొరేట్లకు కట్టబెట్టి, వారి లాభాల పంటకు ఇతోధిక సహాయం అందించటం దాని ప్రణాళిక. రైతు రక్షణ కోసం, ఆహార భద్రత కోసం, దేశ స్వావలంబన కోసం పరితపించే ప్రతి ఒక్కరూ ఈ కుతంత్రాలను ఎండగట్టాలి. రైతుకు రక్షణగా నిలబడడం వర్తమాన కాలపు అత్యుత్తమ దేశభక్తి, నిర్వర్తించాల్సిన నిఖార్సయిన కర్తవ్యం!

మహనీయుల మాట



చదువుకున్న పౌరులు లేకుండా ఏ దేశమూ అభివృద్ధి చెందలేదు. కట్లు తెంపుకోవడానికి కత్తి లాంటి ఆయుధం చదువొక్కటే.

- నెల్సన్ మండేలా

75 ఏళ్ల భారత రాజ్యాంగం-ప్రస్తుత సవాళ్లు

సందర్భం



కె.యస్.లక్ష్మణరావు


2024 జనవరి 26న భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి 74 ఏళ్లు పూర్తి చేసుకుని 75వ సంవత్సరంలో అడుగు పెడుతున్నది. రాజ్యాంగ పరిషత్ దాదాపు మూడేళ్ల పాటు కృషి చేసి రూపొందించిన రాజ్యాంగం 1949 నవంబర్ 26న ఆమోదం పొంది, 1950 జనవరి 26న అమలులోకి రావడంతో 'గణతంత్ర' (రిపబ్లిక్) దినోత్సవంగా ప్రకటించుకున్నాము. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ నాయకత్వాన ముసాయిదా కమిటీ 60 రాజ్యాంగాలను తులనాత్మక అధ్యయనం చేసి భారత రాజ్యాంగాన్ని రూపొందించింది. 'రాజ్యాంగ పీఠిక'లో రాజ్యాంగ లక్ష్యాలను, ఆశయాలను వివరించారు. 1973లో కేశవానంద భారతి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ కేసులో సుప్రీంకోర్టు రాజ్యాంగ 'మౌలిక స్వరూపాన్ని' పేర్కొన్నది. రాజ్యాంగ మౌలిక స్వరూప అంశాలుగా సమాఖ్య విధానం, లౌకికవాదం, పార్లమెంటరీ ప్రజాస్వామ్యం, స్వతంత్ర న్యాయ వ్యవస్థ, ప్రాథమిక హక్కులు మొదలగు వాటిని న్యాయమూర్తులు పేర్కొన్నారు. గత 74 ఏళ్లుగా భారత రాజ్యాంగం కాలపరీక్షకు నిలబడి, 'భిన్నత్వం' గల భారత దేశాన్ని సమైక్యంగా ముందుకు తీసుకువెళ్లటానికి దోహదపడినది. దాదాపు 105కు పైగా రాజ్యాంగ సవరణలు జరిగినప్పటికి రాజ్యాంగ మౌలిక స్వరూపం కొనసాగుతూనే ఉన్నది. కాని 2014 నుంచి ఇప్పటి వరకు భారత రాజ్యాంగం 'మౌలిక స్వరూపమే' కోల్పోయే విధంగా దాడులు ఎదుర్కొంటున్నది. ప్రస్తుతం భారత రాజ్యాంగం ఎదుర్కొంటున్న సవాళ్ల నుంచి బయట పడాలంటే ప్రజాచైతన్యం, ప్రజాభిప్రాయమే ప్రధాన మార్గం.

సమాఖ్య విధానంపై దాడి

భారతదేశానికి గల భిన్నత్వం దృష్ట్యా రాజ్యాంగ నిర్మాతలు సమాఖ్య విధానాన్ని ప్రతిపాదించారు. రాజ్యాంగంలో సమాఖ్య అనే పదం ఉపయోగించనప్పటికీ, 1వ నిబంధనలో భారతదేశాన్ని 'యూనియన్ ఆఫ్ స్టేట్స్' అని చెప్పారు. రాజ్యాంగంలోని 7వ షెడ్యూల్‌లో కేంద్ర, రాష్ట్రాల మధ్య అధికారాలను కేంద్ర జాబితా, రాష్ట్ర జాబితా, ఉమ్మడి జాబితాలుగా విభజించారు. అనేక సందర్భాలలో కేంద్ర రాష్ట్ర సంబంధాలలో మార్పుల కోసం నియమించి వాటి సిఫార్సుల ఆధారంగా రాష్ట్రాలకు అధికారాలు ఇచ్చారు.

నరేంద్ర మోడీ ప్రభుత్వం 2014లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సమాఖ్య విధానంపై దాడి ప్రారంభించి రాష్ట్రాల హక్కులను హరిస్తున్నారు. మోడీ ప్రభుత్వం చేపట్టిన పెద్ద నోట్ల రద్దు, జి.యస్.టి రాష్ట్రాల ఆర్థిక వనరులను దెబ్బతీశాయి. పెద్ద నోట్ల రద్దు తర్వాత వేలాది చిన్నతరహా పరిశ్రమలు మూతపడి రాష్ట్రాలు ఆర్థికంగా నష్టపోయాయి. జి.యస్.టి వలన రాష్ట్రాలకు లక్ష కోట్లు నష్టం జరిగింది. నరేంద్ర మోడీ ప్రభుత్వం చేసిన 3 వ్యవసాయ చట్టాలు సమాఖ్య విధానానికి పూర్తి విరుద్ధం. వ్యవసాయం రాష్ట్ర జాబితాలో ఉండగా, కేంద్రం ఈ చట్టాలను చేసింది. అందువల్లనే లక్షలాది మంది రైతాంగం ఈ చట్టాలకు వ్యతిరేకంగా ఆందోళన చేయడంతో వాటిని ఉపసంహరించుకోక తప్పలేదు. విద్య ఉమ్మడి జాబితాలో ఉన్నది. విద్యారంగంలో ప్రధాన నిర్ణయాలు చేయాలంటే రాష్ట్రాలతో సంప్రదించాలి. కాని నరేంద్ర మోడీ ప్రభుత్వం 2020 జులైలో రాష్ట్రాలతో సంప్రదించకుండానే 'జాతీయ విద్యావిధానం-2020' ప్రకటించడం సమాఖ్య స్ఫూర్తికి పూర్తిగా విరుద్ధం.

కేంద్ర ప్రభుత్వం తరచుగా జమిలి ఎన్నికల గురించి ప్రస్తావించడమే కాక ఇటీవల మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆధ్వర్యంలో జమిలి ఎన్నికల కోసం ఒక కమిటీని నియమించడం ఫెడరల్ విధానానికి విరుద్ధం. బహు పార్టీ వ్యవస్థ బలంగా ఉండి భిన్నమైన పార్టీలు భిన్న రాష్ట్రాలలో గెలుపొందుతున్న సమయంలో జమిలి ఎన్నికలు సాధ్యం కాదు. నరేంద్రమోడీ నియమించిన గవర్నర్లు కేరళ, తమిళనాడు, కర్ణాటక మొదలైన రాష్ట్రాలలో అక్కడి రాష్ట్ర ప్రభుత్వాలను ఇబ్బందికి గురిచేయటం రాజ్యాంగ స్ఫూర్తికి పూర్తి విరుద్ధం.



> **ప్రస్తుతం దేశంలో కొనసాగుతున్న కార్పొరేట్ రాజకీయాలు, క్రోనీ కాపిటలిజమ్ రాజ్యాంగ లక్ష్యాలకు పూర్తిగా విరుద్ధం. నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేనాటికి కేవలం 50,000 కోట్లకు అధిపతిగా ఉన్న అదానీ నేడు 11 లక్షల కోట్లకు అధిపతిగా మారారు. కేంద్రంలోను అనేక రాష్ట్రాలలోను మౌలిక సదుపాయాలకు సంబంధించిన ఓడరేవులు, విమానాశ్రయాలు, విద్యుత్ కంపెనీలు, బొగ్గు మొదలైన రంగాలన్నీ అదానీ, అంబానీల నియంత్రణలోనే ఉన్నాయి. వీరు రాజకీయ రంగాన్ని నియంత్రణ చేస్తూ తమ వ్యాపార ప్రయోజనాలను కాపాడుకుంటున్నారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం వీరికి పూర్తిగా సహకరిస్తున్నది.**

లౌకికవాదానికి విఘాతం

ఆధునిక ప్రపంచంలో లౌకికవాదం కలిగిన దేశం మాత్రమే ప్రజాస్వామ్య రాజ్యంగా కొనసాగుతుంది. రాజ్యాంగ నిర్మాతలు భారత ప్రజలకు 25 నుంచి 28 వరకు గల నిబంధనలలో మత స్వేచ్ఛను కల్పించారు. భారత రాజ్యాంగాన్ని పీఠికలో లౌకికరాజ్యంగా ప్రకటించారు. కానీ నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలను మతపరంగా విభజన చేస్తూ 'మెజారిటీ వాదాన్ని' రెచ్చగొడుతున్నది. అనేకచోట్ల మైనార్టీలపై, దళితులపై దాడులు జరుగుతున్నాయి. మత విభజన చేయడానికి జమ్ము కాశ్మీర్ రాష్ట్రానికి రాజ్యాంగం కల్పించిన 370వ నిబంధన రద్దు చేయటమే కాక, జమ్ము కాశ్మీర్ రాష్ట్ర ప్రతిపత్తి కూడా లేకుండా చేసింది. పౌరుల మధ్య మతపరమైన భావోద్వేగాలను రెచ్చగొట్టడానికి 'ఏక పౌరస్మృతి' అంశాన్ని తెర మీదకు తెచ్చింది. అయోధ్యలో రామాలయ నిర్మాణం అంశాన్ని మతపరమైన అంశంగా మార్చి రాజకీయ లబ్ధి పొందే విధంగా ఆ ఉత్సవాన్ని నిర్వహించింది. ఈ ఉత్సవం మొత్తం భక్తికి సంబంధించిన అంశంలా కాకుండా 'మెజారిటీ వాదాన్ని రెచ్చగొట్టే విధంగా' కొనసాగటాన్ని ప్రత్యక్షంగా మనందరం చూశాం.

మణిపూర్‌లో కుకీలు, మెయితీలు మధ్య బేధాలను సృష్టించి మతపరంగా లబ్ధి పొందటానికి ప్రయత్నం జరుగుతున్నది. పాఠ్యపుస్తకాలలో కూడా చరిత్ర పాఠాలపై దాడి చేస్తూ మతతత్వాన్ని రెచ్చగొట్టే ప్రయత్నాలను చేస్తున్నది. చివరికి 'కాశ్మీరీ ఫైల్స్' వంటి సినిమాల ద్వారా కూడా మతపరమైన విభజనకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నది.

ప్రమాదంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యం

రాజ్యాంగ నిర్మాతలు భారతదేశంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని ప్రవేశపెట్టారు. కార్యనిర్వాహక వర్గం, శాసనశాఖ, న్యాయ వ్యవస్థల మధ్య సమతౌల్యత ఉండాలి. కానీ ఇప్పుడు ఈ వ్యవస్థలన్నీ మోడీ ప్రభుత్వ నిరంకుశత్వానికి బలైపోతున్నాయి. ఎన్నికల కమిషన్‌కు స్వతంత్రత లేకుండా చేయటానికి ఇటీవల చట్టాన్ని ఆమోదించారు. సుప్రీంకోర్టు పని తీరులో కూడా జోక్యం చేసుకుంటున్నారు. కొలీజియం చేసిన కొన్ని నిర్ణయాలను మోడీ ప్రభుత్వం ఆమోదించకుండా తమకిష్టమైన న్యాయమూర్తులను మాత్రమే నియమిస్తున్నారు. అనేక కేసులలో సుప్రీంకోర్టు తీర్పులు ప్రభుత్వానికి అనుకూలంగా రావటానికి ఇదే ప్రధాన కారణం. మోడీ భారతదేశ పార్లమెంటరీ విధానాన్ని ఆచరణలో అధ్యక్ష పాలనా విధానంగా మార్చివేస్తున్నారు.

భావప్రకటనా స్వేచ్ఛపై ఆంక్షలు

భారత రాజ్యాంగంలో 19వ నిబంధన ద్వారా పౌరుడికి భావప్రకటనా స్వేచ్ఛ, పౌర స్వేచ్ఛ కల్పించబడ్డాయి. పౌరుల ఈ స్వేచ్ఛలను కాపాడటానికి రాజ్యాంగం అనేక రక్షణలు కల్పించినది. సుప్రీంకోర్టు, హైకోర్టుల ద్వారా ఈ స్వేచ్ఛలను కాపాడుకోవచ్చని రాజ్యాంగం చెప్పింది. కానీ మెడీ ప్రభుత్వం భావప్రకటనా స్వేచ్ఛకు అనేక ప్రతిబంధకాలు కల్పిస్తున్నది. గతంలో గోవింద పన్సారే, గౌరీ లంకేశ్, యమ్.యమ్.కల్బుర్గి వంటి వారిని సంఘ పరివార్ శక్తులు హత్య చేశాయి. తమతో విభేదించేవారిని, ప్రశ్నించేవారిని దేశద్రోహులుగా ముద్ర వేసి జైళ్లలో ఏళ్ల తరబడి ఉంచుతున్నారు. ప్రొఫెసర్ సాయిబాబాకు హైకోర్టు బెయిల్ ఇచ్చినప్పటికీ సుప్రీంకోర్టు ద్వారా ఆ బెయిల్‌ను రద్దు చేయించడం దీనికి పెద్ద ఉదాహరణ.

అనేక విశ్వవిద్యాలయాలలో ముఖ్యంగా ఢిల్లీలో గల జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం వంటి చోట విద్యార్థి ఉద్యమాలను అణచివేస్తున్నారు. యన్.డి.టివి, ది వైర్, న్యూస్ క్లిక్ వంటి మీడియా సంస్థల గొంతును నొక్కివేయడం ప్రస్తుత పౌరస్వేచ్ఛ పరిమితిని తెలియచేస్తున్నది. ప్రబీర్ పురకాయస్థ వంటి పలువురు జర్నలిస్టులను, కాలమిస్టులను అరెస్టు చేసి నెలల తరబడి జైళ్లలో ఉంచటం రాజ్యాంగ సూత్రాలకు పూర్తి విరుద్ధం. బిల్కిస్ బానో ఉదంతంలో నేరస్తులను విడుదల చేసి, పూలదండలు వేసి ఊరేగించటం సంఘ పరివార్ దుర్మార్గాన్ని తెలుపుతున్నది. అయితే ఇటీవల బిల్కిస్ బానో కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు కొంత ఉపశమనంగా ఉన్నది.

కార్పొరేట్ రాజకీయాలు-క్రోనీ కాపిటలిజమ్

ప్రస్తుతం దేశంలో కొనసాగుతున్న కార్పొరేట్ రాజకీయాలు, క్రోనీ కాపిటలిజమ్ రాజ్యాంగ లక్ష్యాలకు పూర్తిగా విరుద్ధం. నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేనాటికి కేవలం 50,000 కోట్లకు అధిపతిగా ఉన్న అదానీ నేడు 11 లక్షల కోట్లకు అధిపతిగా మారారు. కేంద్రంలోను అనేక రాష్ట్రాలలోను మౌలిక సదుపాయాలకు సంబంధించిన ఓడరేవులు, విమానాశ్రయాలు, విద్యుత్ కంపెనీలు, బొగ్గు మొదలైన రంగాలన్నీ అదానీ, అంబానీల నియంత్రణలోనే ఉన్నాయి. వీరు రాజకీయ రంగాన్ని నియంత్రణ చేస్తూ తమ వ్యాపార ప్రయోజనాలను కాపాడుకుంటున్నారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం వీరికి పూర్తిగా సహకరిస్తున్నది.

రాజ్యాంగం అమలులోకి వచ్చిన మొదటి మూడు దశాబ్దాలు వివిధ రాజకీయ పార్టీలలో సేవా దృక్పథం కలవారు, రాజకీయాలను పూర్తికాలపు వృత్తిగా స్వీకరించిన వారు పోటీ చేసి ప్రజాప్రతినిధులుగా ఎన్నికయ్యేవారు. కానీ ఆర్థిక సంస్కరణల తర్వాత రాజకీయాలు కార్పొరేటీకరణ చెంది, ప్రధాన రాజకీయ పార్టీలలో కార్పొరేట్ ప్రతినిధులు వ్యాపారవేత్తలు, ప్రజా ప్రతినిధులుగా పోటీ చేస్తున్నారు. లోకసభకు రూ. 100 కోట్లు, శాసనసభకు రూ.25 కోట్లకు పైగా ఖర్చు చేసేవారు మాత్రమే పోటీ చేయాలని రాజకీయ పార్టీలు భావిస్తున్నాయి. గెలుపొందిన వారు వ్యాపారం చేసుకుంటూ తమ పదవిని వ్యాపార ప్రయోజనాలకు వినియోగించుకుంటున్నారు. దీని వలన నిజాయితీపరులు, సామాజికవేత్తలు, వామపక్ష ప్రజా దృక్పథం కలిగిన వారు ఎన్నికలలో పోటీ చేయలేకపోతున్నారు.

క్రోనీ కాపిటలిజమ్ విస్తృతంగా పెరిగి రాజకీయ అధికారం కలిగిన వారు భూములను, ఖనిజ సంపదను, ఇసుకను, కాంట్రాక్టులను విస్తృతంగా పందేరాలు చేస్తున్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న రాజకీయ పరిణామాలు, ఒక పార్టీ నుంచి మరో పార్టీలోకి చొక్కా మార్చుకున్నంత తేలికగా మారిపోవటం క్రోనీ కాపిటలిజానికి ఉదాహరణగా చెప్పవచ్చు. కార్పొరేట్ రాజకీయాల ద్వారా జరుగుతున్న పరిణామాలు, క్రోనీ కాపిటలిజమ్ రూపంలో జరుగుతున్న అంశాలు రాజ్యాంగ లక్ష్యాలకు పూర్తి విరుద్ధం.

రాజ్యాంగమే సర్వోన్నతం

భారతదేశంలో రాజ్యాంగమే సర్వోన్నతమైనది. అన్ని వ్యవస్థలు, సంస్థలు కూడా రాజ్యాంగానికి అనుగుణంగా పని చేయాలి. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ 1949 నవంబర్ 26న కింది విధంగా పేర్కొన్నారు. 'ఒక రాజ్యాంగం ఎంత మంచిదైనా, గొప్పదైనా కావచ్చు, కాని దానిని అమలు చేసేవాళ్లు చెడ్డవాళ్లయితే అది పనిచేయదు' అని చెప్పారు. 1975లో భారత రాజ్యాంగం అత్యవసర పరిస్థితి విధింపు రూపంలో ఒక దాడిని ఎదుర్కొన్నది. భారత ప్రజలు 1977లో దానిని విజయవంతంగా ఎదుర్కొని తిప్పికొట్టారు. ఇప్పుడు మోడీ ప్రభుత్వ రూపంలో భారత రాజ్యాంగ మౌలిక స్వరూపంపై, రాజ్యాంగ లక్ష్యాలు, ఆదర్శాలపై దాడి జరుగుతున్నది. రాజ్యాంగం సవాళ్లను ఎదుర్కొంటున్నది. ఈ సవాళ్ల ఎదుర్కొనటానికి విస్తృతమైన ప్రజా మద్దతు అవసరం. ఆధునిక భారత రాజ్యాంగ లక్ష్యాల స్థానంలో ప్రాచీన మనుస్మృతి లక్ష్యాలను ప్రతిష్ఠించటానికి సంఘ పరివార్ వ్యూహాత్మక ఎత్తుగడలతో పనిచేస్తున్నది. ఈ ఎత్తుగడలను ఓడించడానికి ప్రజాభిప్రాయం, ప్రజా చైతన్యమే ఏకైక మార్గం. భారత రాజ్యాంగాన్ని ఆధారం చేసుకుని ఈ కృషి కొనసాగాలి.

/ వ్యాసకర్త శాసనమండలి సభ్యులు,
సెల్ : 8309965083 /

స్వాతంత్ర్య పోరాటంలో త్యాగధనులు

విశ్లేషణ



డా॥ దేవరాజు మహారాజు

భారత స్వాతంత్ర్య పోరాటం కోసం ముస్లింలు చేసిన త్యాగాలు దాచేస్తే దాగేవి కావు. ఒక్కసారి చరిత్రలోకి తొంగిచూసిన వారికి నిజాలు అవగతమౌతాయి. "భారత స్వాతంత్ర్యం ముస్లింల రక్తంతో రాయబడిందని, ముస్లింల జనాభా కన్నా, స్వాతంత్ర్య పోరాటంలో వారి భాగస్వామ్య శాతం ఎక్కువనీ"- ప్రఖ్యాత జర్నలిస్ట్ కుష్వంత్ సింగ్ నిర్ధారించారు. తన రాజ్యం తన దత్త పుత్రునికే సంక్రమించాలన్న పట్టుదలతో ఝాన్సీరాణి బ్రిటీష్ వారిపై యుద్ధం ప్రకటించిందని మనం చరిత్రలో చదువుకున్నాం. కానీ, అంతే వీరోచితంగా పోరాడిన బేగం హజ్రత్ మహల్ (అవధ్ రాణి)-చరిత్రలో ప్రాధాన్యత సంతరించుకోలేదు. ఇది అన్యాయం! 1857 జూన్ 30న ప్రప్రథమ స్వాతంత్ర్య పోరాటంలో చిన్‌హట్ వద్ద బ్రిటీష్ పాలకుడు సర్ హెన్రీ లారెన్‌ను తుపాకీతో చంపి, బ్రిటీష్ సైన్యాన్ని చిత్తు చిత్తుగా ఓడించిన బేగం హజ్రత్ మహల్‌ను ఎందుకు కీర్తించగూడదూ? ఆమె, కేవలం ముస్లిం మహిళ అయినందుకేనా? ఆమె చూపిన తెగువకూ, శౌర్యానికీ విలువే లేదా? మనిషి విలువను మనిషే గుర్తించక పోతే ఎలా? సమాజాన్ని అంతటి హీన స్థాయికి దిగజార్చింది ఎవరూ? వారిని మనుషులనే అందామా?

భారత స్వాతంత్ర్య పోరాటం కోసం ముస్లింలు తమ మసీదులను యుద్ధ స్థావరాలుగా ఉపయోగించారు. ఉత్తరప్రదేశ్‌లో ఒక మసీదులో ఒక ఇమామ్ స్వాతంత్ర్య పోరాటం గురించి ప్రసంగిస్తూ ఉండగా బ్రిటీష్ సైన్యం మసీదులో ఉన్న వారిపై నిర్దాక్షిణ్యంగా కాల్పులు జరిపింది. అప్పుడు చిందిన ఆ స్వాతంత్ర్య సమరయోధుల నెత్తుటి మరకలు ఇప్పటికీ మనం ఆ మసీదు గోడలపై చూడొచ్చు. ముస్లింలు భారతదేశాన్ని సుమారు 300 ఏళ్లు పరిపాలించారు. ఇక్కడే బతికారు. ఇక్కడే మరణించారు. ఇది తమ స్వంత నేల అనుకున్నారు. అంతేగాని, ఇక్కడి నుంచి వారు ఏదీ కొల్లగొట్టుకుని పోలేదు. అలా కొల్లగొట్టుకుని పోయే పని బ్రిటీష్ వారు చేశారు. డచ్ వారు, ఫ్రెంచ్ వారు చేశారు. నిజాయితీపరులు రాసిన చరిత్ర చదివితే నిజాలు తెలుస్తాయి. మొఘలులు ఇక్కడి చిన్న చిన్న రాజ్యాలను ఐక్యం చేసి, విశాలమైన ఒక మహా సామ్రాజ్యాన్ని స్థాపించారు. విద్య, సాహిత్యం, కళలు, భవన నిర్మాణ రంగాల్లో దేశాన్ని తలమానికం చేశారు. న్యాయ, రాజకీయ, పరిపాలనా నిర్వహణ వ్యవస్థల్ని అభివృద్ధి చేశారు.

> **నిజాలకు మసిపూసి మారేడు కాయలు చేయడం ఎంత మాత్రమూ దేశభక్తి కాదని చెప్పాల్సి ఉంది. నిజాల్ని నిర్భయంగా చెపుతూ ఉండడమే, ప్రచారంలో ఉంచడమే అన్నింటినీ మించిన దేశభక్తి. మతానికీ దేశభక్తికి సంబంధం లేదు. ఏదో ఒక మతస్థులే దేశభక్తులని, ఇతర మతస్థులంతా దేశ ద్రోహులని-ఈనాటి పాలకులు చేస్తున్న ప్రచారాన్ని ప్రజలంతా సమైక్యంగా తిప్పి కొట్టాల్సిన అవసరం ఉంది.**



న్యూఢిల్లీ లోని ఇండియా గేట్ మీద 95,300 మంది సమర యోధుల పేర్లు రాస్తే, అందులో 61,945 పేర్లు ముస్లిం యోధులవే! ఈ విషయాన్ని అందరూ గమనించాలి. ఇందులో గుజరాత్ రాష్ట్రానికి చెందిన రాజకీయ నాయకుల, వ్యాపార దిగ్గజాల పూర్వీకుల పేర్లు ఎవరివీ లేవు! తమిళనాడులో ఇస్మాయిల్ సాహెబ్-మరుదా నాయగం అనే ఇద్దరు వ్యక్తులు బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా నిరంతరం ఏడు సంవత్సరాలు పోరాడారు. చివరికి వారి పేరు వింటేనే బ్రిటీష్ వారికి చెమటలు పట్టేవి. బ్రిటీష్ వారు అంతగా హడలెత్తి పోయారు.

భారత స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా, బ్రిటీష్ ఈస్ట్ ఇండియా కంపెనీకి వ్యతిరేకంగా ఓడ నడిపిన మొట్టమొదటి నావికుడు-కప్పలో తియ తమిల్ జన్. ఇతని గురించి కొంత మందికి తెలిసి ఉంటుంది. కానీ, అతను నడిపిన ఓడను విరాళంగా ఎవరిచ్చారో చాలా మందికి తెలిసి ఉండకపోవచ్చు. అంత విలువైన ఓడను దేశం కోసం విరాళంగా ఇచ్చింది ఫకీర్ మహ్మద్ రౌథర్. ఇకపోతే, ఈ కప్పలో తియ తమిల్ జన్ అరెస్ట్ అయినప్పుడు, అతణ్ణి విడుదల చేయాలని ఒక స్వాతంత్ర్య సమర యోధుడు ధర్నా చేశాడు. అతని పేరు మహ్మద్ యాసీన్. ధర్నా చేసినందుకు మహ్మద్ యాసీన్‌ను బ్రిటీష్ సైనికులు నిర్దాక్షిణ్యంగా కాల్చి చంపారు. పోరాటంలో ప్రాణాలు త్యాగం చేయటం ముస్లిం యోధులకు తెలుసు. వారికి ఎవరూ దేశభక్తి గురించి ఉపన్యాసాలిచ్చే అవసరం లేదు. తిరుప్పూర్ (కోడికట) కుమారన్ స్వాతంత్ర్య పోరాటంలో అరెస్టయ్యాడు. ఆయనతో పాటు, అబ్దుల్ లతీఫ్, అక్బర్ అలీ, మొహిద్దీన్ ఖాన్, అబ్దుల్ రహీం, వావు సాహెబ్, (మరో) అబ్దుల్ లతీఫ్, షేక్ బాబా సాహెబ్-అనే మరో ఏడుగురు స్వాతంత్ర్య యోధులు కూడా అరెస్టయ్యారు.

నేతాజీ సుభాష్ చంద్రబోస్ 'ఇండియన్ నేషనల్ ఆర్మీ'ని తయారు చేశాడని అందరికీ తెలుసు, కానీ, అందులో ముఖ్య భూమికను పోషించిన కమాండర్లు-ఆఫీసర్లు అంతా ముస్లింలేనన్నది చాలా కొద్ది మందికే తెలుసు. ఇండియన్ నేషనల్ ఆర్మీలో ఉన్న పందొమ్మిది మంది ముఖ్యమైన కమాండర్లలో - అయిదుగురు ముస్లింలే. అందులో మన హైద్రాబాద్‌కు చెందిన ఆబిద్ హుస్సేని సఫ్రానీ ముఖ్యుడు. ఎందుకంటే, 'జై హింద్' నినాదాన్ని రూపొందించింది ఆయనే. సఫ్రానీ-అంటే కాషాయ రంగు. హిందువుల కాషాయాన్ని తన పేరు చివర చేర్చుకుని పరమత సహనానికి ఒక నిర్వచనంగా నిలిచిన వాడాయన! నేటి కుహనా దేశ భక్తులు 'జై హింద్' వాడుకుంటారు. కానీ, అది రూపొందించిన వాణ్ణి గుర్తించరు. పైగా ముస్లింల ఇళ్ళ పైకి డబులింజన్ బుల్‌డోజర్లు తోలుతారు? అదేం దేశ ప్రేమ? నేతాజీ ఇండియన్ నేషనల్ ఆర్మీలో చీఫ్ కమాండరే ఒక ముస్లిం! ఆయన పేరు షా నవాజ్ ఖాన్ !!

మోమన్ అబ్దుల్ హబీబ్ యూసుఫ్ మార్ఫానీ అనే అతను తన యావదాస్తి నేతాజీ ఇండియన్ నేషనల్ ఆర్మీకి దానం చేశాడు. ఆ రోజుల్లోనే ఆ ఆస్థి విలువ కోటి రూపాయల కన్నా ఎక్కువ. ఇప్పటి లెక్కల్లో అయితే ఎన్ని బిలియన్లవుతాయో? ఆ రోజుల్లోనే యం.కె.యం. అమీర్ హంజా ఎన్నో లక్షల రూపాయలు నేతాజీ ఆర్మీకి విరాళంగా ఇచ్చాడు. ఆయన కుటుంబీకులు తర్వాత కాలంలో నిరుపేదలుగా బతికారు. తమిళనాడు -రామనాథపురంలో చిన్న అద్దె ఇంట్లో నానా యాతనా అనుభవించారు. బీవమ్మ - అనే ఒక ముస్లిం తల్లి బిడ్డల కోసం దాచిపెట్టకుండా తనకున్న ముప్పయి లక్షల రూపాయల ఆస్థిని భారత స్వాతంత్ర్య పోరాటం కోసం విరాళంగా ఇచ్చింది. వీరివి త్యాగాలు కావు. వీరిది దేశభక్తి కాదు. వీరిని వీరి త్యాగ నిరతిని ఎవరూ గుర్తుచేసుకోగూడదు. హిందూత్వ పేరుతో ఈ రోజుల్లో 'జై శ్రీరామ్' నినాదాలిచ్చే వారిదే దేశభక్తి. వారే దేశ ప్రేమికులు. మనం వాళ్ళలో చేరి చెవుల్లో కమలాలు పెట్టుకుంటేనే మన ప్రాణలకు రక్షణ ఉంటుంది మిత్రో-

మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఈ దేశంలో పుట్టిన గొప్ప మేధావి. స్వాతంత్ర్య పోరాట కాలంలో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్‌లో సీనియర్ ముస్లిం నాయకుడు. గాంధీజీతో పాటు సారా వ్యతిరేక ఉద్యమంలో పాల్గొన్నవాడు. ఆ ఉద్యమంలో ఉన్న 19 మందిలో 10 మంది ముస్లింలే. తర్వాత కాలంలో స్వతంత్ర్య భారతదేశంలో తొలి విద్యామంత్రి అబుల్ కలాం ఆజాదే! సెక్యులరిజం స్థాపన కోసం, దేశంలో హిందూ-ముస్లింల ఐక్యత కోసం అహరహం కృషి చేశారు.

హిందూ మత దురభిమానులు, జాత్యహంకారులు చాలా నిజాల్ని దాచేస్తున్న తరుణంలో- వాస్తవాల్ని వక్రీకరిస్తున్న తరుణంలో-వచ్చే తరాలకు నిజాలు తెలియకుండా పాలకులే కుట్రలు చేస్తున్న తరుణంలో- బాధ్యతగల పౌరులంతా వివేకంతో వ్యవహరించాల్సి ఉంది. నిజాలకు మసిపూసి మారేడు కాయలు చేయడం ఎంత మాత్రమూ దేశభక్తి కాదని చెప్పాల్సి ఉంది. నిజాల్ని నిర్భయంగా చెపుతూ ఉండడమే, ప్రచారంలో ఉంచడమే అన్నింటినీ మించిన దేశభక్తి. మతానికీ దేశభక్తికి సంబంధం లేదు. ఏదో ఒక మతస్థులే దేశభక్తులని, ఇతర మతస్థులంతా దేశ ద్రోహులని-ఈనాటి పాలకులు చేస్తున్న ప్రచారాన్ని ప్రజలంతా సమైక్యంగా తిప్పి కొట్టాల్సిన అవసరం ఉంది.

/ వ్యాసకర్త కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, జీవశాస్త్రవేత్త (మెల్బోర్న్ నుంచి)/


కవిత్వం



మా రామాలయం

మా ఊళ్ళో ఉందో రామాలయం
పేద, సామాన్యుల ఆలయం
పూరి గుడిసెల మధ్యే ఆవాసం
వారి కష్టార్జితంతోనే నిర్మాణం
రోజూ హారతీ వాళ్ళకే
నవమి నాడు కళ్యాణం
ఊరంతా అక్కడే
ఆ చావటే ఊరు రచ్చబండ
చర్చలన్నీ ఆ సమక్షంలోనే
ఆ రాముడు సామాన్యుల వాడు,
నేడు నరేంద్రుడు
రాముడ్ని చేశాడు సంపన్నుల వాడిగా
భక్తులందరూ శత కోటీశ్వరులే
సామాన్యులకు చోటే లేదు
రియల్ ఎస్టేట్ ఊపు
ఆకాశ హర్మ్యాలు
స్టార్ హోటళ్లు
సర్వం వ్యాపారం
అంతా రాజకీయం
గెలుపుకు బ్రహ్మాస్త్రం
భక్తి రాముడిపై కాదు కుర్చీపై
ఏమైనా సందేహమా!

- ఎ. అజ శర్మ



సెల్ టవర్లను బటన్ నొక్కి ప్రారంభిస్తున్న సిఎం జగన్

గిరిజన ప్రాంతాల్లో
విస్తృతంగా టెలికం సేవలు

- 300 టవర్లు ప్రారంభించిన సిఎం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మారుమూల గిరిజన ప్రాంతాల్లో సమర్ధవంతమైన టెలికం సేవలను విస్తృతంగా అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. దీనిలో భాగంగా కొత్తగా ఏర్పాటు చేసిన 300 టవర్లను గురువారం క్యాంపు కార్యాలయం నుండి సిఎం బటన్‌నొక్కి ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ గతంలో వంద టవర్లు ప్రారంభించామని, కొత్తగా 300 టవర్లు ఏర్పాటు చేశామని తెలిపారు. అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాల్లో కనెక్టివిటీ లేని ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. వీటిల్లో ఎయిర్‌టెల్ ఆధ్వర్యంలో 136, జియో ఆధ్వర్యంలో 164 టవర్లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. వీటిల్లో అల్లూరి సీతారామరాజు జిల్లాలో 246, పార్వతీపురం మన్యం జిల్లాలో 44, ప్రకాశంలో నాలుగు, ఏలూరులో మూడు, శ్రీకాకుళంలో రెండు, కాకినాడ జిల్లాలో ఒక టవర్ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. సుమారు రూ.400 కోట్ల ఖర్చుతో వీటిని నిర్మించామని, దీనివల్ల 944 గ్రామాల్లో రెండు లక్షలమందికి సేవలు అందుతాయని పేర్కొన్నారు. మొత్తం 2,900 టవర్లు ఏర్పాటు చేయాల్సి ఉందని, దీనికి రూ.3,119 కోట్లు ఖర్చవుతాయని వివరించారు. 2,900 ప్రాంతాల్లో స్థలాలు కూడా ఆయా కంపెనీలకు ఇచ్చామని పేర్కొన్నారు. వీటితో గ్రామ సచివాలయాలు, ఆర్‌బికె, విలేజ్ క్లినిక్‌లు, నాడు నేడు కింద ఇంగ్లీషు మీడియం పాఠశాలల్లో సేవలు అందుతాయని పేర్కొన్నారు. వీటితో గ్రామాల రూపురేఖలు మారుతాయని వివరించారు.

అన్ని ఆస్పత్రుల్లో 'క్యాష్‌లెస్'

- జనరల్ బీమా కౌన్సిల్ వెల్లడి

న్యూఢిల్లీ : ప్రైవేటు ఆస్పత్రుల్లో ట్రీట్‌మెంటుకు సంబంధించి కీలక నిర్ణయం వెలువడింది. ఆరోగ్య బీమా తీసుకున్నవారు అన్ని ఆస్పత్రుల్లో 'క్యాష్‌లెస్' సదుపాయాన్ని వినియోగించుకోవచ్చు. గురువారం నుంచే అందుబాటులోకి వచ్చినట్లు 'ది జనరల్ ఇన్సూరెన్స్ కౌన్సిల్' వెల్లడించింది. జనరల్, హెల్త్ బీమా కంపెనీలతో సంప్రదింపుల అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఓ ప్రకటనలో తెలిపింది. బీమా పాలసీ నెట్‌వర్క్ జాబితాలో పేరు లేని ఆస్పత్రిలోనూ క్యాష్‌లెస్ సదుపాయాన్ని పొందొచ్చు.

నెట్‌వర్క్ ఆస్పత్రి జాబితాలో లేని ఆస్పత్రుల్లో క్యాష్‌లెస్ సదుపాయం పొందేందుకు 48 గంటల ముందు ఇన్సూరెన్స్ కంపెనీకి తెలియజేయాలి. అత్యవసర సమయాల్లో అయితే ఆస్పత్రిలో చేరిన 48 గంటల్లోపు సమాచారాన్ని చేరవేయాల్సి ఉంటుంది. ఇన్సూరెన్స్ పాలసీ షరతులు, నిబంధనల ఆధారంగా క్లెయిం వర్తిస్తుందని కౌన్సిల్ పేర్కొంది. ప్రస్తుతం ఏదైనా హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ తీసుకుంటే నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో మాత్రమే క్యాష్‌లెస్‌కు అనుమతి ఉంది. క్యాష్‌లెస్ సదుపాయం లేనిచోట వైద్యానికయ్యే ఖర్చును జేబులోంచి చెల్లించాల్సి ఉంటుంది. తర్వాత రీయింబర్స్‌మెంట్‌కు దరఖాస్తు చేసుకోవాలి. ఈ ప్రక్రియ సంక్లిష్టంగా ఉండడం, రిఫండ్ ప్రక్రియ ఆలస్యం కావడంతో కస్టమర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక నుంచి ఈ సమస్యలు తప్పనున్నాయి. 'క్యాష్‌లెస్' గురించి ఇప్పటికే ఆయా కంపెనీలు కస్టమర్లకు సందేశాలు పంపిస్తున్నాయి.

'అన్నిచోట్లా క్యాష్‌లెస్ సదుపాయం కస్టమర్ల జీవితాలను మరింత సులభతరం చేయనుంది. ప్రస్తుతం 63 శాతం మంది క్యాష్‌లెస్ సదుపాయం ఎంచుకుంటుంటే.. మిగిలినవారు రీయింబర్స్‌మెంట్ కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. రిఫండ్ ప్రక్రియ వల్ల కస్టమర్లు ఆర్థికంగా ఒత్తిడితోపాటు క్లెయిం చేసుకునే విషయంలోనూ అవాంతరాలు ఎదుర్కొంటున్నారు. ఈ ప్రక్రియను సులభతరం చేయడానికే తాజా నిర్ణయం తీసుకున్నాం. మోసాలను అరికట్టి కస్టమర్ల విశ్వాసం పొందేందుకు ఇది ఉపకరిస్తుంది' అని కౌన్సిల్ ఎమ్‌డి, బజాజ్ అలియాంజ్ జనరల్ ఇన్సూరెన్స్ సిఇఒ తపన్ సింఘేల్ తెలిపారు.

టిఎస్‌పిఎస్‌సి ఛైర్మన్‌గా మహేందర్‌రెడ్డి

- కొత్త పాలకమండలి నియామకం



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టిఎస్‌పిఎస్‌సి)కి కొత్త పాలకమండలిని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఛైర్మన్‌గా మాజీ డిజిపి పి.మహేందర్‌రెడ్డి నియామకమయ్యారు. సభ్యులుగా రిటైర్డ్ ఐఎఎస్ అధికారి అనితా రాజేంద్ర, ఇండియన్ పోస్టల్ సర్వీస్‌లో రిటైర్డ్ అధికారి అమీర్ ఉల్లాఖాన్, జెఎన్‌టియు హైదరాబాద్ ప్రొఫెసర్ నర్రి యాదయ్య, యరబాది రామ్మోహన్‌రావు, పాల్వాయి రజనీకుమారిని ప్రభుత్వం నియమించింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించి పంపిన ఈ నియామకాలను గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఆమోదించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అందుకు సంబంధించిన ఉత్తర్వులను గురువారం జారీ చేశారు. టిఎస్‌పిఎస్‌సి ఛైర్మన్, సభ్యుల పదవీకాలం ఆరేళ్లు లేదా సభ్యుల వయస్సు 62 ఏళ్లు నిండే వరకూ కొనసాగుతారు. మహేందర్‌రెడ్డికి ప్రస్తుతం 61 సంవత్సరాలు, ఛైర్మన్‌గా ఆయన ఇంకా 11 నెలలు మాత్రమే సేవలందిస్తారు. ఈ ఏడాది డిసెంబర్ మూడున ఆయన పదవీకాలం ముగుస్తుంది.

ఈ గౌరవం మీది : చిరంజీవి

ప్రజాశక్తి - అమరావతిబ్యూరో



పద్మ విభూషణ్ పురస్కారం తనను ఇంతటి వాడిని చేసిన కోట్లాది మంది ప్రజలకు దక్కిన గౌరవంగా చిరంజీవి పేర్కొన్నారు. ఈ మేరకు సామాజిక మాధ్యమాల్లో తన స్పందన తెలియజేశారు. ఆయన మాటల్లోనే..

"పద్మ విభూషణ్ అవార్డు వచ్చిందని తెలిసిన క్షణం నిజంగా ఏమి మాట్లాడాలో, ఎలా రియాక్ట్ అవ్వాలో తెలియని పరిస్థితి. మన దేశంలో రెండో అత్యున్నత పౌర పురస్కారం పద్మ విభూషణ్ నాకు లభించినందుకు నిజంగా చాలా సంతోషంగా ఉంది. ఒక తల్లి కడుపున పుట్టకపోయినా నన్ను తమ సొంత మనిషిగా..మీ అన్నయ్యగా..మీ బిడ్డగా భావించే కోట్లాది మంది ప్రజల ఆశీస్సులు, నా సినీ కుటుంబం యొక్క అండదండలు, అలాగే నీడలా నాతో ప్రతి నిత్యం నడిచే లక్షలాది మంది అభిమానులు, వాళ్ల ప్రేమ ఆదరణ కారణంగానే నేను ఈ రోజు ఈ స్థితిలో ఉన్నా. అందుకే నాకు ఈ రోజు దక్కిన ఈ గౌరవం మీది. మీరు నాపై చూపిన ప్రేమ ఆప్యాయతలకు నేను ఏమిచ్చి రుణం తీర్చుకోగలను. నా 45 ఏళ్ల సినీ ప్రస్థానంలో వెండితెరపై వైవిధ్యమున్న పాత్రల ద్వారా వినోదం పంచడానికి నా శక్తిమేరా నేను ప్రయత్నిస్తూనేవున్నా. నిజ జీవితంలో కూడా నా చుట్టూ ఉన్న ఈ సమాజంలో అవసరమైనప్పుడు నాకు చేతనైన సాయం చేస్తూనేవున్నా. కానీ మీరు నాపై చూపిన కొండత అభిమానానికి నేను ప్రతిగా ఇస్తున్నది గోరంతే. ఈ నిజం నాకు ప్రతిక్షణం గుర్తుకు వస్తూనేవుంటుంది. నన్ను బాధ్యతగా ముందుకు నడిపిస్తుంటుంది. నన్ను ప్రతిష్టాత్మకమైనటువంటి ఈ పద్మ విభూషణ్ అవార్డుకు ఎంపిక చేసిన భారత ప్రభుత్వానికి, గౌరవ ప్రధాని నరేంద్ర మోడీకి, నా హృదయపూర్వక కృతజ్ఞతలు. జైహింద్" అని చిరంజీవి పేర్కొన్నారు.

సుప్రీం మార్గదర్శకాల ప్రకారం
పోలీసు మాన్యువల్ మార్చాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్
- రాష్ట్రంలో మానవ హక్కుల ఉల్లంఘన
- పోరాటాల అణచివేత అప్రజాస్వామికం

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం పోలీసు మాన్యువల్‌ను తాజా పర్చాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ప్రజలు, ప్రజా ఉద్యమాల పట్ల ఎలా వ్యవహరించాలో ఆ మాన్యువల్‌లో పొందుపరచాలన్నారు. గురువారం అనకాపల్లిలోని కార్మిక, కర్షక భవన్‌లో సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, కార్యదర్శివర్గ సభ్యులు జి.కోటేశ్వరరావు, మండల కార్యదర్శి గంటా శ్రీరామ్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో అత్యవసర పరిస్థితులను తలపించేలా పోలీసులు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ప్రజా సమస్యలపై మాట్లాడే అవకాశం లేకుండా, సభలు, సమావేశాలు నిర్వహించకుండా విజయవాడలో నిత్యం 144, 30 సెక్షన్లు అమలు చేస్తున్న పోలీసులు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సభలకు మాత్రం వాటిని అనుసరించకపోవడం అన్యాయమన్నారు. పోలీసులపై ఆధారపడి ఉద్యమాలను అణచివేసే ప్రభుత్వాలేవీ నిలువలేదన్నారు. ప్రజలు, ప్రజా ఉద్యమాల గొంతు నొక్కాలని ప్రభుత్వం చూస్తే ప్రభుత్వ గొంతును ఎన్నికల్లో ప్రజలు నొక్కుతారని హెచ్చరించారు.

అంగన్‌వాడీలు, ఉపాధ్యాయుల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు అమానవీయమన్నారు. స్కూళ్లకు వెళ్లి ఉపాధ్యాయులకు నోటీసులు ఇవ్వడం అత్యంత అప్రజాస్వామిక చర్యని అన్నారు. గురువారం విజయవాడలో జరిగే ధర్నాకు వెళ్తున్న ఉపాధ్యాయులకు స్కూల్ పిల్లల ఎదురుగా పోలీసులు నోటీసులివ్వడం మానవ హక్కుల ఉల్లంఘనని, అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలను అర్ధరాత్రి మగ పోలీసులు అరెస్టు చేయడం, సిపిఎం రాష్ట్ర కార్యాలయం గేట్ దగ్గర బాబూరావును అరెస్టు చేయడం పోలీసుల దుర్నీతికి నిదర్శనమన్నారు. నేరాలను అరికట్టాల్సిన పోలీసులు నేరస్తులుగా మారడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని అన్నారు.

డ్వాక్రా గ్రూపుల రుణాలు రద్దు చేయాలి

డ్వాక్రా గ్రూపుల రుణాలన్నింటినీ ప్రభుత్వం రద్దు చేయాలని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఆసరా పేరుతో డ్వాక్రా మహిళలకు ప్రభుత్వం టోకరా పెడుతోందన్నారు. దొడ్డిదారిన వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరించాలన్న ప్రభుత్వ కుట్రలను ఉద్యోగులు, ప్రజలు ప్రతిఘటిస్తున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం మూసేసిన మూడు పరిశ్రమలను కేరళలోని సిపిఎం ప్రభుత్వం నడుపుతున్న విషయాన్ని గుర్తుచేశారు రాబోయే ఎన్నికల్లో కేంద్రంలో బిజెపి ప్రభుత్వాన్ని గద్దెదించడానికి కలిసొచ్చే లౌకికపార్టీలతో సంప్రదిస్తామన్నారు. రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపిని ఓడించాలని, ఆ పార్టీతో అంటకాగుతున్న వైసిపి, టిడిపి, జనసేనలతో కలిసే సమస్యే లేదని స్పష్టం చేశారు.

చంద్రబాబు స్క్రిప్టుతో షర్మిల విమర్శలు :మంత్రి బొత్స సత్యనారాయణ

శ్రీకాకుళం అర్బన్: టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఇచ్చిన స్క్రిప్టుతో పిసిసి అధ్యక్షులు షర్మిల సొంత అన్నపై విమర్శలు చేస్తోందని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బొత్స సత్యనారాయణ విమర్శించారు. నగరంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయాల్లో రాణించాలంటే జగన్మోహన్‌రెడ్డిని విమర్శించడం వల్ల ప్రయోజనం ఉండదన్నారు. జగన్‌పై చేసే విమర్శలను ప్రజలు విశ్వసించరని చెప్పారు. చంద్రబాబు పాలనలో తన సొంత వాళ్ల ప్రయోజనం కోసం ఏం చేశారు, ప్రజలకు ఏం చేశారు... జగన్ పాలనలో ప్రజలకు సంక్షేమ పథకాలతో ఆర్థిక పరిపుష్టి ఎలా కల్పించారో బేరీజు వేసుకోవాలని సూచించారు. ఎవరి పాలనలో ప్రజల జీవన ప్రమాణాలు పెరిగాయో గుర్తించాలన్నారు. ప్రత్యేక హోదాను తాకట్టు పెట్టి ప్రత్యేక ప్యాకేజీ కావాలని సంతకం చేసింది చంద్రబాబు కాదా అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి అంశాల వారీ మద్దతు ఇస్తున్నామని చెప్పారు. ఫెడరల్ వ్యవస్థలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సఖ్యతతో వెళ్లాల్సి ఉంటుందన్నారు. టిడిపి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు విశాఖ ఉక్కు ఉద్యమానికి మద్దతు అంటూ స్వయంగా రాజీనామా లేఖ ఇచ్చారని, దాన్ని ఇప్పుడు స్పీకర్ ఆమోదించారని తెలిపారు. స్పీకర్ ఫార్మాట్‌లో లేఖ రాసిన ఆయన నేరుగా ఆమదాలవలసలో స్పీకర్ సీతారాంను కలిసి రాజీనామా విషయం చెప్పారన్నారు. రాజీనామా ఆమోదంలో రాజకీయాలకు తావులేదన్నారు. లోకేష్ ఖాళీగా ఉండి ట్వీట్లు పెడుతున్నాడని, 70 రోజుల్లో ఎవరు మేకప్, ఎవరు ప్యాకప్ అన్నది తెలుస్తుందన్నారు.

దళితులపై వివక్ష ప్రదర్శిస్తే తగు చర్యలు

- రాష్ట్ర ఎస్‌సి కమిషన్ సభ్యులు ఆనంద్ ప్రకాష్

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

ప్రభుత్వం, రాజ్యాంగం, చట్టం ఆయా వ్యవస్థల నిర్వహణలో దళిత వర్గాలకు ఎక్కడైనా వివక్షకు గురైన వారు కమిషన్ దృష్టికి తీసుకుని వస్తే వాటిపై తగు చర్య తీసుకోవడమే ఎస్‌సి కమిషన్ ముఖ్య ఉద్దేశమని రాష్ట్ర ఎస్‌సి కమిషన్ సభ్యులు చల్లం ఆనంద్ ప్రకాష్ తెలిపారు. గురువారం అమలాపురం మండల అభివృద్ధి కార్యాలయంలో మండలానికి సంబంధించిన ఎస్‌సి సర్పంచులు, ఎంపిపిలు, జెడ్‌పిటిసి సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌సి కమిషన్ సభ్యులు మాట్లాడుతూ కుల వివక్ష లాంటి సంఘటనలు కమిషన్ దృష్టికి వస్తే అలాంటి చోట్ల జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి తగు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం ద్వారా అమలు జరుగుతున్న సంక్షేమ పథకాలు సజావుగా అందుతుంది లేనిదీ కమిషన్ పరిశీలిస్తుందన్నారు. పథకాల అమల్లో ఏమైనా వివక్ష గురి అవుతున్నారా అనే అంశాలను కమిషన్ దృష్టి సారిస్తుందన్నారు. ఇందులో భాగంగా బండారులంక గ్రామ సచివాలయన్ని సందర్శించి అక్కడ సిబ్బందిని సంక్షేమ పథకాలు అమలు జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నానని అన్నారు. వాలంటీర్ ద్వారా అమలు జరుగుతున్న కార్యక్రమాలు పనితీరును అడిగి తెలుసుకున్నానని, గ్రామ సచివాలయ ఉద్యోగులు సంతప్తికరమైన సమాధానం ఇచ్చారని కమిషన్ సభ్యులు తెలిపారు. తిరుపతి, వైజాగ్ లాంటి కేంద్రాల్లో ఎస్‌సి, ఎస్‌టి యువత కోసం స్టడీస్ సర్కిల్ సెంటర్ల ద్వారా సాధారణ పోటీ పరీక్షలతోపాటు ఐఎఎస్ లాంటి ఉన్నత స్థాయి ఉద్యోగాలకు వెళ్లడానికి శిక్షణిస్తారన్నారు.

తెలంగాణ ఎంసెట్ ఇక ఇఎపిసెట్

- ప్రవేశ పరీక్షల తేదీల ఖరారు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్రంలో ఇంజనీరింగ్ సహా వివిధ వృత్తి విద్య, ఇతర కోర్సుల్లో ప్రవేశాల కోసం 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించిన ప్రవేశ పరీక్షల తేదీలను ప్రభుత్వం ఖరారు చేసింది. టిఎస్ ఎంసెట్ 2024-25 విద్యా సంవత్సరం నుంచి టిఎస్ ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ (ఇఎపి) సెట్‌గా ఉంటుందని ప్రకటించింది. మే తొమ్మిది నుంచి 13 వరకు ఎంసెట్ (ఇఎపిసెట్), మే ఆరున ఇసెట్, మే 23 ఎడ్‌సెట్, జూన్ మూడున లాసెట్, అదే నెల నాలుగు, ఐదు తేదీల్లో ఐసెట్, జూన్ ఆరు నుంచి ఎనిమిది వరకు పిజిఇసెట్, జూన్ 10 నుంచి 13 తేదీల్లో బిపిఇడి, డిపిఇడి పరీక్షలు నిర్వహించనున్నారు. గురువారం విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం, ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆర్ లింబాద్రి ఆ వివరాలను విడుదల చేశారు.

దోసపాడులో మళ్లీ ఉద్రిక్తత

- పట్టించుకోని రెవెన్యూ అధికారులు
- ప్రభుత్వ చట్టాలు పేదలకేనా.. భూస్వాములకు వర్తించవా..?
- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.రవి

ప్రజాశక్తి - దెందులూరు (ఏలూరు జిల్లా)

పేదలకు జాయింట్ కలెక్టర్ కోర్టులో ఉన్న భూములను విడగొట్టి, సర్వే చేసి మిగిలిన భూములు అసలైన అసైన్‌దారులకు అప్పగించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి డిమాండ్ చేశారు. ఏలూరు జిల్లా దెందులూరు మండలం దోసపాడు గ్రామంలో చేపల చెరువు వద్ద వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో చెరువులో నీటిని వెళ్లగొట్టి వరినాట్లు వేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రవి మాట్లాడుతూ జిల్లా, మండల రెవెన్యూ అధికారులు పేదలు, దళితుల పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. 144, 145 సెక్షన్లు పేదలకే వర్తిస్తాయా, భూస్వాములకు వర్తించవా అని ప్రశ్నించారు. పేదలు చెరువుల దగ్గరికి వెళ్లిన ప్రతిసారీ రెవెన్యూ అధికారులు రాకుండా పోలీసులను పంపించి భయభ్రాంతులకు గురిచేయడం దుర్మార్గమన్నారు. పేదల పట్ల ప్రభుత్వం, రెవెన్యూ శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తున్న రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భూరికార్డులను తారుమారు చేస్తున్న వారిపై ఇంతవరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. అసలైన అసైన్డ్‌దారులు దోసపాడు పేదలైతే ఈ భూములు దేవినేని భాజీ ప్రసాద్ బినామీలకు ఏవిధంగా చెందుతాయని ప్రశ్నించారు. 30 ఏళ్ల క్రితం పేదలను దేవినేని భాజీ ప్రసాదు, ఆయన బినామీలు బెదిరించి పేదల నుండి భూములను బలవంతంగా లాక్కున్నా ఇంతవరకూ వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. భూస్వామి చేతుల్లో ఉన్న ఈ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని అసలైన అసైన్డ్‌రులకు కట్టబెట్టాలని డిమాండ్ చేశారు. అసలైన అసైన్డ్‌దారులను భూముల్లోకి రాకుండా పోలీసులు అడ్డగించడం సిగ్గుచేటన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ కోర్టులో ఉన్న అసలు భూములు విడదీసి మిగిలిన అసైన్డ్, సీలింగ్ భూములను పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. రెవెన్యూ శాఖ అధికారుల నిర్లక్ష్య వైఖరిని ఖండించారు. ఇప్పటికైనా ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలని, పేదలు, దళితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడుతూ జిల్లాలో రెవెన్యూ అధికారులు అసైన్డ్, సీలింగ్ భూముల వివరాలు బయటపెట్టి జాయింట్ కలెక్టర్ కోర్టులో ఉన్న భూములు మినహా మిగిలిన అసైన్డ్, సీలింగు, గయ్యాల భూములను పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. జాయింట్ కలెక్టర్ జోక్యం చేసుకుని సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో ఈ పోరాటం మరింత ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. దెందులూరు ఎస్ఐ పేదలను అరెస్టు చేయాలని ప్రయత్నించడం సిగ్గు చేయటన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి ఎ.శ్యామలారాణి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు పి.ఆనంద్‌రావు, సిహెచ్.మణి, టి.నాగేంద్ర, భూపోరాట నాయకులు ఏసు మణి, మాణిక్యం, లక్ష్మి, మరియమ్మ, కుమారి, హేమలత పాల్గొన్నారు.

ముషీర్ ఖాన్ సెంచరీ

- ఐర్లాండ్‌పై 201 పరుగుల తేడాతో టీమిండియా గెలుపు
- ఐసిసి అండర్-19 వన్డే ప్రపంచకప్



జొహన్నెస్‌బర్గ్: ఐసిసి అండర్-19 వన్డే ప్రపంచకప్‌లో టీమిండియా వరుసగా రెండో లీగ్ మ్యాచ్‌లోనూ ఘన విజయం సాధించింది. ఐర్లాండ్ అండర్-19 జట్టుతో గురువారం జరిగిన రెండో లీగ్ మ్యాచ్‌లో టీమిండియా ఏకంగా 201 పరుగులు తేడాతో గెలిచింది. తొలుత ముషీర్ ఖాన్(118) సెంచరీకి తోడు కెప్టెన్ ఉదయ్ సహరన్(75) రాణించడంతో భారతజట్టు నిర్ణీత 50 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి 301పరుగుల భారీస్కోర్ చేసింది. ఐర్లాండ్ బౌలర్లు ఓలీవర్‌కు మూడు, జాన్ మెక్‌నల్లీకి రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత భారత బౌలర్లు చెలరేగడంతో ఐర్లాండ్ జట్టు 100 పరుగులకే ఆలౌటైంది. నమన్ తివారికి నాలుగు, సౌమీ పాండేకు మూడు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ ముషీర్ ఖాన్‌కు లభించింది. 28న జరిగే గ్రూప్-ఎ చివరి లీగ్ మ్యాచ్‌లో భారతజట్టు అమెరికాతో తలపడనుంది.

స్కోర్‌బోర్డు..

ఇండియా (అండర్-19) ఇన్నింగ్స్: ఆదర్శ్ సింగ్ (సి)రియాన్ (బి)జాన్ 17, అర్షిన్ కులకర్ణి (సి)ఫోర్కెన్ (బి)జాన్ 32, ముషీర్ ఖాన్ (రనౌట్) స్కాట్/రియాన్ 118, ఉదయ్ సహరన్ (సి)ఫోకిన్ (బి)ఫిన్ 75, అరవెల్లి అవనీశ్ (సి)రియాన్ (బి)ఓలీవర్ 22, సచిన్ ధాస్ (నాటౌట్) 21, ప్రియాన్షు (సి)జాన్ (బి)ఓలీవర్ 2, మురుగన్ అభిషేక్ (సి)ఫిలిప్స్ (బి)ఓలీవర్ 0, అదనం 14. (50 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి) 301పరుగులు.

వికెట్ల పతనం: 1/32, 2/80, 3/236, 4/278, 5/279, 6/301, 7/301

బౌలింగ్: స్కాట్ 10-0-62-0, ఓలీవర్ 10-0-55-3, జాన్ 7.3-0-45-2, కర్సన్ 7-0-35-0, ఫిన్ 7.3-0-61-1, డానియల్ 8-0-41-0

ఐర్లాండ్ (అండర్-19) ఇన్నింగ్స్: జోర్డాన్ (బి)సౌమీ పాండే 11, రియాన్ (సి)ప్రియాన్షు (బి)నమన్ తివారి 13, కియాన్ హిల్టన్ (బి)నమన్ తివారి 9, ఫిలిప్స్ (సి)ఆరవెల్లి అవనిశ్ (బి)నమన్ తివారి 0, స్కాట్ (సి)ముషీర్ ఖాన్ (బి)నమన్ తివారి 2, మెక్‌డారా (స్టంప్) అవనీశ్ (బి)సౌమీ పాండే 3, జాన్ మెక్‌నిల్లి (సి)మురుగన్ అభిషేక్ (బి)దనుష్ గౌడ 0, కర్సన్ (ఎల్‌బి)సౌమీ పాండే 0, ఓలీవర్ (ఎల్‌బి)మురుగన్ అశ్విన్ 15, డానియెల్ ఫోకిన్ (నాటౌట్) 27, ఫిన్ (బి)ఉదయ్ సహరన్ 7, అదనం 13. (29.4ఓవర్లలో ఆలౌట్) 100పరుగులు.

వికెట్ల పతనం: 1/22, 2/31, 3/32, 4/38, 5/41, 6/44, 7/45, 8/45, 9/84, 10/100

బౌలింగ్: నమన్ తివారి 10-0-53-4, ధనుష్ గౌడ 6-1-14-1, సౌమీ పాండే 9-0-21-3, మురుగన్ అభిషేక్ 4-0-10-1, ఉదయ్ సహరన్ 0.4-0-1-1.

డ్వాక్రా పొదుపు రుణం స్వాహా

- ఎస్‌బిఐ సేవాకేంద్రం నిర్వాహకుని చేతివాటం
- రాయదుర్గంలో మహిళల సొమ్ముతో పరారీ

ప్రజాశక్తి-రాయదుర్గం

ఎస్‌బిఐ సేవా కేంద్రం నిర్వాహకుడు పొదుపు మహిళా సంఘం సభ్యుల డబ్బును కాజేసి పరారయ్యాడు. బ్యాంకు అనుబంధ కేంద్రం కావడంతో నిర్వాహకుడిని నమ్మిన మహిళలను అతను నట్టేట ముంచాడు. లక్షలాది రూపాయలతో ఆయన పరారు కావడంతో మహిళలు లబోదిబోమంటున్నారు. రాయదుర్గం పట్టణంలో గురువారం వెలుగు చూసిన ఈ ఘటన తీవ్ర సంచలనం రేపింది. ఇందుకు సంబంధించిన బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... రాయదుర్గం పట్టణంలోని లక్ష్మీ బజార్ రామస్వామి వీధిలో భారతీయ స్టేట్ బ్యాంక్‌కు అనుబంధంగా వినియోగదారుల సేవా కేంద్రం ఉంది. దీనిని పట్టణానికి చెందిన కౌలేష్ అనే వ్యక్తి నిర్వహిస్తున్నాడు. ఖాతాదారులతో వేలిముద్రలు తీసుకోవడం, వారికి డబ్బులు ఇవ్వడం చేస్తుంటాడు. ఇందులో భాగంగా రాయదుర్గం పట్టణం నేసేపేట చౌడమ్మగుడి వీధికి చెందిన పి.మీనాకు కనేకల్ రోడ్‌లోని భారతీయ స్టేట్‌బ్యాంక్‌లో జీరో సేవింగ్స్ అకౌంట్ ఉంది. ఇటీవల ఆమెకు లక్ష రూపాయల డ్వాక్రా పొదుపు రుణం మంజూరు అయ్యింది. ఈ మొత్తం ఆమె ఎస్‌బిఐ ఖాతాలోకి జమ అయ్యింది. తన ఖాతా ఉన్న బ్యాంకులో జనం రద్దీగా ఉండడంతో డబ్బును విత్‌డ్రా చేసుకోవడం కష్టం అయ్యింది. దీంతో ఈనెల 5వ తేదీన కనేకల్ రోడ్డు రామస్వామి వీధిలో ఉన్న స్టేట్ బ్యాంక్ వినియోగదారుల సేవ కేంద్రంకు వెళ్లింది. కేంద్రం నిర్వాహకుడు కౌలేష్ ఆమె నుంచి ఆధార్ వేలిముద్రను నాలుగు సార్లు వేయించుకున్నాడు. అనంతరం సర్వర్ పని చేయడం లేదని, ఒక రోజు తర్వాత రావాలని చెప్పాడు. 6వ తేదీన మహిళ మళ్లీ కేంద్రానికి వెళ్లింది. ఆ రోజు కూడా అతను మరోసారి వేలిముద్ర వేయించుకున్నాడు. అప్పుడు కూడా సర్వర్ పని చేయలేదని చెప్పి ఆమెను అక్కడి నుంచి పంపారు. డబ్బులు అవసరం కావడంతో మీనా ఆమె భర్త ఉమాపతిలు వారి ఖాతా ఉన్న ప్రధాన స్టేట్ బ్యాంకు కార్యాలయానికి వెళ్లారు. అక్కడ వీరి ఖాతాను పరిశీలించిన బ్యాంకు అధికారులు వేలిముద్ర ద్వారా రూ.90వేలు విత్‌డ్రా అయ్యిందని చెప్పారు. దీంతో ఖంగుతిన్న భార్యాభర్తలు ఇద్దరూ స్టేట్‌బ్యాంకు సేవా కేంద్రం వద్దకు వెళ్లారు. అక్కడ ఆ కేంద్రానికి తలుపులు వేసి ఉంది. నిర్వాహకుడు కౌలేష్‌కు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో వారు బ్యాంకు అధికారులను ఆశ్రయించి వారికి జరిగిన అన్యాయాన్ని సిబ్బందికి వివరించారు. బ్యాంకు మేనేజర్ సూచన మేరకు పోలీసులకూ ఫిర్యాదు చేసింది. ఈ ఘటన జరిగి 20 రోజులు అవుతున్నా దీనిపై ఇప్పటి వరకు ఎలాంటి పురోగతీ కన్పించలేదని బాధితులు విలేకరుల వద్ద వాపోయారు.

12 మంది ఖాతాదారుల సొమ్ము స్వాహా

ఈ విషయమై ప్రధాన స్టేట్ బ్యాంక్ మేనేజర్ మృత్యుంజయ మాట్లాడుతూ.. స్టేట్ బ్యాంకు సేవా కేంద్రం నిర్వాహకుడు కౌలేష్ 12 మంది ఖాతాదారుల నుంచి డబ్బులు తీసుకుని మోసం చేసినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ విషయాన్ని ఇప్పటికే బ్యాంకు ఉన్నతాధికారులకు తెలియజేశామన్నారు. కౌలేష్‌కు చెందిన వినియోగదారుల సేవాకేంద్రం సేవలను నిలిపేశామన్నారు. పోలీసులకు కూడా దీనిపై ఫిర్యాదు చేశామని తెలియజేశారు.

గతంలోనూ ఎస్‌బిఐలో ఇలాంటి ఘటన

గతంలో రాయదుర్గం స్టేట్ బ్యాంకులో పనిచేసిన మేనేజర్ ఖాతాదారులకు సంబంధించిన మొత్తాలను తన ఖాతాల్లోకి బదిలీ చేసుకున్న ఘటన తీవ్ర సంచలనం రేపింది. మోసం చేసిన బ్యాంకు మేనేజర్‌పై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా, ఆయన్ను అరెస్టు చేశారు. అది మరువక ముందే మళ్లీ అదే బ్యాంకు పరిధిలో మరో మోసం జరగడం ఖాతాదారులను తీవ్ర విస్మయానికి గురి చేస్తోంది.

కుక్కల దాడిలో దుప్పి మృతి

ప్రజాశక్తి - పాములపాడు

నంద్యాల జిల్లా పాములపాడు మండలం ఎర్రగుడూరు గ్రామం సమీపంలో కుక్కల దాడిలో దుప్పి మృతి చెందింది. గురువారం ఉదయం ఎర్ర గూడూరు గ్రామం దగ్గరలో అడవిలో నుండి దారితప్పి బయటకు వచ్చిన దుప్పిపై కుక్కలు దాడి చేశాయి. ఈ దాడిలో దుప్పి మృతి చెందింది. విషయం తెలిసిన వెలుగోడు ఫారెస్ట్ రేంజర్ ఎంఏ ఖాన్ సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు.



క్వార్టర్స్‌కు కిరణ్ జార్జి

- రెండోరౌండ్‌లో లక్ష్యసేన్, ప్రియాన్షు ఓటమి
- ఇండోనేషియా బ్యాడ్మింటన్ టోర్నీ

జకార్తా: ఇండోనేషియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీలో కిరణ్ జార్జి మినహా.. మిగిలి షట్లర్లందరూ ఇంటిదారి పట్టారు. తొలిరౌండ్‌లో శ్రీకాంత్, ప్రణయ్ రాయ్ పరాజయాన్ని చవిచూడగా.. గురువారం జరిగిన రెండోరౌండ్‌లో లక్ష్యసేన్, ప్రియాన్షు రాజ్‌వత్ ఇంటిదారి పట్టారు. లక్ష్యసేన్ 18-21, 18-21తో 8వ సీడ్, డెన్మార్క్‌కు చెందిన ఆండెర్స్ ఆంటోన్సెన్ చేతిలో వరుససెట్లలో ఓడాడు. ఈ మ్యాచ్ కేవలం 61 నిమిషాల్లోనే ముగిసింది. మరో పోటీలో ప్రియాన్షు రాజ్‌వత్ 18-21, 14-21తో బ్రియాన్ యంగ్(కెనడా) చేతిలో ఓడాడు. ఇక కిరణ్ జార్జి 21-11, 13-21, 21-18తో లూ గాంగ్-ఝూ(చైనా)ను చిత్తుచేసి క్వార్టర్‌ఫైనల్లోకి ప్రవేశించాడు. శుక్రవారం జరిగే క్వార్టర్స్‌లో కిరణ్ 9వ ర్యాంకర్ విదిట్‌శరణ్(థాయ్‌లాండ్)తో తలపడనున్నాడు.

వన్డే క్రికెటర్ ఆఫ్ ది ఇయర్‌గా కోహ్లికి ఐసిసి అవార్డు

- అత్యధిక అవార్డులు అందుకున్న తొలి ఆటగానికి రికార్డు



దుబాయ్: 2023 సంవత్సరానికిగాను ఐసిసి వన్డే క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ అవార్డుకు టీమిండియా బ్యాటర్ విరాట్ కోహ్లీ ఎంపికయ్యాడు. 2012, 2017, 2018లోనూ ఈ అవార్డులను అందుకున్న కోహ్లి.. నాలుగుసార్లు వన్డే ప్లేయర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు అందుకున్న తొలిగా ఆటగాడిగా రికార్డు నెలకొల్పాడు. అలాగే కోహ్లీ కెరీర్‌లో ఐసిసి అవార్డుల సంఖ్య 10కి చేరింది. ఈ క్రమంలోనే పది ఐసిసి అవార్డులు అందుకున్న తొలి ఆటగాడిగా ఘనత సాధించాడు. ఈ జాబితాలో మరే ఆటగాడు కనీసం ఐదు అవార్డులు కూడా అందుకోలేదు. కుమార సంగక్కర (శ్రీలంక, 4అవార్డులు), ఎంఎస్ ధోనీ (భారత్, 4అవార్డులు) అందుకున్నారు. గతేడాది కోహ్లీ అద్భుతంగా ఆడాడు. 24 ఇన్నింగ్స్‌ల్లో 72.47 సగటుతో 1377 పరుగులు చేశాడు. వన్డే ప్రపంచకప్‌లో 765 పరుగులు చేసి టోర్నీలో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఇక ఆస్ట్రేలియా కెప్టెన్ పాట్ కమిన్స్ ఐసిసి క్రికెటర్ ఆఫ్ ది ఇయర్‌గా నిలిచాడు. అతడి సారథ్యంలో ఆస్ట్రేలియా గతేడాది డబ్ల్యుటిసి ఛాంపియన్‌షిప్, వన్డే ప్రపంచకప్‌లను సాధించింది. అలాగే ఆసీస్ బ్యాటర్ ఉస్మాన్ ఖవాజా టెస్టు క్రికెటర్ ఆఫ్ ది ఇయర్‌కు ఎంపికయ్యాడు. 2023లో అతడు 13 టెస్టుల్లో 1210 పరుగులు చేశాడు. ఇంగ్లండ్‌కు చెందిన రిచర్డ్ ఇల్లింగ్‌వర్త్ అంపైర్ ఆఫ్ ది ఇయర్ అవార్డును అందుకోనున్నాడు.

చిరంజీవికి పద్మవిభూషణ్

(మొదటి పేజీ తరువాయి)

దేవస్థానంలో నాదస్వర విద్వాంసులు, తల్లి సరోజని గాయని. తెలంగాణ నారాయణపేట జిల్లా దామరగిద్దకు చెందిన బుర్రవీణా వాయిద్యకారుడు దాసరి కొండప్ప, ఆ రాష్ట్రానికే చెందిన యక్షగాన కళాకారుడు గడ్డం సమ్మయకు కూడా పద్మశ్రీ అవార్డు దక్కింది. భారతదేశపు మొట్టమొదటి మహిళా మావటి పార్వతి బారువా (అస్సాం), గుజరాత్ గిరిజనుల్లో సికిల్‌సెల్ ఎనీమియా నివారణకు జీవితాన్ని అంకితం చేసిన డాక్టర్ యజ్దీ మాణెక్‌షా ఇటాలియా, గిరిజనుల అభివృద్ధికోసం ఛత్తీస్‌గడ్‌లో కృషి చేసిన జగేశ్వర్ యాదవ్, కళల విభాగంలో బీహార్‌కు చెందిన భార్యాభర్తలు శాంతిదేవి, శివన్‌పాశ్వన్, త్రిపురకు చెందిన చక్మారేఖ తదితరులకు పద్మశ్రీ దక్కింది. క్రీడలలో మహారాష్ట్రకు చెందిన ఉదయ్ విశ్వనాద్ దేశపాండేకు పద్మశ్రీ ప్రకటించారు. మిథున్‌చక్రవర్తి, ఉషాఉతప్‌లకు కళా రంగంలో పద్మభూషణ్ దక్కింది.



చంచల్‌గూడ జైలులో షూటింగ్

అక్కినేని నాగార్జున నటిస్తున్న తాజా చిత్రం షూటింగ్ హైదరాబాద్‌లోని చంచల్‌గూడజైలులో కొనసాగుతోంది. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో ధనుష్ కూడా మరో ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. జైలు వద్ద రెండురోజులుగా షూటింగ్ కొనసాగుతోంది. మరో రెండురోజులు చిత్రీకరణలు జరగనున్నాయి. లైఫ్ ఈజ్ బ్యూటీఫుల్ సినిమాలో అక్కినేని అమల నటించారు. అప్పట్లోనే తనతో సినిమా చేయాలని నాగార్జున కోరగా శేఖర్ కమ్ముల ఇప్పుడు కార్యరూపం దాల్చింది. ఈ సినిమాకు సునీల్, పుష్కర్ రామ్‌మోహనరావు నిర్మాతలు.

ఆర్మీ కమాండర్‌ను కలిసిన వరుణ్



హీరో వరుణ్‌తేజ్ 'ఆపరేషన్ వాలంటైన్' సినిమాను చేస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమాలో ఎయిర్ ఫోర్స్ వింగ్ కమాండర్ పాత్రలో నటిస్తున్నాడు. హీరోయిన్ మానుషీ చిల్లర్ కూడా అదే పాత్రలో నటిస్తున్నారు. కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న ఎయిర్స్ ఫోర్స్ వింగ్ కమాండర్ మైనేని శ్రీనాథ్‌తో గురువారం వరుణ్ తేజ్ భేటీ అయ్యారు. ఈ సినిమా ఫిబ్రవరి 16న విడుదల కానుంది. బాలీవుడ్ డైరెక్టర్ శక్తి ప్రతాప్‌సింగ్ హడ్డా ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. మిక్కిజే మేయర్ సంగీతాన్ని అందిస్తున్నారు.

'ఊరు పేరు భైరవకోన' వెనక్కి వెళ్లిందా?



సంక్రాంతి బరి నుంచి తప్పుకున్న రవితేజ 'ఈగల్' చిత్రానికి సోలో రిలీజ్ ఇస్తామని ఫిలిం ఛాంబర్ హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. దీంతో ఫిబ్రవరి 9న రిలీజ్ డేట్ ప్రకటించింది 'ఈగల్' టీమ్. అయితే అదే రోజు 'టిల్లు స్క్వేర్', 'ఊరు పేరు భైరవకోన' సినిమాలు కూడా విడుదల తేదీలు ప్రకటించాయి. దీనిపై ఫిలిం ఛాంబర్‌తో చర్చలు జరిపిన 'టిల్లు స్క్వేర్' టీమ్ వాయిదా వేసినట్టు ఇప్పటికే ప్రకటించారు. తాజా సమాచారం ప్రకారం 'ఊరు పేరు భైరవకోన' కూడా వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది. ఫిలిం ఛాంబర్‌తో జరిగిన చర్చల్లో చిత్రబృందం తమ వైఖరిని స్పష్టం చేసినట్లు వార్తలు వస్తున్నాయి. వెనక్కి వెళ్లాల్సి వస్తే ఖచ్చితంగా తమకు సోలో రిలీజ్ కావాల్సిందేనని చిత్రబృందం పేర్కొన్నట్లు సమాచారం. అప్పుడే రిలీజ్ వాయిదా వేసుకోవడానికి ఎలాంటి ఇబ్బంది లేదని చెప్పినట్లు తెలుస్తోంది.

బిల్లులు..వచ్చేలా లేవు..!

- చేసిన పనులకు చెల్లింపులు చేయండి మహాప్రభో..!
- ఎన్నికల్లో గట్టెక్కుతామని వేడుకోలు
- అధికారులు, ప్రభుత్వ పెద్దల చుట్టూ ప్రదక్షిణలు
- ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డికి మొర

ప్రజాశక్తి - అనంతపురం ప్రతినిధి

'ఎన్నికలొచ్చాయి.. బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి... ఇస్తే ఎన్నికల సమయంలో ఖర్చులకైనా వస్తాయి... బిల్లులు చెల్లించండి మహాప్రభో'.. అంటూ ముఖ్య ప్రజాప్రతినిధులే ఫైళ్లు పట్టుకుని ప్రభుత్వ పెద్దల చుట్టూ తిరుగుతున్నారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అనంతపురం జిల్లా పర్యటన వచ్చిన సందర్భంగానూ కొంతమంది ఎమ్మెల్యేలు బిల్లులివ్వమని అడగటం గమనార్హం. ఇప్పుడు రాకపోతే ఎన్నికల అనంతరం పరిస్థితి ఏ రకంగా ఉంటుందోనన్న గుబులు పనులు చేసిన నాయకుల్లో నెలకొంది. వైసిపి అధికారంలోకి వచ్చాక చాలా కాలం పనులు ముందుకు నడవలేదు. ప్రధానంగా 2019 ఎన్నికలకు ముందు తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పనులు చేశారు. అయితే 2019 ఎన్నికల అనంతరం టిడిపి కాంట్రాక్టర్లు చేసిన పనులకు బిల్లులను నిలిపివేసి ఉన్నారు. ఇప్పటికీ వారి బిల్లులు పెండింగ్‌లోనే ఉన్నాయి. ఆ తరువాత వైసిపి ప్రభుత్వ హయాంలో రహదారులు, సచివాలయాలు, విలేజ్ క్లీనిక్‌లను, రైతు భరోసా కేంద్రాలు ఇలా వివిధ రకాల పనులను వైసిపి నాయకులు, కార్యకర్తలు చేశారు. రహదారులు వంటి పెద్ద పనులైతే నేరుగా ప్రజాప్రతినిధులే చేశారు. వీటి బిల్లులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. ఒకటి, రెండు నెలల్లో సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ కూడా రానుంది. నోటిఫికేషన్ వచ్చాక బిల్లులు చెల్లింపులు దాదాపుగా నిలిచిపోతాయి. ఆ తరవాత ప్రభుత్వంలో ఏదైనా మార్పులు, చేర్పులు జరిగితే బిల్లుల పరిస్థితి ఏమిటన్న గుబులు ఇప్పుడు వైసిపి నేతల్లో నెలకొంది. దీంతో పనులు చేసిన కాంట్రాక్టర్లు ఎమ్మెల్యేలపైనా ఒత్తిడి పెంచుతున్నారు. వెంటనే బిల్లులు మంజూరు చేయించాలని కోరుతున్నారు. దీంతో ఎమ్మెల్యేలే నేరుగా రంగంలోకి దిగుతున్నారు. బిల్లులు చెల్లించాలని అధికారులతోపాటు మంత్రులు, ఇతర ముఖ్య నేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పుట్టపర్తికి విచ్చేసిన సందర్భంగానూ ఇద్దరు ప్రజాప్రతినిధులు కలసి రూ.ఎనిమిది కోట్లు, రూ.50కోట్ల బిల్లులు చెల్లించాలని విజ్ఞప్తి చేసినట్టు సమాచారం. అదే విధంగా మరో ఎమ్మెల్యే తాను కాంట్రాక్టు చేస్తున్న ఇళ్ల నిర్మాణాలకు సంబంధించిన బిల్లుల కోసం తిరుగుతూనే ఉన్నారు. టిక్కెట్టు దక్కని మరో ప్రజాప్రతినిధికి సంబంధించి కూడా బిల్లులు పెద్దఎత్తునే పెండింగ్‌లో ఉన్నట్టు సమాచారం. మొత్తంగా వైసిపి నాయకులు, కార్యకర్తల్లో బిల్లుల గుబులు నెలకొంది. కోట్లు ఖర్చు పెట్టాం. ఇప్పుడు ఆ బిల్లులు రాకపోతే తరువాత పరిస్థితి ఏమిటన్న గుబులు వారిలో కనిపిస్తోంది. ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాలుగు డబ్బులు వెనకేసుకుందామంటే ఈ రకంగా బుక్ అవుతున్నామోనని భయడుతున్నారు. వీరి గుబులు చూసి ఎమ్మెల్యేల్లోనూ ఆందోళన నెలకొంది. కార్యకర్తలు తమను నమ్మి పనులు చేశారు. ఇప్పుడు రాకుండాపోతే వారు పూర్తిస్థాయిలో నష్టపోతే తరువాత వారిచేత ఎన్నికల్లో ఏ రకంగా పని చేయించుకోగలమని దిగులు చెందుతున్నారు.



ఇళయరాజా కుమార్తె భవతారిణి మృతి

చెన్నై : ప్రముఖ సంగీత దర్శకులు ఇళయరాజా ఇంట తీవ్ర విషాదం నెలకొంది. ఆయన కుమార్తె భవతారణి తుదిశ్వాస విడిచారు. కొంతకాలంగా క్యాన్సర్‌తో బాధపడుతున్న ఆమె శ్రీలంకలో ఆయుర్వేద చికిత్స తీసుకుంటున్నారని, అక్కడే ప్రాణాలు విడిచారు. ఇళయరాజా కుమారులు యువన్ శంకర్‌రాజా, కార్తిక్ రాజాలాగే భవతారణి కూడా తండ్రి వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్నారు. మ్యూజిక్ డైరెక్టర్‌గా, సింగర్‌గా తనదైన ముద్ర వేశారు.

తెలుగులో ఆమె ఆలపించిన 'నను నీతో నిను నాతో కలిపింది గోదారి' (గుండెల్లో గోదారి) విశేషంగా అలరించింది. 'ఫ్రెండ్స్', 'పా', 'టైమ్', 'ఒరు నాళ్ ఒరు కనవు', 'అనెగన్' తదితర చిత్రాల్లో పలు పాటలు పాడారు. 'ఫిర్ మిలేంగే', 'ఇలక్కనమ్', 'వెల్లాచి', 'అవునా' తదితర సినిమాలకు సంగీత దర్శకురాలిగా వ్యవహరించారు. 'భారతి' చిత్రంలోని 'మయిల్ పోలా పొన్ను ఒన్ను' పాటకుగాను బెస్ట్ ఫిమేల్ ప్లేబ్యాక్ సింగర్‌గా జాతీయ అవార్డును ఆమె అందుకున్నారు.

బడేమియా ఛోటే మియా టీజర్ విడుదల



బాలీవుడ్ నటులు అక్షయ్‌కుమార్, ట్రాఫ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'బడేమియా ఛోటేమియా'. అలీ అబ్బాస్ జాఫర్ దర్శకత్వం వహిస్తున్నారు. గురువారంనాడు చిత్ర ప్రతినిధి బృందం ఈ సినిమా టీజర్‌ను విడుదలచేశారు. పృథ్వీరాజ్ సుకుమారన్ వాయిస్ ఓవర్‌తో టీజర్ మొదలైంది. 'ప్రళయం రాబోతోంది...ఆ మహాప్రళయం భూత, వర్తమాన, భవిష్యత్తు కాలాలను మార్చేస్తుంది..ఆ మహా ప్రళయం మంచి చెడుల మధ్య జరిగే సంఘర్షణలను శాశ్వతంగా నిర్మూలిస్తుంది. హిందూస్థాన్ నాశనమైపోతుంది. మమ్మల్నెవరు ఆపుతారు?' అనే డైలాగ్ వినిపిస్తుంది. సరిగ్గా అప్పుడే ఇద్దరు హీరోలు ధైర్యంగా ముందుకు సాగుతారు. 'సైనికుడి వీరత్వం, సైతాన్ క్రూరత్వం మా సొంతం. మాతో పెట్టుకోకండి..మేం భారతీయులం' అనే డైలాగ్ వస్తుంది. మానుషి చిల్లర్, సోనాక్షి సిన్హా హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఏప్రిల్‌లో ఈ సినిమా విడుదల చేస్తామని చిత్రబృందం ప్రకటించింది.

కెనడా ఎన్నికల్లో భారత్ జోక్యం

తెరపైకి కొత్త వివాదం

ఒట్టావా: భారత్-కెనడాల మధ్య నిజ్జర్ హత్య విషయంలో ఇప్పటికే దౌత్యపరమైన విభేదాలు కొనసాగుతున్న వేళ.. తెరపైకి మరో కొత్త వివాదం వచ్చింది. కెనడా ఎన్నికల్లో విదేశీ జోక్యంపై జరుగుతోన్న దర్యాప్తులో భారత్ పేరునూ ఆ దేశ ప్రభుత్వం చేర్చింది. కెనడా ఎన్నికలను ప్రభావితం చేసేందుకు చైనా యత్నించిందంటూ వెలువడిన కథనాల నేపథ్యంలో వాటిపై విచారణ నిమిత్తం ట్రూడో ప్రభుత్వం గత సెప్టెంబర్‌లో ఒక స్వతంత్ర కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఇప్పుడు భారత్ పేరును ఆ దర్యాప్తులో చేర్చారు.

నాకు హిందీ అర్థం కాదు

- క్రిమినల్ చట్టాలను వాటి అసలు పేర్లతోనే పిలుస్తా
- మద్రాసు హైకోర్టు జడ్జి

చెన్నై : పేర్లు మారిన క్రిమినల్ చట్టాలపై మద్రాసు హైకోర్టు జడ్జి జస్టిస్ ఆనంద్ వెంకటేశ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తనకు హిందీ అర్థం కాదనీ, పాత క్రిమినల్ చట్టాల స్థానంలో కొత్త చట్టాలు వచ్చినప్పటికీ.. తాను మాత్రం వాటిని పాత పేర్లతోనే పిలుస్తానని అన్నారు. కోర్టులో ఒక కేసు విచారణ సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. గతేడాది డిసెంబర్‌లో కేంద్రం పాత క్రిమినల్ చట్టాల స్థానంలో కొత్త చట్టాలను తీసుకొచ్చిన విషయం విదితమే. ఇందులో భాగంగా ఐపీసీ స్థానంలో భారతీయ న్యాయ సంహిత, సీఆర్‌పీసీ స్థానంలో భారతీయ సాక్ష్య సంహిత, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ స్థానంలో భారతీయ నాగరిక్ సురక్ష సంహితలు వచ్చి చేరాయి. గతేడాది డిసెంబర్ 25న భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కొత్త బిల్లులకు ఆమోదం తెలపటంతో అవి చట్టాలుగా మారాయి. అయితే, ఈ కొత్త చట్టాలు ఎప్పటి నుంచి అమలులోకి వస్తాయన్న విషయంపై మాత్రం కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఇప్పటికీ స్పష్టం చేయకపోవటం గమనార్హం.

ఇడి దుర్వినియోగం పరిశీలనకు
ప్రత్యేక యంత్రాంగం అవసరం

- సుప్రీంకోర్టు వ్యాఖ్యలు



న్యూఢిల్లీ : ప్రతిపక్ష పార్టీల పాలనలోని రాష్ట్రాల్లో పెత్తనం చలాయించేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి)ని దుర్వినియోగం చేస్తోందన్న విమర్శల నేపథ్యంలో సుప్రీంకోర్టు గురువారం నాడు కీలక వ్యాఖ్యలు చేసింది. ప్రతిపక్షాల నేతలపై కేంద్ర ప్రభుత్వం ఇడిని ఉసిగొల్పి తన రాజకీయ ప్రయోజనాలకు దుర్వినియోగం చేస్తుంటే మరోవైపు రాష్ట్రాల్లోని ప్రభుత్వాలు స్థానికంగా ఉండే ఇడి అధికారులపై ప్రతి చర్యలు చేపడుతున్నాయన్న విమర్శల నేపథ్యంలో అసలు దుర్వినియోగ, కక్ష సాధింపు చర్యల పరిశీలన కోసం ప్రత్యేక యంత్రాంగం ఏర్పాటు చేయాల్సిన అవసరముందని సుప్రీంకోర్టు ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఇటువంటి యంత్రాంగాన్ని అమలు చేసేందుకు తమిళనాడును ఒక ప్రయోగ వేదికగా చేయాలని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కెవి విశ్వనాథన్‌లతో కూడిన బెంచ్ పేర్కొంది. ఇలా రాష్ట్రాలు, కేంద్ర దర్యాప్తు సంస్థలు పరస్పరం కేసులు పెట్టుకోవడం ద్వారా ఆధిక్యత నిరూపించుకునేందుకు ప్రతీకార ఆటలాడుతున్నట్లైతే దేశ భవితవ్యం ఏమిటని బెంచ్ ఆందోళన వ్యక్తం చేసింది.

'ఇడి, సిబిఐలకు దేశవ్యాప్తంగా శాఖలు వున్నాయి. ప్రతి రాష్ట్రంలోనూ వారికి అధికారులు వున్నారు. మీరు కక్ష సాధింపుతో వ్యవహరిస్తున్నారు, లేదా వారు ప్రతీకార వాంఛతో వున్నారని మేం చెప్పడం లేదు. కానీ, ప్రస్తుత పరిస్థితుల్లో, వారి వైపు నుండి కక్ష సాధింపు చర్య వుంటే, దానికి బదులుగా మీ వైపు నుండి ప్రతీకార చర్య వుంటే, ఇది ఇలాగే కొనసాగితే, మన ఫెడరల్ వ్యవస్థకు ఏమవుతుంది? మన దేశానికి ఏం జరుగుతుంది? " అని జస్టిస్ విశ్వనాథన్ ప్రశ్నించారు.

ఇడి దాఖలు చేసిన పిటిషన్‌పై కోర్టు విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు వెలువడ్డాయి. మంత్రులు, అధికారులపై వచ్చిన ఫిర్యాదులు, ఎఫ్‌ఐఆర్‌లకు సంబంధించిన దర్యాప్తు వివరాలను తమిళనాడు పంచుకోవడం లేదంటూ ఇడి తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదించడంతో బెంచ్ పై వ్యాఖ్యలు చేసింది. దీనిపై సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్, తమిళనాడు అదనపు అడ్వకేట్ జనరల్ అమిత్ ఆనంద్ తివారిలు స్పందిస్తూ, కేంద్రం, ఇడిని ఉపయోగించి బిజెపియేతర పాలిత రాష్ట్రాలను లక్ష్యంగా చేసుకుంటోందని విమర్శించారు. ఇలా రాజకీయ కక్ష సాధింపు చర్యలతో ఫెడరల్ వ్యవస్థ స్తంభిస్తోందని అన్నారు.

అంతర్రాష్ట్ర పర్యవసానాలను పరిశీలించేందుకు సక్రమ, పారదర్శకమైన యంత్రాంగాన్ని ఒకదాన్ని మనం అన్వేషించాల్సి వుందని జస్టిస్ విశ్వనాథన్ వ్యాఖ్యానించారు. ముఖ్యంగా కేంద్రంలో, రాష్ట్రంలో వేర్వేరు పార్టీలు అధికారంలో వున్నపుడు, కక్ష సాధింపు చర్యలను నివారిస్తూనే దోషులను శిక్షించే లక్ష్యం దెబ్బ తినకుండా వుండేలా ఈ యంత్రాంగం వుండాలని ఆయన అభిప్రాయపడ్డారు. ఇడి దాఖలు చేసిన నిజమైన, నిజాయితీ కలిగిన కేసుల్లో నిందితుడు ఇలా రాజకీయ కక్ష సాధింపు ఆరోపణలు, గగ్గోలుతో తప్పించుకోవడానికి వీల్లేకుండా ఈ యంత్రాంగం చూడాలని కోర్టు పేర్కొంది.



గవర్నర్ ఆరిఫ్‌కు స్పీకర్‌తో కలసి స్వాగతం చెబుతున్న పినరయి విజయన్

సభాసంప్రదాయాలకు తిలోదకాలు

- బడ్జెట్ సమావేశాల్లో 75 సెకన్ల ప్రసంగం
- నాలుగు నిమిషాల్లో సభ నుంచి నిష్క్రమణ
- కేరళ గవర్నరు ఆరిఫ్ తీరుపై సర్వత్రా విమర్శలు

తిరువనంతపురం : కేరళ గవర్నరు ఆరిఫ్ మహ్మద్ ఖాన్ తీరుమారు మారోమారు వివాదస్పదమైంది. చట్టసభల ఔన్నత్యాన్ని పరిరక్షించి రాజ్యంగ ధర్మకర్తగా సభా సంప్రదాయాలను పాటించాల్సిన ఆయన అందుకు విరుద్ధంగా వ్యవహరించడం పరిపాటిగా మారిపోయింది. గురువారం రాష్ట్రంలో బడ్జెట్ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గవర్నరు ఆరిఫ్ మహ్మద్ ఖాన్ తన ప్రసంగాన్ని 75 సెకన్లలోనే ముగించారు. అది కూడా ప్రభుత్వ విధానాన్ని తెలియజేసే ప్రసంగ పాఠంలోని ప్రారంభ వాక్యాలను, చివరి పేరాగ్రాఫ్‌ను మాత్రమే చదివి మమ అనిపించారు. ఉదయం 9 గంటలకు అసెంబ్లీకి చేరుకున్న గవర్నరు ఆరిఫ్ ఖాన్‌కు ముఖ్యమంత్రి పినరయి విజయన్, స్పీకరు స్వాగతం పలికారు. అనంతరం సభలో ప్రసంగాన్ని మొదలుపెట్టిన ఆయన.. నేరుగా చివరి పేరా చదివేసి అంతటితో ప్రసంగాన్ని ముగించారు. లెఫ్ట్‌ఫ్రంట్ ప్రభుత్వం రూపొందించిన 62 పేజీల ప్రసంగాన్ని చదివేందుకు ఆయన ఇష్టపడలేదు. 9:02 గంటల్లోపు ప్రసంగం ముగించిన ఆయన.. ఉదయం 9:04 గంటలకు సభ నుంచి వెళ్లిపోయారు. కనీసం ముఖ్యమంత్రి పినరయి విజయన్‌తో కరచాలనం కూడా చేయకుండానే సభ నుంచి నిష్క్రమించారు. ప్రతిపక్షాల పాలిత రాష్ట్రాల్లో పెత్తనం చెలాయించడానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం గవర్నర్ల వ్యవస్థను దుర్వినియోగం చేస్తోందన్న విమర్శలు ఇప్పటికే ఉన్న సంగతి విదితమే. ప్రత్యేకించి కేరళ, తమిళనాడు, పశ్చిబెంగాల్ రాష్ట్రాల్లో గవర్నర్లు కేంద్రానికి కీలుబొమ్మలుగా మారారన్న విమర్శలున్నాయి. ఈ క్రమంలోనే తమిళనాడు, కేరళ అసెంబ్లీల్లో ఆమోదించిన బిల్లులపై ఎటూ తేల్చకుండా గవర్నరు కార్యాలయంలోనే తొక్కిపెడుతున్న వైనాన్ని చూశాం. దీనిపై ఆయా రాష్ట్రాలు న్యాయస్థానాలను ఆశ్రయించిన సందర్భాల్లో గవర్నర్లు న్యాయస్థానాల చీవాట్లు కూడా ఎదుర్కొన్నారు. ఆరిఫ్ లాంటి వ్యక్తులు రాజ్యాంగ పదవుల ప్రతిష్టతను ఇలాంటి చర్యలతో దిగజార్చుతున్నారని సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రజానీకాన్ని అవమానించడమే !

కేరళ అసెంబ్లీలో ఆరిఫ్ ప్రవర్తించిన తీరు రాష్ట్ర ప్రజానీకాన్ని అవమానించడమేనని పలువురు రాజకీయ విశ్లేషకులు విమర్శిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ అధినేతగా ప్రభుత్వ విధానాన్ని వివరించే బాధ్యత గవర్నర్‌దే. రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించిన ప్రసంగంతో వ్యక్తిగతంగా తనకు అభిప్రాయ బేధాలున్నా..నచ్చినా నచ్చకపోయినా కచ్చితంగా ఆ ప్రసంగ పాఠాన్నే గవర్నరు చదివితీరాలి. ఒకవేళ గవర్నరు చదివినా..చదవకపోయినా ఆ పత్రం చెల్లుబాటుపై ఎటువంటి ప్రభావమూ ఉండదు. కాకపోతే చదవడం గవర్నరు రాజ్యాంగ బాధ్యత. కేంద్ర పెద్దల మెప్పు పొందేందుకే ఆరిఫ్ ఇలా వ్యవహరించినట్లు కనిపిస్తోందని రాజకీయ విశ్లేషకులు విమర్శించారు.

రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలి

- పినరయి విజయన్

తిరువనంతపురం : భారతదేశ రాజ్యాంగ పునాదిని ధ్వంసం చేసేందుకు జరుగుతున్న యత్నాలను తిప్పికొట్టాలని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ పిలుపునిచ్చారు. దేశం నేడు 75వ గణతంత్ర దినోత్సవాన్ని జరుపుకుంటున్న సందర్భంగా ఆయన 'వీక్లీ థాట్' పత్రికకు ఆయన ఒక వ్యాసం రాశారు. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా సాగిన జాతీయోద్యమంలో భారతదేశంలోని అన్ని వర్గాల ప్రజల భాగస్వామ్యం ఉంది. వివిధ కులాలు, మతాలు, ప్రాంతాలు, భాషలు, సంస్కృతులకు చెందినవారంతా స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు భిన్నత్వంలో ఏకత్వం అనే భావన దీని నుండే ఉద్భవించిందని ఆయన ఆ వ్యాసంలో పేర్కొన్నారు.. లౌకికవాదం, ప్రజాస్వామ్యం, సోషలిజం ఆలంబనగా గణతంత్ర భారత్ అవతరించింది. భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు, సమాఖ్య వ్యవస్థ జాతీయ విముక్తి ఉద్యమం అందించిన విలువలకు అది పట్టం గట్టింది. భారత రాజ్యాంగం జాతీయ స్వాతంత్ర్య సంగ్రామం విలువలను గ్రహించి, ప్రాథమిక హక్కులు, పౌర స్వేచ్ఛ, ఆర్థిక సమానత్వాన్ని సాధించడమే లక్ష్యంగా నిర్దేశించింది. అయితే, నేడు వివిధ స్థాయిల్లో రాజ్యాంగ పునాదులను ధ్వంసం చేసేలా కొన్ని చొరబాట్లు జరుగుతున్నాయి. రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను సైతం కాలరాస్తున్నారు. ఆర్థిక వ్యవస్థకు మూల స్తంభాలుగా ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేస్తున్నారని ఆయన విమర్శించారు.

దేశంలోని ప్రజాస్వామ్యం, లౌకికవాదం, బహుళత్వ విలువలను, సమాఖ్య వ్యవస్థను దెబ్బతీసేందుకు నిరంతరం దాడులు జరుగుతున్న తరుణంలో 75వ గణతంత్ర దినోత్సవంలోకి భారత్ అడుగిడుతోందని ఆయన పేర్కొన్నారు. సంఘ్ పరివార్ విద్వేష, విభజన రాజకీయాలను వ్యాప్తి చేస్తూ తమ రాజకీయ ఎజెండాను దేశంపై రుద్దుతోంది. మత ప్రాతిపదికన పౌరసత్వాన్ని నిరాకరించాలని చూస్తోంది. దేశంలోని సమాఖ్య విలువలను నీరుగార్చడం ద్వారా రాష్ట్రాల అధికారాలను హైజాక్ చేసే క్రమబద్ధమైన ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయి. రాష్ట్రాలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను సైతం కాలరాస్తున్నారు. ఈ దాడులు చాలావరకు బిజెపి యేతర పార్టీల పాలిత రాష్ట్రాలపైనే జరుగుతున్నాయని విజయన్ పేర్కొన్నారు.

'ఒక దేశం, ఒకే ఎన్నిక' అనే నినాదాన్ని ఈ కోణంలోనే చూడాలి. సమాఖ్య వ్యవస్థను నిర్వీర్యం చేసి కేంద్రానికి సర్వాధికారాలు కల్పించడమే 'ఒకే దేశం, ఒకే ఎన్నిక' అసలు ఉద్దేశం. తమకు అనుకూలంగా లేని రాష్ట్ర ప్రభుత్వాలను అస్థిరపరిచి షార్ట్‌కట్ ద్వారా రాష్ట్ర పరిపాలనను చేజిక్కించుకునే ఎత్తుగడ ఇది.

వివిధ దశల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో పార్టీ స్థానాల ద్వారా రాజ్యసభలో ప్రాతినిధ్యం నిరంతరం పునరుద్ధరించబడుతుంది. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలను ఒకేసారి నిర్వహించడం ద్వారా రాజ్యసభలో రాజకీయ వైవిధ్యం లేకుండా పోతుందని ఆయన ఆ వ్యాసంలో పేర్కొన్నారు. ప్రజాస్వామ్య దేశంగా భారతదేశ అస్తిత్వాన్ని ప్రశ్నార్థకం చేసే ఇలాంటి జోక్యాలను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని ఆయన కోరారు.

లోక్‌సభ ఎన్నికలకు ముందు మళ్లీ పౌరసత్వ సవరణ అంశాన్ని ముందుకు తేవాలని సంఘ్ పరివార్ చూస్తోంది. పౌరసత్వ సవరణ చట్టం కింద దరఖాస్తుల స్వీకరణ కోసం ఆన్‌లైన్ పోర్టల్‌ను ఏర్పాటు చేయడానికి పావులు కదుపుతోంది. పౌరసత్వ సవరణ నిబంధనలను రూపొందించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇందుకు సంబంధించిన తుది ముసాయిదా మార్చి 30, 2024 నాటికి పూర్తవుతుందని కేంద్ర మంత్రులు చెబుతున్నారు.

పౌరసత్వ సవరణ చట్టాన్ని సంఘ్ పరివార్ హిందూత్వ మతపరమైన ఎజెండాలో భాగంగా చూడాలి. డిసెంబర్ 31, 2014 లేదా అంతకు ముందు పాకిస్తాన్, బంగ్లాదేశ్ , ఆఫ్ఘనిస్తాన్ నుండి భారతదేశానికి వలస వచ్చిన ముస్లిమేతరులకు భారత పౌరసత్వాన్ని మంజూరు చేసే చట్టం, ముస్లింలకు మాత్రం నిరాకరిస్తోంది. ఇది రాజ్యాంగ విరుద్ధం. ఈ స్థితిలో రాజ్యాంగంలోని లౌకిక, సమాఖ్య లక్షణాన్ని దెబ్బతీసే ప్రయత్నాలను తిప్పికొట్టాల్సిన అవసరమెంతైనా ఉందని పినరయి విజయన్ పేర్కొన్నారు.

రాహుల్ గాంధీపై కేసు సిఐడికి బదిలీ

గౌహతి : భారత్ జోడో న్యాయ్ యాత్రలో భాగంగా అసోంలో కాంగ్రెస్ అగ్ర నాయకులు రాహుల్ గాంధీపై నమోదైన క్రిమినల్ కేసును పోలీసులు సిఐడికి బదిలీ చేశారు. ఈ నెల 23న గౌహతిలో భారత్ జోడో న్యాయ్ యాత్ర సందర్భంగా పార్టీ కార్యకర్తలు, పోలీసులకు మధ్య జరిగిన ఘర్షణలో భాగంగా రాహుల్ గాంధీపై అసోం పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసుపై దర్యాప్తు కోసం సిఐడికి బదిలీ చేసినట్లుగా ఆ రాష్ట్ర డిజిపి జిపి సింగ్ ట్విట్టర్ ద్వారా తెలిపారు.

అన్యాయంపై 'ఇండియా' పోరాటం : రాహుల్

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో న్యాయ్ యాత్ర గురువారం పశ్చిమ బెంగాల్‌లోని కూచ్‌బిహార్ జిల్లా బక్షిర్‌హాట్‌లో ప్రవేశించింది. రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు అధిర్ చౌదరి యాత్రకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాహుల్ ప్రసంగిస్తూ దేశంలో జరుగుతున్న అన్యాయాలపై ఇండియా ఫోరం పోరాడుతుందని చెప్పారు. 'దేశంలో అన్యాయాలు జరుగుతున్నాయి. అందుకే మా యాత్ర పేరులో న్యాయం అనే పదాన్ని జోడించాం. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌లు విద్వేషాలను, హింసను వ్యాప్తి చేస్తున్నాయి' అని విమర్శించారు. బెంగాల్‌లో కాంగ్రెస్‌తో పొత్తు ఉండబోదని, సార్వత్రిక ఎన్నికల్లో ఒంటరిగానే బరిలో దిగుతామని తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రకటించిన మర్నాడే రాహుల్ యాత్ర బెంగాల్‌లో ప్రవేశించింది. కాగా, రాష్ట్రంలో భారత్ జోడో న్యాయ్ యాత్ర సందర్భంగా జరిగిన హింసకు సంబంధించి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని లోక్‌సభ ఎన్నికల తర్వాత అరెస్ట్ చేస్తామని అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ తెలిపారు.

ప్రాణం తీసిన మూఢత్వం

- కేన్సర్‌తో బాధపడుతున్న ఐదేళ్ల బాలుడి మృతి
- గంగలో ముంచడంతో ప్రాణాలు బలి

డెహ్రాడూన్ : దేశాన్ని మూఢత్వం, అంధ విశ్వాసాలు ఏదో రూపంలో పట్టిపీడుస్తూనేవున్నాయి. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత మూఢత్వ భావనలకు పాలకులు అధిక ప్రాధాన్యత ఇస్తుండటంతో అమాయక ప్రజలు అంధ విశ్వాసాలకు బలైపోతున్నారు. ఉత్తరాఖండ్‌లో ఇలాంటి మూఢత్వాన్నే విశ్వసించి కేన్సర్‌తో బాధపడుతున్న సొంత బిడ్డను తల్లిదండ్రులు బలిపెట్టిన ఘటన వెలుగులోకి వచ్చింది. పోలీసులు కథనం ప్రకారం.. ఢిల్లీకి చెందిన ఓ ఐదేళ్ల బాలుడు బ్లడ్ కేన్సర్‌తో బాధపడుతున్నాడు. అక్కడే ఒక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బిడ్డ త్వరగా కోలుకోవాలని ఆశించిన తల్లిదండ్రులు ఎంతోమంది వైద్యులను, జ్యోతిష్యులను, మత గురువులను సంప్రదించారు. ఈ క్రమంలో హరిద్వార్ వెళ్లి పవిత్ర గంగలో బిడ్డను ముంచితే కేన్సర్ మాయం అవుతుందని ఓ పండితుడు సలహా ఇచ్చాడు. దీంతో తమ బిడ్డను కాపాడుకునేందుకు హరిద్వార్‌లోని హర్‌కీ పౌరికి తీసుకువెళ్లి ప్రార్థనలు చేశారు. చిన్నారిని అతడి అత్త చల్లగా ఉన్న నది నీటిలో ముంచింది. ఇదంతా అక్కడున్నవారు గమనించారు. ఎంతకీ బాలుడిని బయటకు తీయకపోవడంతో ఆమెను అడ్డుకున్నారు. ఇలా చేస్తే బిడ్డ బతుకుతాడంటూ ఆమె వారిపై దాడికి యత్నించింది. స్థానికులు ఆమెను అడ్డుకొని బాలుడిని బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతడు మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి కుటుంబ సభ్యులను అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు.

బిజెపి నేతపై చర్యలేవి ?

- ప్రశ్నించిన బాంబే హైకోర్టు

ముంబయి : గత సంవత్సరం సెప్టెంబరులో ఓ మసీదుపై జరిగిన దాడితో సంబంధం ఉన్న బిజెపి సీనియర్ నేత విక్రమ్ పావస్కార్‌పై తీసుకున్న చర్యలను వివరిస్తూ రెండు వారాల్లో సమాధానం ఇవ్వాలని బాంబే హైకోర్టు మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. పావస్కార్‌పై చర్యకు డిమాండ్ చేస్తూ బాంబే హైకోర్టులో గతంలో రిట్ పిటిషన్ దాఖలైంది. వాస్తవానికి రాష్ట్రంలో విద్వేష ప్రసంగాలు చేసిన వారి పైన తరచుగా ఫిర్యాదులు వస్తూనే ఉన్నాయి. పోలీసులు కూడా ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేసి చేతులు దులుపుకుంటున్నారు. కానీ వాటిపై మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు విక్రమ్ పావస్కార్ తరచూ విద్వేషపూరిత ప్రసంగాలు చేస్తూ ప్రజలను రెచ్చగొడుతుంటారు. ఆయనపై ఎన్ని ఫిర్యాదులు వచ్చినా, ఎఫ్‌ఐఆర్‌లు నమోదైనా చర్యలు మాత్రం శూన్యం. ఈ నేపథ్యంలో పలువురు పిటిషనర్లు బాంబే హైకోర్టును ఆశ్రయించారు. ఎఫ్‌ఐఆర్‌పై తక్షణమే చర్య తీసుకోవాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరారు. మసీదుపై దాడి చేసిన కేసులో గత సంవత్సరం డిసెంబర్ 18న తుది ఛార్జిషీటు దాఖలైంది. అయితే ఆశ్చర్యకరంగా అందులో పావస్కార్ పేరు లేదు. దీనిపై కూడా న్యాయస్థానం పోలీసులకు నోటీసులు జారీ చేసింది. పిటిషనర్‌కు, సాక్షులకు రక్షణ కల్పించాలని ఆదేశించింది.

బిజెపిలో తిరిగి చేరిన శెట్టార్

బెంగళూరు : కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి జగదీశ్ శెట్టార్ మళ్లీ బిజెపిలో చేరారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌లో చేరిన ఆయన.. తిరిగి సొంత గూటికి చేరారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాతో పాటు ఇతర నేతలతో భేటీ అయిన అనంతరం పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించారు. అసెంబ్లీ ఎన్నికల వేళ ఆయనకు బిజెపి టికెట్ ఇవ్వకపోవడంతో కాంగ్రెస్‌లో చేరిన విషయం తెలిసిందే. బిజెపి కేంద్ర కార్యాలయంలో సీనియర్ నేతలు బిఎస్ యడ్యూరప్ప, బిజెపి కర్ణాటక అధ్యక్షులు బివై విజయేంద్ర.. శెట్టార్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ సభ్యత్వాన్నీ అందజేశారు. బిజెపిలో తిరిగి చేరికపై శెట్టార్ మాట్లాడుతూ.. నరేంద్ర మోడీ మరోసారి ప్రధాని అవుతారనే విశ్వాసం ఉందన్నారు. పార్టీలోకి రావాలని యడ్యూరప్ప, ఇతర సీనియర్ నేతలతోపాటు పార్టీ కార్యకర్తలు కోరడంతో సొంత గూటికి చేరానన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో బిజెపి రాష్ట్ర నాయకత్వంపై శెట్టార్ తీవ్ర విమర్శలు గుప్పించారు. హుబ్బళ్లి- ధార్వాడ సెంట్రల్ నుంచి హస్తం పార్టీ తరపున పోటీ చేసి పరాజయం పాలయ్యారు. ఇక్కడ బిజెపి నేత మహేశ్ 35 వేల ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ఆ సమయంలో బిజెపి అభ్యర్థి ఎన్నికల్లో నగదు పంచారంటూ శెట్టర్ ఆరోపించారు. ఇప్పుడు ఏడాది తిరగకముందే సొంత గూటికి చేరడం గమనార్హం.

మెయితీ సాయుధుల గుప్పెట్లో మణిపూర్

- కేంద్ర ప్రభుత్వ కుట్రపూరిత చర్య
- ఆదివాసీ నేతల వేదిక ఆగ్రహం

గౌహతి : మణిపూర్‌లో సంఘ్ పరివార్ కనుసన్నల్లో నడుచుకుంటున్న మెయితీలకు కేంద్ర, రాష్ట్రాల్లోని బిజెపి ప్రభుత్వాలు పరోక్షంగా అధికారాన్ని కట్టబెట్టాయని ఆదివాసీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక మూలవాసులకు అన్యాయం చేసి పెత్తందారి మెయితీలకు చెందిన సాయుధ తీవ్రవాద గ్రూపు అరంబై తెంగ్గోల్‌కు రాష్ట్రాన్ని అప్పగించారని విమర్శిస్తున్నారు. రాష్ట్రంలో ఎంపిలు, ఎమ్మెల్యేలపైనా అరంబై తెంగ్గోల్ పెత్తనం చేస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మౌనంగా ఉండటమే ఇందుకు నిదర్శనమని వారు చెబుతున్నారు. జాతి విద్వేష దాడులతో మణిపూర్ నెత్తుటి పుండుగా మారడానికి అరంబై తెంగ్గోల్ సాయుధ గ్రూపు దాడులే కారణమన్న సంగతి తెలిసిందే. ఇప్పుడు అదే సంస్థ రాష్ట్ర ప్రజాప్రతినిధులపై పెత్తనం చెలాయిస్తున్నా...కిమ్మనకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయంటూ స్థానిక ఆదివాసీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బిజెపి ప్రభుత్వాల వైఖరిని వ్యతిరేకిస్తూ ఆదివాసీలకు చెందిన ఇండిజినస్ ట్రైబల్ లీడర్స్ ఫోరమ్ (ఐటిఎల్‌ఎఫ్) గురువారం భారీ ప్రదర్శన నిర్వహించింది. ఈ సందర్భంగా ఐటిఎల్‌ఎఫ్ నేతలు మాట్లాడుతూ సాయుధ గ్రూపు అరంబై తెంగ్గోల్ ఆగడాలు శృతిమించిపోతున్నాయన్నారు. ఇంఫాల్‌లో బుధవారం ప్రజాప్రతినిధులతో సభ నిర్వహించిన తెంగ్గోల్ గ్రూపు వారితో తమకు అనుకూలంగా ప్రమాణాలు తీసుకుందని, ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి బిరేన్ సింగ్, కేంద్ర విదేశాంగ శాఖ సహాయ మంత్రి రాజ్‌కుమార్ రంజన్ సింగ్ కూడా పాల్గొన్నారని ఐటిఎల్‌ఎఫ్ నేతలు పేర్కొన్నారు. ఈ సభా వేదిక వద్దకు అరంబై తెంగ్గోల్ నాయకుడు కొరౌంగన్‌బా ఖుమాన్ పోలీసు వాహనంలో వచ్చినా.. రాష్ట్ర పోలీసులు, కేంద్ర బలగాల సిబ్బంది మౌన ప్రేక్షకుల్లా ఉండిపోవడం ఆందోళనకరమన్నారు. కేంద్రం పంపిన ప్రత్యేక భద్రతా బృందం నగరానికి సమీపంలో క్యాంప్ నిర్వహిస్తున్నప్పుడే జరిగిందని గుర్తు చేశారు. కాగా ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం తీవ్రవాద సంస్థ నేతలను పోలీసుల వాహనాల్లో ఎలా తరలిస్తుందని ఐటిఎల్‌ఎఫ్ ఒక ప్రకటనలో ప్రశ్నించింది. ఖుమాన్ తాను చేసే పనులను రహస్యంగా ఉంచుకునే వ్యక్తికాదని, రైఫిల్స్ పట్టుకుని ఉన్న చిత్రాలను క్రమం తప్పకుండా పోస్ట్ చేస్తుంటాండని పేర్కొంది. గిరిజనులపై దాడులకు పిలుపునిస్తూ బహిరంగ ప్రసంగాలు చేస్తాడని, పోలీసులు, భద్రతా సిబ్బంది నుంచి దొంగలించిన అధునాతన ఆయుధాలను అరంబై తెంగ్గోల్ కార్యకర్తలు బహిరంగంగా ప్రదర్శిస్తున్న వీడియోలు సోషల్ మీడియాలో అనేకం ఉన్నాయని ఐటిఎల్‌ఎఫ్ గుర్తు చేసింది. అయినా ఇలాంటి వ్యక్తిపై ప్రభుత్వాలు ఎందుకు చర్య తీసుకోవని ఐటిఎల్‌ఎఫ్ ప్రశ్నించింది.



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును నిరసిస్తూ ఆందోళన చేస్తున్న ఐటిఎల్‌ఎఫ్

నాటో అతిపెద్ద సైనిక విన్యాసాలు ఆరంభం

బ్రస్సెల్స్ : దశాబ్దాల కాలంలోనే అతి పెద్దదైన సైనిక విన్యాసాలు "ఎక్సర్‌సైజ్ స్టెడ్‌ఫాస్ట్ డిఫెండర్ 2024"ను నాటో బుధవారం ప్రారంభించింది. యుఎస్‌ఎస్ గన్‌స్టన్ హాల్ నౌక వర్జీనియాలోని నార్‌ఫోల్క్ నుండి బయలుదేరిందని, అట్లాంటిక్ సముద్రంలో ప్రయాణ మార్గంలో అనేక సైనిక విన్యాసాలను చేపడుతుందని నాటో ఒక ప్రకటనలో తెలిపింది. కెనడా నౌక చార్లెటౌన్ కూడా హాలిఫాక్స్ నుండి బయలుదేరుతోందని తెలిపింది. అనేక ప్రాంతాల్లో ఈ విన్యాసాలు మే 31వరకు జరగనున్నాయి. అనేక మాసాల పాటు సంక్లిష్టమైన బహుళ విన్యాసాలను నాటో నిర్వహించగలదని చెప్పడమే ఈ విన్యాసాల ప్రధాన ఉద్దేశ్యమని ఆ ప్రకటన పేర్కొంది. గత గురువారం నాటో సుప్రీం కమాండర్ క్రిస్టోఫర్ కవేలీ ఈ విన్యాసాల విషయాన్ని ప్రకటించారు. నాటోకి చెందిన 31 దేశాల నుండి దాదాపు 90వేల మంది సైనికులు ఇందులో పాల్గొననున్నారు.

ఇయు నుంచి వైదొలుగుతాం !

- జర్మనీ మితవాద పార్టీ

మ్యునిచ్ : తాము అధికారంలోకి వస్తే యురోపియన్ యూనియన్ (ఇయు) నుంచి వైదొలుగుతామని జర్మనీ మితవాద ఆల్టర్‌నేటివ్ ఫర్ జర్మనీ (ఎఎఫ్‌డి) నేత అలెస్ వీడెల్ ఒక ఇంటర్వ్యూలో చెప్పారు. ఇలా వైదొలగడాన్ని డెక్సిట్‌గా పిలుస్తున్నారు. ఇయు నుంచి జర్మనీ వైదొలిగేందుకు రిఫరెండం కోరుతామని, అయితే 2029లోగా తమ పార్టీ అధికారంలోకి వచ్చే అవకాశం లేదని ఆమె తెలిపారు. కానీ ప్రభుత్వంలో తమ పార్టీ చోటు సంపాదించుకుంటుందని తెలిపారు. నిర్దిష్ట కాల పరిమితిలో యురోపియన్ యూనియన్‌ను గనక సంస్కరించకపోతే జర్మనీ ఇయు నుండి బయటకు వచ్చేస్తుందని 2019లోనే ఎఎఫ్‌డి బహిరంగంగా ప్రకటించింది. ఈ విషయంలో యూరప్‌లోని మితవాద, అతివాద పార్టీల కన్నా ఎఎఫ్‌డికి భిన్నమైన అభిప్రాయం లేదు. యూరప్‌వ్యాప్తంగా మితవాద పార్టీలన్నీ కూడా ఇయు చట్టబద్ధత కోల్పోయిందని వాదిస్తున్నాయి. అయినా కానీ సార్వభౌమ దేశాలపై రాజకీయ, ఆర్థిక అధికారాన్ని కలిగి వుందని పేర్కొంటున్నాయి. ఇది నయా సామ్రాజ్యవాదానికి మరొక రూపమేనని ఆ పార్టీలు భావిస్తున్నాయి.

ఇజ్రాయిల్ సాయుధ దళాలకు
ఆహార సరఫరా నిలిపేయాలి

- మానవతావాద సంస్థల కూటమి పిలుపు

జెరుసలేం : ఇజ్రాయిల్ సాయుధ దళాలకు ఆహార, నిత్యావసర వస్తువుల సరఫరాను నిలిపివేయాలని 16 సంస్థలతో కూడిన మానవతావాద సంస్థల కూటమి పిలుపునిచ్చింది. ఈ కూటమిలో అమ్నెస్టీ ఇంటర్నేషనల్, ఆక్సాఫామ్, సేవ్ ది చిల్డ్రన్, నార్వేజియన్ రెఫ్యూజీ కౌన్సిల్.. వంటి మానవతావాద సంస్థలు ఉన్నాయి. గాజాలో పరిస్థితి పూర్తిగా నిరాశాజనకంగా ఉందని ఈ కూటమి ఆందోళన వ్యక్తం చేసింది. గాజా జనాభాలో ప్రతీ 25 మందిలో ఒకరు చనిపోవడం, లేదా గాయపడటం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేసింది. అన్ని దేశాలు తక్షణమే ఇజ్రాయిల్ సాయుధ దళాలకు ఆయుధాలు, ఆయుధ సామగ్రి, మందుగుండు సరఫరాను నిలిపివేయాలని విజ్ఞప్తి చేసింది. ఇలాంటి వస్తువుల సరఫరాతో అంతర్జాతీయ మానవ హక్కుల నిబంధనలను ఉల్లంఘించే ప్రమాదం ఉందని హెచ్చరించింది. ఇజ్రాయిల్ బాంబు దాడులు, అక్రమణల కారణంగా గాజా నివాసయోగ్యం కాకుండా పోతుందని, ప్రస్తుతం గాజాలో జనాభా గతంలో ఎన్నడూ చూడని మానవతా సంక్షోభాన్ని ఎదుర్కొంటుందని కూటమి ఆవేదన వ్యక్తం చేసింది.

ఇజ్రాయిల్ మారణకాండపై నేడు ఐసిజె తీర్పు

హేగ్ : గాజాలో ఇజ్రాయిల్ మారణహోమం కేసులో ఐరాసకు చెందిన అంతర్జాతీయ న్యాయస్థానం (ఐసిజె) శుక్రవారం తీర్పును వెల్లడించనుంది. గాజాలో మారణహోమానికి పాల్పడుతున్న ఇజ్రాయిల్‌పై చర్యలు తీసుకోవాలని ఐసిజెలో గత ఏడాది డిసెంబరు 29న దక్షిణాఫ్రికా కేసు వేసిన సంగతి తెలిసిందే. ఈ కేసు విచారణలో వాదనలు రెండు వారాల క్రితమే ముగిశాయి. పాలస్తీనాలో ఒక యావత్తు జాతిని నిర్మూలించడానికి ఇజ్రాయిల్ నెలల తరబడి దాడులు కొనసాగిస్తుందని, దీనిని మారణ హోమంగా భావించాలని దక్షిణాఫ్రికా వాదనలు వినిపించింది. పాలస్తీనా ప్రజలపై కొనసాగుతున్న కోలుకోలేని దాడుల నుంచి రక్షించడానికి అత్యవసర చర్యలను సూచించాలని కూడా దక్షిణాఫ్రికా ఐసిజెను అభ్యర్థించింది.

అమెరికాకు ఆ నైతిక హక్కు లేదు !

- వెనిజులా ప్రభుత్వం

కారకస్ : వెనిజులాను అస్థిరీకరించేందుకు ప్రయత్నిస్తున్న ప్రభుత్వ వ్యతిరేక కార్యకర్తలను అరెస్టు చేయడంపై అమెరికా వ్యతిరేకంగా స్పందించడాన్ని వెనిజులా బుధవారం కొట్టిపారేసింది. దేశంలో శాంతిని పరిరక్షించేందుకు వెనిజులా ప్రభుత్వం తీసుకునే చర్యలను ఖండించే నైతికత అమెరికా ప్రభుత్వానికి లేదని వెనిజులా విదేశాంగ మంత్రిత్వ వాఖ ఒక ప్రకటనలో విమర్శించింది. వెనిజులాల్లో తీవ్రవాద చర్యలకు పాల్పడేవారికి అనుకూలంగా వాషింగ్టన్ మాట్లాడడం తమకేమీ ఆశ్చర్యం కలిగించడం లేదని, పైగా వారికి సహకరిస్తోందని ఆ ప్రకటన పేర్కొంది. దేశంలో అస్థిరతను రాజేసి, హింసకు, బెదిరింపులకు పాల్పడాలన్నది వారి లక్ష్యంగా వుందని విమర్శించింది. ఈ ఏడాది జరిగే వెనిజులా ఎన్నికలతో దేశంలో శాంతికి హామీ దొరుకుతుందని పేర్కొంది. దేశాన్ని అస్థిరీకరించేందుకు అమెరికా గతేడాది నుండి పన్నిన ఐదు కుట్రలను భగ్నం చేసినట్లు వెనిజులా అధికారులు తెలిపారు. అందులో వెనిజులా అధ్యక్షుడు నికొలస్ మదురోని హత్య చేసేందుకు పన్నిన కుట్ర కూడా వుందన్నారు. ఈ కుట్రలకు సంబంధించి 30 మందికి పైగా అనుమానితులను అరెస్టు చేయాల్సిందిగా వెనిజులా ప్రాసిక్యూటర్ కార్యాలయం ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఈ అరెస్టు ఆదేశాల పట్ల తాము తీవ్రంగా ఆందోళన చెందుతున్నామంటూ అమెరికా విదేశాంగ శాఖ వ్యాఖ్యానించింది. ప్రభుత్వ వ్యతిరేక కుట్రకు పాల్పడినందుకు వెనిజులా సాయుధ బలగాల నుండి 33మందిని బహిష్కరించారు. వీరిలో సైనికులు, ఉన్నత స్థాయి అధికారులు వున్నారని వెనిజులా రక్షణ శాఖ బుధవారం తెలిపింది. చట్టబద్ధ:గా ఏర్పడిన ప్రభుత్వంపై దాడి చేయడానికి క్రిమినల్, తీవ్రవాద చర్యలకు దిగాలని వీరు కుట్రలు పన్నారని రక్షణశాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. బొలివారియన్ జాతీయసాయుధ బలగాలు (ఎఫ్ఎఎన్‌బి) నైతిక ప్రమాణాలకు అనుగుణంగా వారికి సైనిక హోదా తొలగించింది.

రష్యా జాతీయవాది గిర్కిన్‌కు నాలుగేళ్ల జైలు

మాస్కో : రష్యా జాతీయవాది, మాజీ రెబెల్ కమాండర్ ఇగర్ గిర్కిన్‌కు మాస్కో నగర కోర్టు నాలుగేళ్లపాటు జైలు శిక్ష విధించింది. పదే పదే క్రెమ్లిన్‌ను విమర్శిస్తూ, అధ్యక్షుడు పుతిన్‌ను 'ఓల్డ్ ఇడియట్', పిరికిపంద అంటూ గిర్కిన్ విమర్శించినందుకు ఈ శిక్ష పడింది. తీవ్రవాద కార్యకలాపాలకు పాల్పడాలంటూ ప్రజలకు పిలుపిస్తున్నారని కోర్టు పేర్కొంది. జనరల్ రెజిమ్ కాలనీలో ఆయన తన శిక్షను అనుభవిస్తారని తెలిపింది. 'నా దేశానికి నేను సేవ చేశాను' అని కోర్టు తీర్పు తర్వాత గిర్కిన్ వ్యాఖ్యానించారు. రష్యా సైనిక నేతలపై, అధ్యక్షుడు పుతిన్‌పై నెలల తరబడి బహిరంగంగా మాటల దాడులకు పాల్పడుతుండడంతో గతేడాది తీవ్రవాద ఆరోపణలపై ఆయనను అరెస్టు చేశారు.



మీ కోసం

గ్యాస్ బండపై నూనె మరకలు ఉండి, జిడ్డుగా అనిపిస్తే గోధుమపిండి వేసి రుద్దాలి.

జీవన సౌరభం

అడ్డంకులకు కుంగిపోకుండా అనుభవాలుగా మార్చుకున్నప్పుడే విజయం సాధిస్తాం.

గణతంత్ర దినోత్సవం

నేస్తాలూ,

ఈ రోజు మనం 75వ గణతంత్ర దినోత్సవం జరుపుకుంటున్నాం. అసలు ఈ రోజు ఎలా వచ్చిందో, దాని విశేషాలు ఏంటో తెలుసుకుందామా?




దాదాపు 200 ఏళ్ల పాటు బ్రిటీష్ వారు మన దేశాన్ని పాలించారు. వాళ్లను మన దేశం నుంచి పంపించేందుకు మన దేశ నాయకులు, ప్రజలూ ఎంతో పోరాటం చేశారు. ఎంతోమంది ప్రాణత్యాగాలు చేశారు. చివరికి ఆగస్టు 15, 1947న మనకు స్వాతంత్ర్యం వచ్చింది. అప్పటివరకూ మనదేశ పరిపాలన బ్రిటీష్ రాజ్యాంగం ప్రకారమే జరిగేది. స్వాతంత్ర్యం వచ్చాక మన పాలన ఎలా ఉండాలో, పౌరులు ఎలా ఉండాలో ఒక విధానం తయారు చేసుకోవడం అవసరమైంది.

డాక్టర్ బాబూ రాజేంద్ర ప్రసాద్ అధ్యక్షతన రాజ్యాంగ పరిషత్‌ను ఏర్పాటు చేశారు. 1947 ఆగస్టు 29న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఛైర్మన్‌గా రాజ్యాంగ ముసాయిదా కమిటీ ఏర్పాటైంది. అనేక సవరణల అనంతరం 1949 నవంబరు 26న భారత రాజ్యాంగాన్ని రాజ్యాంగ పరిషత్ ఆమోదించింది. రెండు సంవత్సరాల, 11 నెలల, 18 రోజుల కాలంలో పూర్తి చేసిన మన రాజ్యాంగం ప్రపంచంలోనే అతి పెద్ద లిఖిత రాజ్యాంగంగా గుర్తింపు పొందింది. 308 మంది సభ్యులు కీలక చర్చలు నిర్వహించిన రాజ్యాంగాన్ని ఇంగ్లీషు, హిందీ భాషల్లో చేతిరాతతో తయారుచేశారు. రాజ్యాంగం అసలు ప్రతులు రెండు మాత్రమే ఉంటాయి. అవి పాడవ్వకుండా ఉండేందుకు హీలియం వాయువు నింపిన బ్రీఫ్ కేసుల్లో పార్లమెంటు భవనంలో భద్రపరిచారు. వాటి నకలు ఫొటో కాపీలు మాత్రమే మనకు అందుబాటులో ఉంటాయి.

మన రాజ్యాంగం 1950 జనవరి 26వ తేదీ నుంచి అమల్లోకి వచ్చింది. ఆరోజు మన దేశాన్ని 'సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యంగా ప్రకటించుకున్నాం. ఆ రోజు నుంచి మన భారతదేశం పూర్తి గణతంత్ర దేశం అయ్యింది. అందుకే ఏటా జనవరి 26న గణతంత్ర దినోత్సవంగా జరుపుకుంటున్నాం. ఈ రోజు దేశ రాజధాని ఢిల్లీ నగరంలో రాష్ట్రపతి ఆధ్వర్యంలో గణతంత్ర వేడుకలు అత్యంత వైభవంగా జరుగుతాయి.

దేశంలోని ప్రతి పాఠశాలలోనూ జాతీయ జెండా ఎగురవేసి వందనం చేస్తారు. ఈ సందర్భంగా భారతదేశ స్వాతంత్ర్యానికి కృషి చేసిన అమరవీరుల త్యాగఫలాలను కొనియాడుతూ, వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్తామని ప్రతి ఒక్కరూ ప్రతిజ్ఞ చేస్తారు. వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన బాలలకు ఈ రిపబ్లిక్ డే వేడుకల్లో 'బాల పురస్కార్' కూడా అందజేస్తారు.

నేను గీసిన బొమ్మ





బుస్సవేని రిత్విక్,
7వ తరగతి,
జక్కాపూర్,
సిద్దిపేట జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

జాతీయ జెండాతో సామరస్య ప్రచారం





ఏలూరులో నివాసం ఉంటున్న షేక్ మాబు సుభాని కృష్ణా జిల్లా బాపులపాడు మండలం మల్లవల్లిలో పుట్టారు. ఆయన తల్లిదండ్రులు షఖినాబి, ఫరీద్ కూడా స్వాతంత్ర్య పోరాటాన్ని దగ్గరగా చూసిన వారు. వారి ఇంట్లో దేశభక్త వాతావరణం ఉండేది. తండ్రి ఫరీద్ కమ్యూనిస్టు భావజాలంతో ఉంటూ జనచైతన్యం కోసం బుర్రకథ చెప్పేవారు. స్వతహాగా టైలరింగ్ వృత్తిలో ఉండే ఆయన మిలటరీ దుస్తులు కుట్టేవారు. తల్లి షఖినాబి కూడా ఉర్దూ పండిట్. ఆరోజుల్లోనే ప్రభుత్వ ఉద్యోగం వచ్చిన తీసుకోకుండా విస్సన్నపేట, మైలవరం, తిరువూరు వంటి ప్రాంతాలకు వెళ్లి నిరుపేదలకు చదువు చెప్పేవారు. అలాంటి ఇంట్లో పుట్టిన బిడ్డగా సుబాని చిన్నప్పటి నుంచే అభ్యుదయభావాలను అలవర్చుకున్నారు. బాలుడిగా ఉన్నప్పుడు జై ఆంధ్రా ఉద్యమంలో పాల్గొని పాటలు పాడేవాడు. పెద్దయ్యాక తండ్రిబాటలోనే టైలరింగ్ వృత్తిని ఎంచుకున్నారు. ఆయన ముగ్గురు కుమారులు. మొదట మల్లవల్లి, ఆ తర్వాత హనుమాన్ జంక్షన్‌లో పనిచేశారు. పిల్లలు పెద్దయ్యాక వారు స్థిరపడిన ఏలూరుకు మకాం మార్చారు.

26 ఏళ్లుగా జాతీయజెండాలు పంచుతూ...

సుబానీకి కళలు, సంగీతం, సాహిత్యం ఎంతో ఇష్టం. ఆ ఆసక్తితోనే దేశభక్తిపరంగా పింగళి వెంకయ్య, సంగీతపరంగా ఘంటసాల వెంకటేశ్వరరావు, నటనాపరంగా అక్కినేని నాగేశ్వరరావులపై అభిమానం పెంచుకున్నారు. 2022 ఏప్రిల్‌లో ఘంటసాల శతజయంతి వేడుకను నిర్వహించారు. ఆగస్టు 15న భారత స్వాతంత్ర్యానికి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా (ఆజాదికా అమృత మహోత్సవ్) నెక్సన్ కంపెనీ ఆధ్వర్యంలో జరిగిన వేడుకకు 500 జెండాలను తయారు చేసి ఉచితంగా అందజేశారు. పింగళి వారసులను సన్మానించారు. స్కూళ్లు, కళాశాలలకు మరో 500 జెండాలు అందజేశారు. ఇంటింటికీ 1000 జెండాలను పంచారు. పింగళి వెంకయ్య చిత్రపటాలు, జెండాలతోపాటుగా 200కుపైగా కృష్ణాజిల్లా, ఏలూరు, అంబేద్కర్ కోనసీమ, తిరుపతి జిల్లాల్లో పంపిణీ చేశారు.

2023లో బాపులపాడు మండలం వేలేరులో జవహర్ నవోదయ విద్యాలయం వద్ద కొంతమంది దేశభక్తులు, మానవత సేవా సంస్థ సహకారంతో పింగళి వెంకయ్య విగ్రహ ప్రతిష్ట చేశారు. ఏటా ఆగస్టు రెండోతేదీన పింగళి జయంతి కార్యక్రమం నిర్వహిస్తున్నారు. తాను తయారు చేసిన జెండాలను ఆరోజు ఆవిష్కరించి, తరువాత పంపిణీ చేయడం అలవాటుగా పెట్టుకున్నారు.

పింగళి వెంకయ్య, ఘంటసాల వెంకటేశ్వరరావు కుటుంబాలతో సుబానీ కుటుంబానికి అనుబంధం ఉంది. వారు మరణించిన తర్వాత ఆయా కుటుంబాలతో అనుబంధం కొనసాగించారు. పింగళి వెంకయ్యకు సరైన గుర్తింపు రాలేదని, ఆయనకు భారతరత్న ఇవ్వాలని సుబానీ పేర్కొన్నారు. గత 26 సంవత్సరాలుగా ఈ విషయంపై ప్రచారం చేస్తున్నారు.

నాటకరంగంపై మక్కువ

దేశభక్తి, అభ్యుదయం, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి భావాలతో 200కుపైగా నాటిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు సుబానీ. 'సమాజంలోని అందరూ బాగుండాలి. అందులో నేనుండాలి' అనే భావనతో ఈ ప్రదర్శనలు సాగేవి. ఎక్కడ కళాప్రదర్శనలు, పాటల పోటీలు జరిగినా వెళ్లి పాల్గొనేవారు.

పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు పేరుతో 2012లో స్వరపీఠం స్థాపించారు. ఘంటసాల జయంతి, వర్ధంతులు ఏటేటా నిర్వహిస్తున్నారు. మహిళలకు ఉచితంగా టైలరింగ్‌లో శిక్షణ ఇస్తున్నారు. ఆసక్తి గల వారికి ఘంటసాల దేశభక్తి గేయాలను నేర్పుతున్నారు. మంచి సాంస్కృతిక వాతావరణంతోనే దేశంలో శాంతి–కాంతి ఏర్పడతాయని ఆయన అంటారు. ఆయన వద్ద శిక్షణ పొందిన మహిళలు టైలరింగ్ వృత్తిలో సొంతంగా యూనిట్లు పెట్టుకుని స్వయం ఉపాధి పొందుతున్నారు. ఆయన ఇచ్చిన శిఓనతో కళాకారులుగా రాణిస్తున్న వారూ ఉన్నారు. ఘంటసాల ఆణిముత్యాలు, దేశభక్తి గేయాలు, ప్రబోధ గీతాలను ప్రత్యేకంగా వేదికలపై ఆయన ఆలపిస్తుంటారు.

పలు సత్కారాలు

జాతీయ జెండాలతో సామరస్య భావాన్ని పెంపొందింపజేస్తున్న సుభానిని గుర్తించి పలు ప్రభుత్వ, ప్రయివేటు సంస్థలు అవార్డులు, పురస్కారాలు ప్రదానం చేశాయి. రాష్ట్ర ప్రభుత్వ సృజనాత్మకత, కళా సంస్థ ఆధ్వర్యాన ఎబికె అబ్దుల్ కలాం పురస్కారాన్ని మంత్రి ఆర్‌కె రోజా అందజేశారు. కరోనాలో 6 వేల మందికి మాస్కులు, సబ్బులు, బిక్కెట్లు, శానిటైజర్లు వంటివి పంపిణీచేసినందుకు ప్రౌడ్ ఇండియా సంస్థ కరోనా సేవక్ పురస్కారం అందించింది. 2021లో అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి చేతుల మీదుగా కళాకారుడిగా సత్కారం అందుకున్నారు.

- యడవల్లి

ఇంగ్లండ్‌ను కూల్చిన అశ్విన్



- 246 పరుగులకే పరిమితం
- స్టోక్స్ అర్ధసెంచరీ
- భారత్ 119/1

హైదరాబాద్: ఉప్పల్ స్టేడియంలో జరుగుతున్న తొలి టెస్టులో ఇంగ్లండ్ 246 పరుగులకే ఆలౌటయ్యింది. భారత స్పిన్నర్లు విజంభించడంతో స్టోక్స్ సేన మొదటి రోజే మూడో సెషన్‌లో కుప్పకూలింది. కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడిన బెన్ స్టోక్స్(70)ను బుమ్రా బౌల్డ్ చేయడంతో ఇంగ్లండ్ ఇన్నింగ్స్ ముగిసింది. భారత బౌలర్లలో జడేజా మూడు, అశ్విన్, అక్షర్ పటేల్, బుమ్రా రెండేసి వికెట్లు పడగొట్టారు. రెండేండ్లేగా బాజ్ బాల్ ఆటతో ప్రత్యర్థులను వణికిస్తున్న ఇంగ్లండ్ బ్యాటర్లు భారత గడ్డపై తేలిపోయారు. లంచ్ తర్వాత తడబడిన ఇంగ్లండ్ జట్టు టీ సమయానికి 215 స్కోర్ చేసింది. భారత స్పిన్ త్రయం రవిచంద్రన్ అశ్విన్, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్ విజంభణతో.. ఒకదశలో రెండొందల లోపే ఆలౌట్ అవుతుందనుకున్న జట్టును అతడు మార్క్ వుడ్(7 నాటౌట్), టామ్ హార్ట్లే(23)తో కలిసి విలువైన భాగస్వామ్యాలు నెలకొల్పాడు. దాంతో, టీ టైమ్‌కి ఇంగ్లండ్ 8 వికెట్ల నష్టానికి 215 పరుగులు కొట్టింది. సొంతగడ్డపై బాజ్ బాల్ ఆటతో యాషెస్ సిరీస్ సమం చేసుకున్న ఇంగ్లండ్ జట్టు భారత గడ్డపై తేలిపోయింది. తొలి సెషన్‌లోనే ఓపెనర్లు జాక్ క్రాలే(18), బెన్ డకెట్(35)లతో పాటు ఓలీ పోప్(1)లు ఔట్ కావడంతో.. ఇంగ్లండ్‌ను జానీ బెయిర్‌స్టో(37), జో రూట్(29) ఆదుకున్నారు. కానీ, లంచ్ తర్వాత అక్షర్ పటేల్ డేంజరస్ బెయిర్‌స్టోను బౌల్డ్ చేశాడు. ఆ కాసేపటికే జడ్డూ బౌలింగ్‌లో రూట్ తనకు అచ్చొచ్చిన స్వీప్ షాట్ ఆడి బుమ్రాకు క్యాచ్ ఇచ్చాడు. దాంతో, 137 పరుగులకే ఆరు వికెట్లు కోల్పోయిన సమయంలో యంగ్‌స్టర్ టామ్ హర్ట్లే(23) ధనాధన్ ఆడి స్టోక్స్‌పై ఒత్తిడిని తగ్గించాడు. హర్ట్లే ఔటయ్యాక గేర్ మార్చిన స్టోక్స్ హాఫ్ సెంచరీతో స్కోర్ బోర్డును పరుగులు పెట్టించాడు. అయితే.. మరో ఎండ్‌లో సహకారం లభించకపోవడంతో ఇంగ్లండ్ 246 రన్స్‌కే పరిమితమైంది.

స్కోర్‌బోర్డు...

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: క్రాలే (సి)సిరాజ్ (బి)అశ్విన్ 20, డక్కెట్ (ఎల్‌బి)అశ్విన్ 35, పోప్ (సి)రోహిత్ (బి)జడేజా 1, రూట్ (సి)బుమ్రా (బి)జడేజా 29, బెయిర్‌స్టో (బి)అక్షర్ 37, స్టోక్స్ (బి)బుమ్రా 70, ఫోక్స్ (సి)శ్రీకర్ భరత్ (బి)అక్షర్ 4, రేహన్ అహ్మద్ (సి)శ్రీకర్ భరత్ (బి)బుమ్రా 13, హార్ట్లీ (బి)జడేజా 23, మార్క్ వుడ్ (బి)అశ్విన్ 11, లీచ్ (నాటౌట్) 0, అదనం 3. (64.3ఓవర్లలో) 246పరుగులకు ఆలౌట్. **వికెట్ల పతనం:** 1/55, 2/58, 3/60, 4/121, 5/125, 6/137, 7/155, 8/193, 9/234, 10/246 **బౌలింగ్:** బుమ్రా 8.3-1-28-2, సిరాజ్ 4-0-28-0, జడేజా 18-4-88-3, అశ్విన్ 21-1-68-3, అక్షర్ 13-1-33-2.

ఇండియా తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (బ్యాటింగ్) 76, రోహిత్ శర్మ (సి)స్టోక్స్ (బి)లీచ్ 24, శుభ్‌మన్ గిల్ (బ్యాటింగ్) 14, అదనం 5. (23ఓవర్లలో వికెట్ నష్టానికి) 119పరుగులు. **వికెట్ల పతనం:** 1/80 **బౌలింగ్:** మార్క్ వుడ్ 2-0-9-0, హార్ట్లీ 9-0-63-0, లీచ్ 9-2-24-1, రెహాన్ అహ్మద్ 3-0-22-0

ఫైనల్‌కు రోహన్ జోడి

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియన్ ఓపెన్ పురుషుల డబుల్స్ ఫైనల్లోకి రోహన్ బొప్పన్న–మాథ్యూ ఎబ్డెన్ జోడీ దూసుకెళ్లింది. గురువారం జరిగిన సెమీఫైనల్లో బొప్పన్న–ఎబ్డెన్ జోడీ 6–3 3–6 7–6(10–7)తో థామస్, ఝాంగ్ జోడీని మట్టికరిపించి.. తొలిసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్‌కు దూసుకెళ్లారు. ఈ జంటకు వరుసగా ఇది రెండో టైటిల్ పోరు కావడం విశేషం. గత ఏడాది యుఎస్ ఓపెన్ ఫైనల్లో బోపన్న, మాథ్యూ జోడీ రన్నరప్‌తో సరిపెట్టుకుంది. దాంతో, ఈ స్టార్ జోడీ ఈసారి టైటిల్ చేజిక్కించుకొని చరిత్ర తిరగరాయాలనే కసితో ఉంది.

మహిళల సింగిల్స్ ఫైనల్‌కు సబలెంక, జెంగ్



మహిళల సింగిల్స్ ఫైనల్లోకి డిఫెండింగ్ ఛాంపియన్, అర్యానా సబలెంక(బెలారస్), చైనాకు చెందిన కిన్వెన్ జెంగ్ ప్రవేశించారు. గురువారం జరిగిన సెమీస్‌ఫైనల్లో వీరు ప్రత్యర్థులపై వరుససెట్లలో నెగ్గారు. తొలి సెమీస్‌లో సబలెంకా 7–6(7–2), 6–4తో 4వ సీడ్, అమెరికా యువ సంచలనం కోకా గాఫ్‌ను వరుససెట్లలో చిత్తు చేసింది. 2023లో జరిగిన నాలుగు గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లోనూ సెమీస్‌కు చేరిన సబలెంకా.. ఆస్ట్రేలియన్ ఓపెన్‌ను చేజిక్కించుకొని.. యుఎస్ ఓపెన్ రన్నరప్‌గా నిలిచింది. ఓ బిడ్డకు తల్లి అయిన సబలెంక గత ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్‌ను చేజిక్కించుకొని తొలిసారి వార్తల్లో నిలిచిన విషయం తెలిసిందే. రెండో సెమీస్‌లో చైనాకు చెందిన కిన్వెన్ జెంగ్ 6–4, 6–4తో యాస్టెమ్స్కా (ఉక్రెయిన్)ను ఓడించి ఫైనల్‌కు చేరింది.

నేడు పురుషుల సింగిల్స్ సెమీఫైనల్స్
జకోవిచ్ × సిన్నర్ మెద్వదేవ్ × జ్వెరేవ్



జాతీయ స్థాయి పారా అథ్లెటిక్స్‌లో అనంత విద్యార్థుల సత్తా

క్రీడాకారులను సత్కరించిన ఎస్‌పి

ప్రజాశక్తి – అనంతపురం

ఈ నెల 9 నుంచి 13 వరకు గోవా వేదికగా జరిగిన 22వ జాతీయ స్థాయి పారా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్–2024 పోటీల్లో అనంతపురం జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. జిల్లా నుంచి నలుగురు క్రీడాకారులు పాల్గొనగా ఒకరు బంగా రం, రెండు సిల్వర్ పతకాలు సాధించారు. జిల్లాకు చెందిన సాకే బాబు షాట్‌పుట్‌లో బంగారు పతకం, ఇదే పోటీల్లో నీలం పల్లవి, సంజీవరెడ్డిలు సిల్వర్ పతకాలు దక్కించుకున్నారు. పతకాలు సాధించిన ముగ్గురు క్రీడాకారులను జిల్లా ఎస్‌పి కెకెఎన్. అన్బు రాజన్ గురువారం తన కార్యాలయంలో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, శ్రీనివాసులు, సాప్ కోచ్ మంజుల పాల్గొన్నారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68